www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
11-07-2024
సంపుటి : 01 | సంచిక : 68 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# టీ టీడీపీ చీఫ్‌గా మల్లారెడ్డి?

## టీడీపీతో కాంగ్రెస్, బీజేలకు చేరవయ్యేలా వ్యూహం

చంద్రబాబుతో రేవంత్ రెడ్డికి చెక్..
టీడీపీఎన్డీఏ కూటమితో కేసుల నుంచి బయటకు
ఒక్క దెబ్బకు రెండు పిట్టలను కొట్టేలా ప్లాన్
2029 ఎన్నికల్లో చక్రం తిప్పేందుకు ఎత్తుగడ
తెలుగుదేశం పార్టీ నుంచే రాజకీయ ప్రస్థానం స్టార్ట్
తాజాగా అదే పార్టీ అండతో
ఎదిగేందుకు ప్రణాళిక



తెలంగాణ రాజకీయాల్లో మాస్ లీడర్ ఎవరంటే ఠక్కున గుర్తొచ్చే నేత మాజీ మంత్రి మల్లారెడ్డి. మాస్ మల్లన్నగా అందరూ ముద్దుగా పిలుచుకునే మల్లారెడ్డి తన రాజకీయ జీవితాన్ని కీలక మలుపు తిప్పాలని నిర్ణయించుకున్నారట. స్వతహాగా వ్యాపారవేత్త అయిన మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేతగా బాగా ఫేమస్ అయ్యారు. ఇక 2014లో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి.. తన క్రేజ్ ను మరింత పెంచుకున్నారు. మల్లారెడ్డి అంటేనే ఓ బ్రాండ్‌గా అందరికీ గుర్తిండిపోయారు. 2014లో తొలిసారిగా మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన మల్లారెడ్డి.. ఆ తర్వాత బీఆర్ఎస్ గూటికి చేరి.. రాష్ట్రమంత్రి కూడా అయిపోయారు.

**విశ్వంభర, హైదరాబాద్ :**
ఇక గత ఎన్నికల్లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచినా, బీఆర్ఎస్ ఓడిపోవడంతో మల్లారెడ్డికి కష్టాలు ఎక్కువయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం లో కీలకంగా వ్యవహరించిన మల్లారెడ్డి అప్పట్లో విసిరిన చాలెంజ్ లతో ప్రత్యర్థుల సంఖ్యను పెంచుకున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో వ్యక్తిగతంగా కూడా మల్లారెడ్డికి పొసగకపోవడంతో ఇప్పుడు రాజకీయంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ ఓడిపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వానికి టార్గెట్‌గా మారడంతో అండ కోసం ఎదురుచూసిన మల్లారెడ్డి బీజేపీలో చేరాలని... ఆ పార్టీతో టచ్ లోకి వెళ్లారని ప్రచారం జరిగింది. కానీ, మల్లారెడ్డికి బీజేపీలో చేర్చుకునే విషయంలో సానుకూల స్పందన లేకపోవడంతో మరింత ఇబ్బందులు పెరిగిపోయాయట. ఐతే ఈసారి మల్లారెడ్డి వేసిన ప్లాన్‌తో మొత్తం తెలంగాణ రాజకీయం రక్తి కట్టేలా కన్పిస్తోంది.

**కాంగ్రెస్ లో చేరాలనే ఆలోచనను విరమించుకున్నారు..**

ప్రస్తుతం మల్లారెడ్డితోపాటు ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి కూడా ఎమ్మెల్యేలుగా ఉన్నారు. బీఆర్ఎస్ ఓటమి తర్వాత **మిగతా2లో...**



## పద్మశ్రీ గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ. 25లక్షలు

### నెలనెలకు రూ.25 వేల పెన్షన్

- తెలుగు కళాకారులు ఎక్కడ ఉన్నా గౌరవించుకోవాలి
- పద్మ విభూషణ్, పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన వారిని సన్మానించుకోవటం సంతోషం
- రాజకీయాలకు అతీతంగా సరికొత్త సంప్రదాయాన్ని నెలకొల్పాం
- అవార్డు గ్రహీతల సన్మాన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :**
పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన ఒక్కొక్కరికి రూ. 25లక్షలు అందజేస్తామని , అదేవిధంగా నెలకు రూ. 25వేల పెన్షన్ అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన తెలుగువారిని తెలంగాణ ప్రభుత్వం ఆదివారం శిల్పకళా వేదికగా సన్మానించింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పద్మ విభూషణ్, పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన వారిని సన్మానించుకోవటం సంతోషంగా ఉందన్నారు. ఇది రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం, సరికొత్త సంప్రదాయాన్ని నెలకొల్పాలని చేసిన కార్యక్రమం. తెలుగు కళాకారులు ఎక్కడ ఉన్నా గౌరవించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు **మిగతా2లో...**

## తెలంగాణ కొత్త డీజీపీగా జితేందర్

- కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన తొలి డీజీపీగా గుర్తింపు
- ఇప్పటి వరకు హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు
- ఏఎస్పీ నుంచి డీజీపీ వరకు జితేందర్ ప్రయాణం
- ప్రస్తుత డీజీపీ రవి గుప్తాను హోమ్ శాఖ స్పెషల్ సీఎస్‌గా బదిలీ



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణకి కొత్త డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం అధికారిక ఉత్తర్వులు విడుదలయ్యాయి. నిజానికి మంగళవారమే ఉత్తర్వులు రావాల్సి ఉన్నప్పటికీ సీఎం మహబూబ్ నగర్ పర్యటన కారణంగా వాయిదా పడినట్టు తెలుస్తోంది. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం నియమించిన తొలి డీజీపీ జితేందర్ కానున్నారు. ప్రస్తుతం, జితేందర్ డీజీపీ హోదాలోనే హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా **మిగతా2లో...**




## తెలంగాణలో 15 మంది ఐపీఎస్‌ల బదిలీ

- శాంతిభద్రతల అదనపు డీజీపీగా మహేశ్ భగవత్ నియామకం
- గ్రేహౌండ్స్ ఏడీజీగా స్టీఫెన్ రవీంద్ర నియామకం
- టీజీఎస్పీ బెటాలియన్ల అదనపు డీజీగా సంజయ్ కుమార్ నియామకం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో 15 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం **మిగతా2లో...**

## హీరో రాజ్ తరుణ్‌పై కేసు నమోదు

- ఎఫ్ఐఆర్ ఫైల్ చేసిన నార్సింగి పోలీసులు
- రెండోసారి ప్రియురాలు లావణ్య ఫిర్యాదు
- పదేళ్ల కాపురం.. ఒకసారి అబార్షన్
- హీరోయిన్ మాల్వీ మల్హోత్రా ఎంట్రీతోనే ఇబ్బందులు
- మాల్వీతో ఎఫైర్ పెట్టుకుని తనను వదిలేశాడని ఫిర్యాదు
- నేడు మీడియా ముందుకు వస్తామన్నలావణ్య అడ్వోకేట్

2

## భూ సేకరణలో మానవీయ కోణంతో వ్యవహరించాలి

### రైతులతో కలెక్టర్లు నేరుగా మాట్లాడాలి

ఆర్ఆర్ఆర్ అంతటికీ ఒకే నెంబర్
ప్రత్యామ్నాయ భూ కేటాయింపులతో అటవీ భూముల స్వాధీనం
ఎన్ హెచ్ఏఐ పరిధి సమస్యలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**విశ్వంభరా హైదరాబాద్:** జాతీయ రహదారులకు భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువ పరిహారం వస్తుందో అంత రైతులకు దక్కేలా చూడాలన్నారు. తెలంగాణలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ఏఐ) పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ **మిగతా2లో...**

## ఐటీ రిటర్న్స్ దాఖలు చేసే రైతులకూ రైతు భరోసా

### ఐటీ చెల్లింపులుదారులకు నో చాన్స్

- ప్రకటించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు
- ఖమ్మం రైతుల నుంచి మంత్రుల సబ్ కమిటీ అభిప్రాయాల సేకరణ
- హాజరైన మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి, శ్రీధర్ బాబు



**విశ్వంభర, ఖమ్మం :** రైతు భరోసా పథకంపై విధివిధానాలను ఖరారు చేసేందుకు నలుగురు మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ సబ్ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, **మిగతా2లో...**

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 111 | ₹ 133 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 193 | ₹ 219 |

## మీడియాకి తెలంగాణ హైకోర్టు వార్నింగ్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో గోప్యత పాటించాలి
- జడ్జీలు, వారి కుటుంబ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు, ఫోటోలను బహిర్గతం చేయొద్దు

2

## రాష్ట్రంలో ప్రాథమిక హక్కులను రక్షించాలి..

గవర్నర్‌కు దాసోజు శ్రవణ్ కీలక లేఖ
పోలీసుల తీరుపై గవర్నర్‌కు కంప్లైంట్

2

## ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు రక్షణ లేదా?



- జర్నలిస్ట్‌ల పట్ల పోలీసుల వైఖరిని ఖండిస్తున్నాం
- నిన్న బల్కంపేటలో మహిళా జర్నలిస్ట్‌ల పట్ల దురుసుగా ప్రవర్తిన
- ఈరోజు ఓయూలో రిపోర్టర్ గల్లా పట్టి అక్రమంగా అరెస్ట్
- పోలీసుల తీరుపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

2

## పద్మశ్రీ గ్రహీతలకు ఒక్కొక్కరికి
# రూ. 25లక్షలు

(మొదటి పేజీ తరువాయి)
గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న కవులు, కళాకారులు ఒకానొక పరిస్థితుల్లో వెనక్కి తిరిగి చూసుకుంటే దుర్భర పరిస్థితులు ఉంటున్నాయని రేవంత్ అన్నారు. ఈ నేపథ్యంలో వివిధ రంగాల్లో రాణించిన వారిని గుర్తించాల్సిన బాధ్యత మన ప్రభుత్వంపై ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. వెంకయ్యనాయుడును సన్మానించడం మనల్ని మనమే సన్మానించుకోవడమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ వెళ్లే తెలుగు రాజకీయ నేతలకు వెంకయ్య నాయుడు పెద్ది దిక్కు అని పేర్కొన్నారు. వెంకయ్య నాయుడుకు రాష్ట్రపతి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని, ఆయన రాష్ట్రపతి కావాలని ఆకాంక్షిస్తున్నానని రేవంత్ రెడ్డి అన్నారు. అప్పట్లో జైపాల్ రెడ్డి, వెంకయ్య జంటకవుల్లా ఉండేవారు.. ప్రజలకోసం పరితపించేవారని రేవంత్ అన్నారు.

## తెలంగాణ కొత్త డీజీపీగా జితేందర్

(మొదటి పేజీ తరువాయి)
పనిచేస్తున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు.

**ఏఎస్పీ నుంచి డీజీపీ వరకు జితేందర్ ప్రయాణం**

పంజాబ్ లోని జలంధర్ లో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన జితేందర్ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. నిర్మల్‌లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ)గా ఆయన కెరీర్ ప్రారంభమైంది. ఆ తర్వాత బెల్లంపల్లిలో అదనపు ఎస్పీగా పనిచేశారు. నక్సలైట్ల కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న సమయంలో మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా కీలక పాత్ర పోషించారు. జితేందర్ 2004 నుండి 2006 వరకు ఢిల్లీ సిబిఐ, గ్రేహౌండ్స్‌తో కలిసి పనిచేశారు. తరువాత ఆయన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి) గా పదోన్నతి పొంది విశాఖపట్నంలో బాధ్యతలు చేపట్టారు. అప్పాలో కొంతకాలం పనిచేసి తెలంగాణ ఉద్యమం సమయంలో వరంగల్ రేంజ్ డీఐజీగా కొనసాగారు.

**సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన డీజీపీ**

ఆంధ్రప్రదేశ్ సీఐడీ, ఎంక్వయిరీ కమిషన్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ లో బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం హైదరాబాద్ కమిషనరేట్లో ట్రాఫిక్ అదనపు కమిషనర్ గా పనిచేశారు. తర్వాత తెలంగాణ శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీగా, జైళ్లశాఖ డీజీగా పనిచేశారు. ప్రస్తుతం హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఆయన 2025 సెప్టెంబరు లో పదవీవిరమణ చేయనున్నారు. ఇప్పుడు డీజీపీగా నియమితులైతే 14 నెలలపాటు కొనసాగే అవకాశముంది. ప్రస్తుత డీజీపీ రవిగుప్తాను శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు ఎన్నికల కమిషన్ నియమించింది. అప్పట్లో డీజీపీగా ఉన్న అంజనీకుమార్ ని క్రమశిక్షణ చర్య కింద సస్పెండ్ చేసిన తర్వాత రవిగుప్తాను ఎంపిక చేసింది. అప్పటినుంచి ఆయనే డీజీపీగా ఉన్నారు. తాజాగా జితేందర్ తెలంగాణ నూతన డీజీపీగా నియమితులయ్యారు. తెలంగాణ డీజీపీగా నియమితులైన సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జితేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

**డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్..**

తెలంగాణ ప్రభుత్వం ఇంత మంచి అవకాశం తనకు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పరిరక్షిస్తామని చెప్పారు. నార్కోటిక్, సైబర్ క్రైమ్ పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నార్కోటిక్ బ్యూరోకు ఇటీవల వాహనాలు కూడా ఇచ్చారని డీజీపీ జితేందర్ తెలిపారు.

## టీ టీడీపీ చీఫ్‌గా మల్లారెడ్డి?

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఇద్దరూ తొలుత కాంగ్రెస్‌లోకి వెళ్లాలని భావించారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే విభేదాలు ఉండటంతో ఆ పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదని ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో మల్లారెడ్డి విద్యా సంస్థల్లో ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం పూనుకోవడం, వరుసగా కేసులు నమోదు చేయిస్తుండటం, తన నియోజకవర్గంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లను కాంగ్రెస్ లో చేర్చుకుంటూ తనను ఒంటరిని చేయాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తుండటం వల్ల... హస్తం పార్టీతో చేతులు కలపాలనే ఆలోచనను విరమించుకున్నారు మల్లారెడ్డి.

**పొలిటికల్ కెరీర్‌ను ప్రారంభించిన టీడీపీలో చేరేందుకు ప్లాన్..!**

ఆ తర్వాత కమలం గూటికి చేరేందుకు ప్రయత్నించారు. కావాలంటే రాజీనామా చేసైనా బీజేపీ తరపున పోటీ చేసి గెలుస్తానంటూ ఆఫర్ కూడా ఇచ్చారట. అయితే కారణమేదైనా బీజేపీ నుంచి కూడా రెడ్ సిగ్నలే పడింది. ప్లాన్ A కింద కాంగ్రెస్, ప్లాన్ Bగా బీజేపీని ఎంచుకున్న మల్లారెడ్డి.. ఆ రెండు పార్టీల నుంచి ప్రతికూల స్పందనే ఎదురవడంతో ఈ సారి గమ్మత్తైన ప్లాన్ వేశారు. అదే తన పొలిటికల్ కెరీర్‌ను ప్రారంభించిన టీడీపీలో చేరడం ద్వారా తన రాకను అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీ నేతలకు ఒకేసారి చెక్ చెప్పాలని భావిస్తున్నారు మల్లారెడ్డి.

**టీడీపీలో చేరడం వల్ల ఎన్నో ప్రయోజనాలు..!**

తెలంగాణలో టీడీపీకి పెద్దగా బలం లేకపోయినా, తనకు ప్రభుత్వం నుంచి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే టీడీపీలో చేరడం కూడా మంచిదే అన్న ఆలోచనలో పడ్డారు మల్లారెడ్డి. ప్రస్తుతం తెలంగాణ టీడీపీకి పెద్ద దిక్కు లేకపోవడం కూడా తనకు కలిసివస్తుందని భావిస్తున్నారు. తనతోపాటు ఒకరిద్దరు ఎమ్మెల్యేలను టీడీపీలోకి తీసుకువెళ్లి.. ఆ పార్టీ తెలంగాణ రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా చక్రం తిప్పాలని భావిస్తున్నారట మల్లన్న. ప్రస్తుతం బీజేపీటీడీపీ మధ్య పొత్తు ఉండటం, కేంద్రంలో టీడీపీ కీలకంగా మారడంతో తాను టీడీపీలో ఉంటే తనకు ఇండైరెక్ట్‌గా బీజేపీ మద్దతు ఉంటుందని భావిస్తున్నారు మల్లన్న. అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మధ్య సత్సంబంధాలు ఉండటంతో... తెలంగాణ ప్రభుత్వం తన వైపు చూసే అవకాశమే ఉండదని ప్లాన్ చేస్తున్నారట మల్లన్న...

**టీడీపీలో చేరితే ముప్పు నుంచి తప్పించుకోవచ్చనే యోచన..**

తెలంగాణలోనూ తన అస్థిత్వాన్ని కాపాడుకోవాలని చూస్తున్న టీడీపీ... మల్లారెడ్డి వంటివారు చేరతామంటే కాదనడనే ధీమాలో మల్లన ఉన్నారని తెలుస్తోంది. దీంతో తన మదిలోని ఆలోచనను సన్నిహితులతో పంచుకున్నారట.. ఇక టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తన ప్రతిపాదనను తీసుకెళ్లేందుకు అడుగులు వేస్తున్నారని సమాచారం. టీడీపీలో చేరితే ప్రస్తుతానికి తనకు ఉన్న ముప్పు నుంచి తప్పించుకోవచ్చని.. నాలుగున్నరేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లోనూ బీజేపీతో అలయెన్స్‌తో రాజకీయంగా చక్రం తిప్పవచ్చనే అంచనాలో ఉన్నారట మల్లన్న. టీడీపీ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన మల్లారెడ్డి.. మళ్లీ టీడీపీ గూటికే వెళతారనే ప్రచారం తెలంగాణలో హాట్‌టాపిక్‌గా మారింది. వాస్తవానికి సీఎం రేవంత్‌రెడ్డికి, మల్లారెడ్డికి టీడీపీలో ఉన్నప్పుడే విభేదాలు మొదలయ్యాయి. అప్పటి విబేధాలను ఇప్పుడు పరిష్కరించుకునేందుకు అదే టీడీపీని వాడుకోవాలని మల్లారెడ్డి చూడటం ఆసక్తికరంగా మారింది. ఇక బీజేపీ కూడా టీడీపీ మిత్రపక్షం కావడం వల్ల భవిష్యత్‌లో ఎలాంటి రాజకీయ మార్పులు జరిగినా తాను సేఫ్ జోన్‌లో ఉంటారనే ఆలోచనతోనే టీడీపీయే బెస్ట్ చాయిస్‌గా ఎంచుకోవాలని మల్లారెడ్డి ఆలోచిస్తున్నారని అంటున్నారు. మొత్తానికి మాస్ మల్లన్న పొలిటికల్ యాక్షన్‌పై తెలంగాణలో హాట్ డిబేట్ జరుగుతోంది.

# ఐటీ రిటర్న్స్ దాఖలు చేసే రైతులకూ రైతు భరోసా



**ప్రభుత్వం నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకోదు**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఖర్చు పెట్టే ప్రతి రూపాయి ప్రజలు నుండి వస్తున్న పన్నులు. గత ప్రభుత్వం ఎవరి అభిప్రాయం తీసుకోకుండా.. నాలుగు గోడలు మధ్య నిర్ణయం తీసుకుని ప్రజల మీద రుద్దింది. ఇది ప్రజా ప్రభుత్వం. ప్రతి పైసకి మేము బాధ్యులం. ప్రజలకి చెప్పాలిన బాధ్యత మాపై ఉంది. ప్రభుత్వం రైతు బంధు విషయంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సబ్ కమిటీగా మిగిలిన తొమ్మిది జిల్లాల్లో రైతులు, ప్రజల అభిప్రాయం తీసుకుంటాం. వారి అభిప్రాయాల నివేదికను అసెంబ్లీలో పెట్టి నిర్ణయం తీసుకుంటామని పొంగులేటి అన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారు. కొన్ని రోజుల్లోనే అసెంబ్లీ సమావేశాలు ఉంటాయి. ప్రధాన ప్రతిపక్షం అని చెప్పకునే వాళ్లు అన్ని విషయాలు అసెంబ్లీలో ప్రస్తావిస్తే చర్చిద్దాంమని పొంగులేటి అన్నారు.

(మొదటి పేజీ తరువాయి)
మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు ఉన్నారు. జిల్లాల వారిగా మంత్రుల సబ్ కమిటీ సమావేశాలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించనున్నారు. ఈ క్రమంలో తొలుత ఖమ్మం జిల్లా నుంచి రైతు భరోసా సమావేశాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన రైతు భరోసా పథకం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, మంత్రులు మాట్లాడారు.

**రాజకీయాలకు అతీతంగా రైతులసలహాలు, సూచనలు స్వీకరిస్తాం**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం ధృడ సంకల్పంతో ఉందని చెప్పారు. త్వరలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని అన్నారు. రైతు భరోసా పథకం అమలుకోసం ఉమ్మడి పది జిల్లాల్లో పర్యటించి ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటామని చెప్పారు. అందరి అభిప్రాయాల మేరకు విధివిధానాలు నిర్ణయించి ప్రభుత్వంకు నివేదిక అందిస్తామని భట్టి అన్నారు. రైతులు, రైతు సంఘాల అభిప్రాయాలు తీసుకుంటామని, రాజకీయాలకు అతీతంగా రైతుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరిస్తామని భట్టి చెప్పారు.

**రైతుల ఆలోచనలు ప్రకారమే ప్రభుత్వం ముందుకు**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం మీ ఆలోచనలు ప్రకారమే ముందుకు వెళ్తుంది. మీరిచ్చే సూచనలు రైతులకు భరోసా కల్పించాలి. గతంలో జరిగిన ఆర్థిక నష్టం మీ అందరికీ తెలుసు. సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. గతంలో రైతు బంధు కష్టం అయినా 7వేల కోట్లు ఇచ్చాం. ఇప్పుడు రైతు రుణమాఫీ చేస్తాం. శాసనసభ సమావేశాలలోపే అన్ని జిల్లాల్లో సబ్ కమిటీ సమావేశాలు పూర్తిచేస్తామని తుమ్మల అన్నారు. ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినవారికి రైతు భరోసా ఇవ్వరు.. వారు రైతు భరోసాకు అనర్హులు అనేది ప్రచారం మాత్రమేనని మంత్రి తుమ్మల అన్నారు. ఐటీ రిటర్న్స్ దాఖలు చేయడం వేరు.. ఐటీ చెల్లించటం వేరు. పిల్లల చదువులకోసం, ఇతరత్రా పనులకోసం రైతాంగం ఐటీ రిటర్న్స్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. అటువంటి వారికి ఎటువంటి నష్టం జరగదు. ఐటీ చెల్లింపులు ఎవరైతే చెల్లిస్తున్నారో వారిని మాత్రమే పరిగణలో తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్లారిటీ ఇచ్చారు.

# హీరో రాజ్ తరుణ్‌పై కేసు నమోదు



**విశ్వంభర, హైదరాబాద్ క్రైం :** నటుడు రాజ్ తరుణ్ లావణ్య ఎపిసోడ్‌లో రోజుకో ట్విస్ట్ బయటకు వస్తోంది. రాజ్ తరుణ్‌పై మొదటిసారి ఫిర్యాదు చేసినప్పుడు ఆధారాలు ఇవ్వలేదు. రెండోసారి ఆధారాలు ఇవ్వడంతో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. హీరోయిన్ మాల్వితో రాజ్ తరుణ్ ఉంటూ తనను మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. రాజ్ కుమార్ సోదరుడిపై కూడా ఆమె ఫిర్యాదు చేసింది. సోదరుడు తనను పలుమార్లు బెదిరించినట్లు తన ఫిర్యాదులో పేర్కొంది. మరోవైపు, మాల్వీ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను, తన తమ్ముడిని లావణ్య బెదిరిస్తున్నారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. లావణ్యపై గతంలో సైబరాబాద్ షీటీమ్‌కు కూడా ఫిర్యాదు చేశారు.

**అబార్షన్ చేయించాడు..**

రాజ్ తరుణ్ పదేళ్లుగా తనతో కాపురం చేస్తున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో లావణ్య పేర్కొన్నారు. తనకు కొన్నాళ్ల క్రితం అబార్షన్ చేయించినట్లు చెప్పారు. తాను అన్విక పేరుతో రాజ్ తరుణ్‌తో కలిసి ఉన్నట్లు చెప్పారు. అన్విక పేరుతో ఇద్దరం కలిసి విదేశాలకు కూడా వెళ్ళామన్నారు. మాల్వి వచ్చిన తర్వాత రాజ్ తరుణ్ తనను దూరం పెట్టారని లావణ్య ఆరోపించారు. మాల్వీ కోసం అతను ముంబై వెళ్ళాడని, దీనిని తాను ప్రశ్నించానని.. నాటి నుంచి తనను దూరం పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. లావణ్య ఫిర్యాదును ఆధారాలతో స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

**షాకింగ్ విషయాలు వెల్లడించిన కల్యాణ్ దిలీప్ సుంకర**

రాజ్ తరుణ్‌పై 420, 493, 506 కింద కేసు నమోదైనట్లు అడ్వొకేట్ కల్యాణ్ దిలీప్ సుంకర తెలిపారు. పోలీసులు వారం రోజుల పాటు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేశాక... అన్ని ఆధారాలు చూశాకే కేసు నమోదు చేశారన్నారు. వాట్సాప్ చాటింగ్‌లో లావణ్యను రాజ్ తరుణ్ బూతులు తిట్టాడన్నారు. లావణ్యకు అక్రమ సంబంధం అంటగట్టే ప్రయత్నంలో తన చేతిని తానే కాల్చుకున్నాడన్నారు. రాజ్ తరుణ్ మాట్లాడిన వాటికి ఆధారాలు లేవన్నారు. అతను మాట్లాడిన ఆడియో క్లిప్స్‌ను కూడా మీడియాకు విడుదల చేస్తామన్నారు.

**రేపో మాపో పోలీస్ స్టేషన్‌కు రాజ్ తరుణ్**

రాజ్ తరుణ్‌పై సుదీర్ఘ విచారణ అనంతరం పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. రేపో మాపో పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తారని తెలిపారు. లావణ్య బూతులు మాట్లాడుతోందని చాలా చానల్స్‌లో వైరల్ చేశారని.. కానీ బీరు బాటిల్స్‌తో లావణ్యను రాజ్ తరుణ్ కొట్టడమో... లేక కొట్టుకునేలా చేశాడో తెలియదు... ఆ సమయంలో తిట్టిందన్నారు. అమ్మాయిని చిత్రవధ చేస్తుంటే... నిస్సహాయస్థితిలో తిరగబడకుండా ఏం చేస్తుందన్నారు. నేటి ఉదయం మీడియా ముందుకు పూర్తి వివరాలతో వస్తామన్నారు. మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు.

## భూ సేకరణలో మానవీయ కోణంతో
# వ్యవహరించాలి

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా భూ సేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువ ఉండడం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని కలెక్టర్లు తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్లు రైతులతో పిలిచి మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం, ఉత్తర భాగం వేర్వేరుగా చూడొద్దని, ఆ రెండింటికి కలిపి ఒకే నెంబర్ కేటాయించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరగా, ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఎన్ హెచ్ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం (ట్రైపార్టియేట్ అగ్రిమెంట్) కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. వెంటనే దానిని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణలో ఉన్న ఆటంకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అలైన్ మెంట్ విషయంలో పొరపడి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారని, దాంతో హైకోర్టు స్టే ఇచ్చిందని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం నాటికి కౌంటర్ దాఖలు చేయాలని కలెక్టర్ కు ముఖ్యమంత్రి సూచించారు. నాగ్ పూర్‌విజయవాడ కారిడార్ లో ఖమ్మం జిల్లాలో భూ సేకరణ పరిస్థితి ఏమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల గుండా రహదారి పోతుందని, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తల్లాడదేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్నందున, ప్రస్తుతం ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్ హెచ్ఏఐ అధికారులు సూచిస్తున్నారని, దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని, జాతీయ రహదారిగానే దానిని కొనసాగించాలని మంత్రి తుమ్మల అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ నాగ్ పూర్‌విజయవాడ కారిడార్ లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని, రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అవసరమైన చోట్ల అండర్ పాస్ లు నిర్మించాలని ఎన్ హెచ్ఏఐ అధికారులను కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి బదులిచ్చారు. జాతీయ రహదారుల వెంట వ్యవసాయ వాహనాలు, రైతులు వినియోగించుకునేలా గ్రావెల్ రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదన సమీక్షలో వచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి తెలిపారు. గ్రావెల్ రహదారి నిర్మించడం వలన రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

**సమన్వయంతో ముందుకు సాగండి...**

ఆర్మూర్‌జగిత్యాలమంచిర్యాల, విజయవాడనాగ్ పూర్ కారిడార్ రహదారులకు సంబంధించి అటవీ శాఖ భూముల బదలాయింపు సమస్య సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వచ్చింది. స్పందించిన ముఖ్యమంత్రి అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని నిజామాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను అటవీ శాఖకు బదలాయించి అటవీ శాఖ భూములను తీసుకొని రహదారుల నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ శాఖల పరిధిలోని యుటిలిటీస్ తొలగింపునకు సంబంధించి చెల్లింపులు వేగవంతం చేయాలని, ఏవైనా సమస్యలుంటే ఎన్ హెచ్ఏఐతో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు.

**రెండు నెలల్లో హైదరాబాద్-విజయవాడ విస్తరణ పనులు**

హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులకు భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్ చౌదరిని కోరారు. రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన బదులిచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శేషాద్రి, సీఎంవో అధికారులు మాణిక్ రాజ్, చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, మౌలిక వసతుల సలహాదారు శ్రీనివాసరాజు, ఎన్ హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి రజాక్, పీసీసీఎఫ్ డోబ్రియల్, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, జాయింట్ సెక్రటరీ హరీష్, మెదక్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నిజామాబాద్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో 15 మంది
# ఐపీఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)
బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. శాంతి భద్రతల అదనపు డీజీపీగా మహేశ్ భగవత్, హోంగార్డులు, ఆర్గనైజేషన్ అదనపు డీజీగా స్వాతి లక్రా, గ్రేహౌండ్స్ ఏడీజీగా స్టీఫెన్ రవీంద్ర, పోలీస్ పర్సనల్ అడిషనల్ డీజీగా విజయ్ కుమార్, టీజీఎస్పీ బెటాలియన్ల అదనపు డీజీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. రాచకొండ పోలీస్ కమిషనర్‌గా సుధీర్ బాబు, ఏసీబీ డైరెక్టర్‌గా తరుణ్ జోషి, మల్టీజోన్ 1 ఐజీగా చంద్రశేఖర్ రెడ్డి, మల్టీజోన్ 2 ఐజీగా సత్యనారాయణ, రైల్వే, రోడ్ సేఫ్టీ ఐజీగా రమేశ్ నాయుడు, మెదక్ ఎస్పీగా ఉదయ్ కుమార్ రెడ్డి, వనపర్తి ఎస్పీగా ఆర్ గిరిధర్, హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీగా బాలస్వామి, హైదరాబాద్ వెస్ట్ జోన్ డీసీపీగా చంద్రమోహన్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీగా రక్షితమూర్తిని నియమించారు.

## ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు రక్షణ లేదా?

**విశ్వంభర, హైదరాబాద్ :** ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు రక్షణ లేదా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు నిరసనలు వ్యక్తం చేస్తుంటే... విధి నిర్వహణలో భాగంగా కవర్ చేయడానికి వెళ్లిన జర్నలిస్ట్‌ల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ అంశంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్ట్‌ల పట్ల పోలీసుల వైఖరిని ఖండిస్తున్నట్లు చెప్పారు. నిన్న బల్కంపేటలో మహిళా జర్నలిస్ట్‌ల పట్ల దురుసుగా ప్రవర్తించారని, ఈరోజు ఓయూలో రిపోర్టర్ గల్లా పట్టి అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. జర్నలిస్ట్‌లకు రక్షణ లేదా? అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన జర్నలిస్ట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో ప్రాథమిక హక్కులను రక్షించాలి..

**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు కీలక లేఖ రాశారు. రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యార్థి సంఘ నేతలు, జర్నలిస్టులపై పోలీసులు దాడులు చేస్తున్నారని లేఖ ద్వారా గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో మీరు జోక్యం చేసుకుని రాష్ట్రంలో ప్రాథమిక హక్కులను రక్షించాలని గవర్నర్‌ని కోరారు. కాగా, ప్రిపేర్ అయ్యేందుకు తగిన సమయం లేదని గ్రూప్స్, డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని గత కొన్ని రోజులుగా నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. పలు చోట్ల నిరుద్యోగుల ఆందోళనలు ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టులు చేస్తున్నారు. నిరుద్యోగుల ఆందోళనలను కవర్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నేత దాసోజు గవర్నర్‌కు కంప్లైంట్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

## మీడియాకి తెలంగాణ హైకోర్టు వార్నింగ్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనం సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. ఈ కేసులో బుధవారం విచారణ జరిపిన హై కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో అన్ని పార్టీలు సంయమనం పాటించాలని కోర్టు సూచించింది. మీడియాని కూడా గోప్యత పాటించాలని హెచ్చరించింది. జడ్జీలు, వారి కుటుంబ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు, ఫోటోలను బహిర్గతం చేయొద్దని మీడియాకి సూచించింది. వ్యక్తిగత జీవితాల్లోకి ప్రవేశించకూడదని కోర్టు నొక్కి చెప్పింది. ఈ నెల 23న కేంద్రం కౌంటర్ దాఖలు చేస్తుందని పేర్కొన్న హైకోర్టు.. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. ఈ సున్నితమైన కేసుపై హైకోర్టు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తోందని, ఈ వ్యక్తిగత విషయాల జోలికి పోవద్దని అన్ని పక్షాలను కోరుతున్నట్లు న్యాయస్థానం పేర్కొంది. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ కేసులో రోజుకో మలుపు తిరుగుతోంది. ఎస్ఐబీ కార్యాలయంతోపాటు ఇతర ప్రైవేట్ ప్రదేశాల్లోనూ ప్రణీత్ రావు టీమ్ ఫోన్ ట్యాపింగ్ చేసిందని ప్రధానంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ కోణంలోనూ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మాజీ టాస్క్ ఫోర్స్ డీజీపీ రాధాకిషన్ రావు తోపాటు పలువురు పోలీసు అధికారులను దర్యాప్తు అధికారులు విచారించిన విషయం తెలిసిందే.

# సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం



**విశ్వంభర, వరంగల్ :** ఒక సామాన్య కార్యకర్తను గుర్తుంచుకుని, కార్యకర్తలే దేవుళ్ళు అని సంబోధించిన సీఎం రేవంత్ రెడ్డి నిజంగా దేవుడని గ్రేటర్ వరంగల్ రెండో డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అరికి-ళ్ల సుమన్ అన్నారు. కార్యకర్తలు లేనిదే పార్టీ లేదని, పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తల కృషి ఉందని గుర్తుచేస్తూ కార్యకర్తల గుండెల్లో శాశ్వతంగా రేవంత్ రెడ్డి నిలిచిపోతారని సుమన్ అన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ రెండవ డివిజన్ వంగపహాడ్‌లో రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేఖం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తలను భౌతికంగా దాడులు చేసినా తట్టుకుని పార్టీ అధికారం లోకి రావడానికి కృషి చేసిన ప్రతీ కార్యకర్తను గుర్తుంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి మహనీయుడని కొనియాడారు. అలాగే ప్రస్తుత వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు కూడా పార్టీలో సీనియర్‌లను గుర్తించాలని, కొత్తగా వచ్చిన ఇతర పార్టీల కార్యకర్తలకు, నాయకులకు వంత పాడకుండా పార్టీని కాపాడాలని కోరారు. అర్హులో గుర్తించి వారికి లబ్దీ చేకూరె లా చూడాలని సూచించారు.

# 50 పడకల ప్రభుత్వ వైద్యశాలకు శంకుస్థాపన



**విశ్వంభర, ఆమనగల్లు :** కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్ పట్టణంలో నూతనంగా 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనానికి ఎమ్మెల్యే కసిరెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, అధికారులు, ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆమనగల్ పట్టణంలో పది పడకలుగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పాత భవనాన్ని తొలగించి 50 పడకల ఆసుపత్రిగా స్థాయిని పెంచి 17 కోట్ల 50 లక్షల నిధులతో నూతన భవనాన్ని నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా వెల్దండ, ఆమనగల్, మాడ్గుల మండలాలకు సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ నెంబర్ బాలాజీ సింగ్, డిఎంహెచ్ఓ ఎంపిహెచ్ఓ తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు, డాక్టర్లు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

## ప్రొఫెసర్ కోదండరాం

**విశ్వంభర, హైదరాబాద్ :** ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తానని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త ఆధ్వర్యంలో కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రాం భవనంలో ఈనెల 12వ తేదీన నిర్వహించే ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం వాల్ పోస్టర్‌ను కోదండరాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులు చేసిన కృషి మరువలేనిదన్నారు. అనంతరం కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల భూమిని, పెన్షన్ ఇచ్చే విధంగా త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు, ఉద్యమకారుల బాధ్యత కోదండరాం సారు తీసుకోవాలని అన్నారు. హెల్త్ కార్డులు కూడా అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లే వినయ్ కుమార్, ఎల్బీనగర్ టీజేపీసీ చైర్మన్ కేవీ రంగారెడ్డి, టీజేఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొత్త రవి గుప్త, ఉప్పల శ్రవణ్, బిరెల్లి వెంకట్ రెడ్డి, రమేష్, కృష్ణా గుప్త, శ్రీధర్, ఏ ఆంజనేయులు గుప్త, శ్యాంసుందర్, సువర్ణ చలమరెడ్డి, మాణిక్ రెడ్డీ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా నరేందర్ యాదవ్

**విశ్వంభర, హుజూర్ నగర్ :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం హుజూర్ నగర్ కార్యాలయం సంఘ అధ్యక్ష ఎన్నిక జిల్లా సహకార అధికారి పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికలో ఒకే ఒక్క నామినేషన్ జక్కుల నరేందర్ యాదవ్ పేరు మీద వచ్చినందున జక్కుల నరేందర్ యాదవ్ ని ఏకగ్రీవంగా సంఘ అధ్యక్షుడిగా జిల్లా సహకార అధికారి పద్మ ప్రకటించారు. ఈ సందర్భంగా జక్కుల నరేందర్ మాట్లాడుతూ.. నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డికి, కోదాడ ఎమ్మెల్యే నలమాల ఉత్తమ్ పద్మావతి రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం హుజూర్నగర్ అభివృద్ధికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సుపరిండెంట్ పద్మజ, అసిస్టెంట్ రిజిస్టార్ అంజయ్య, ఆడిటర్ అంబేద్కర్, సంఘ ఉపాధ్యక్షులు కంచర్ల మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు దేవర మల్లీశ్వరి, జక్కుల మల్లమ్మ, ఇందిరాల లక్ష్మి, కందుల పద్మ, మీసాల శ్యాంసుందర్, గోసుల శ్రీను, కటారి శ్రీను, రాయల వెంకటేశ్వర్లు, దుగ్గి బ్రహ్మం, భూక్య లచ్చిరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వామపక్ష పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలిక కిడ్నాప్ లైంగిక వేధింపుల కేసులో మహిళకు జైలు శిక్ష

**విశ్వంభర, కోరుట్ల :** నిందితురాలకు కఠిన కారాగారా శిక్ష జరిమానా విధించిన జిల్లా జడ్జి నీలిమ కోరుట్ల పట్టణంలోని ఒక కాలానికి చెందిన బాలికను ఇంటి పక్క నివసిస్తున్న అస్మా అంజుమ్ అనే మహిళ బాలికకు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేసి అసభ్యకరమైన కార్యకలాపాలు చేయించి లైంగి కంగా లోబరుచుకుంది ఇట్టి విషయం గురించి బాలిక తండ్రికి తెలపడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా నిందితురాలు అస్మా అంజు పై పలు సెక్షన్ల కింద క్రైమ్ నెంబర్లతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితురాలు అస్మా అంజును కోర్టులో హాజరు పరిచారు. విచారించిన న్యాయమూర్తి నీలిమ, నిందితురాలైన అస్మా అంజుంకు రెండు వేరువేరు కేసుల్లో కిడ్నాప్ మరియు అసభ్యకర కార్యకలాపాలు చేయించిన దానికి ఐదు సంవత్సరాల కఠిన గారాగార శిక్ష పదివేల రూపాయల జరినామా విధించా రు. మరో కేసులో మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.5000 జరినామ విధిస్తూ జూన్ 26న తీర్పు వెల్లడించారు. నాటి నుంచి ముద్దాయి హాజరు కాకుండా తప్పించుకు తిరుగుచున్నది. ఈ విషయం తెలుసుకున్న న్యాయమూర్తి నీలిమ అస్మా అంజుమ్ పై అరెస్టు వారంటీ జారి చేశారు. పోలీసులు బుధవారం అస్మా అంజుం పట్టుకొని జైలుకు తరలించారు. ఈ కేసులో పబ్లిక్ ప్యాసికూటర్ మల్లికార్జున్, మరియు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ డీఎస్పీ రాజశేఖర్, ఎస్ఐ సతీష్, పృధ్వీధర్రాజు, ప్రమీల, రాజు నాయక్, కోరుట్ల, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు. అస్మా అంజుంకు శిక్ష పడడంలో కోర్టుకు సాక్షాధారాలు అందించి నేరస్తురాలికి శిక్ష పడడంలో కృషి చేసిన కోరుట్ల పోలీస్ అధికారులకు బాధితులు ధన్యవాదాలు తెలిపారు.




## గ్రామీణ వైద్యుల సేవలను ప్రభుత్వం మెరుగుపరచాలి

### జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఆర్ఎంపీ, పి.ఎం.పి సంఘాల ఉమ్మడి వేదిక సభలో తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పేదలకు ప్రాథమిక స్థాయిలో వైద్యం అందిస్తున్న గ్రామీణ వైద్యులు ఆర్ఎంపి, పి.ఎం.పిల సేవలను మెరుగుపరిచి గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన జీవోలను అమలు చేసి వాళ్లకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేసి వాళ్ళ స్థాయిలో వైద్యం అందే విధంగా చేయాల్సినటువంటి బాధ్యత ప్రభుత్వాలపైన ఉందన్నారు. పేదలకు అందుబాటులో ఉండి వైద్యం చేస్తున్న వాళ్లపైన కేసులు బనాయించడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. ప్రభుత్వాలు ఇచ్చిన జీవోల ప్రకారం అమలు చేసి వాళ్లకు వాళ్ళ పరిధిలో వైద్యం చేసే విధంగా చేయడమే దానికి సరైన పరిష్కారం మార్గం అన్నారు. పది పదిహేను రోజుల్లో ముఖ్యమంత్రిని కలిసి వారి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాన్నారు. ఇవాళ రాష్ట్రంలో ఈ సంఘాలన్ని కలిసి ఒక వేదికగా ఏర్పడి ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేయడం సంతోషకరమన్నారు. గ్రామీణ వైద్యులందరికీ కావలసింది గుర్తింపు ఆత్మగౌరవం సర్టిఫికెట్ అదే జెండా కావాలన్నారు. ఈ సమస్యను వాళ్ళూ వీళ్లు అనేటటువంటి కోణంలో చూడడం కాకుండా విజ్ఞానదర్శిని ప్రజా వైద్యం ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని మెడికల్ కౌన్సిల్ వారిని, డాక్టర్స్ అసోసియేషన్స్ వారిని, సంస్థలను కూర్చుండబెట్టి ఒక వేదిక ఏర్పాటు చేస్తే దానికి మార్గాన్ని కూడా ఆలోచించడానికి ఉంటుందన్నారు.

## వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

**విశ్వంభర, భూపాలపల్లి :** రాష్ట్రంలో మొత్తం వీఆర్ఏ లు 20555 మంది ఉండగా.. ఇందులో 81, 85 జీవో ప్రకారం 16758 మందిని రెగ్యులర్ చేసి ఉద్యోగాలు ఇచ్చారని మిగిలిన 61 సంవత్సరాలు దాటిన 3797 మంది వీఆర్ఏ స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని గత గవర్నమెంట్ 81, 85 జీవో జారీ చేసింది. ఇప్పటికీ సర్కులర్ జారీ అయి సంవత్సరాలు గడుస్తున్నా.. వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. దయచేసి ఇప్పటికయినా ప్రభుత్వం స్పందించి ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వీఆర్ఏ వారసుల జేఏసీ జిల్లా చైర్మన్ చెన్నపురి హరీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ గంధం సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూతం రాజు, కోశాధికారి చెన్నూరి కర్ణాకర్, మేనక, మధు సాయి వరుణ్, భద్రయ్య, రాజు, శంకర్, లావణ్య, నాలిక నర్సింహా, రాములు తదితరులు పాల్గొన్నారు.








# అమ్మల ఆనందోత్సవం.. మంచితనపు పర్వదినం

అక్కడంతా సందడి సందడిగా ఉంది. చిన్నపిల్లలు, తల్లిదండ్రులు, అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలు అందరితో పండుగ వాతావరణం నెలకొంది. అందరి ముఖాల్లో ఎంతో సంతోషం.. ఎనలేని సంతృప్తి కనిపిస్తున్నాయి. ఒకరికొకరు ప్రత్యక్షంగా తెలవకపోయినా.. ఏదో ఒక బంధం వారిని ఒక్కటిగా చేసినట్లు అందరి ముఖాల్లో చిరునవ్వులు... తమ సంతోషాన్ని చాటి చెప్పాలన్న తాపత్రయం. అతిథులు వచ్చీ రాగానే వారి చేతికి ఒక రబ్బర్ బ్యాండ్ వేస్తున్నారు. పరిశీలనగా చూస్తే దానిపై అందమైన జీవితం.. అని రాసి ఉంది. మహిళలకకైతే గాజులు, పులమాల, గోరింటాకు ఇస్తూ స్వాగతించారు. అందరికీ పాయసాన్ని ఇచ్చి నోరు తీపి చేశారు. వేదిక వైపు చూస్తే (Goodness Festival) మంచితనపు పండుగ అంటూ అందమైన పేరు దర్శనమిచ్చింది. అది అక్కడి వారి తీరుతెన్నులకు అద్దం పడుతున్నట్లు అగుపించింది. అందమైన పలు రకాల పుష్పాలు ఒక్కసారి విచ్చుకుంటే ఎంత అందగా ఉంటుందో.. మనసు ఎంత ఆహ్లాదంగా మారిపోతుందో.. ఈ భావనకు దృశ్యరూపం వేదిక వెనకాల చిత్రంగా ఆవిష్కృతమైంది. మంచితనం...మానవత్వం...ఆనందాల మేళవింపులా అక్కడి వాతావరణం అందరినీ ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకువెళ్లాయి..

**మూర్తీభవించిన ఆదర్శం**

ఆదర్శం మూర్తీభవించిన ఒక పెద్దాయన... అమ్మతనానికి నిలువెత్తు రూపంగా...ఆయనకు సరిజోడుగా అత్యంత వినయంగా వేదికపై మహిళామూర్తి ఆసీనులు అవుతుంటే కరతాళధ్వనులు మిన్నంటాయి. వారిని అభినందించాలని, శాలువాలతో సత్కరించాలని, పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించాలని, తమ జీవితాల్లో ఇంతటి ఆనందానికి కారకులైన వారి పాదాలు స్పృశించాలని , మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెప్పుకోవాలని అతిథులు ఆరాటపడ్డారు. ఒక్కొక్కరుగా తమ గుండె లోతుల్లోంచి వచ్చిన భావాలను పంచుకున్నారు. ఒక్కొక్కరు తమ అనుభవాలను చెప్తుంటే ఆ అమ్మ కళ్లలో ఆనందం.. ఆ అయ్య ముఖంలో అంతులేని సంతృప్తి...అందరిలో ఒకరకమైన భావోద్వేగం. మనుషుల్లో ఇంత మంచి వారుంటారా? ఇంత నిస్వార్థంగా ప్రజల కోసం తపించేవారుంటారా? ఇది కదా ఆదర్శం అనిపించేలా పలువురి ప్రసంగాలు సాగాయి..

వేలాది మంది మహిళల జీవితాల్లో వెలుగురు పూయిస్తున్న డాక్టర్ సామవేదం వేంకట కామేశ్వరి క్లినిక్ ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లైఫ్‌హెల్త్ రీ ఇన్‌ఫోర్స్‌మెంట్ గ్రూపు (LifeHRG) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ తార్నాకలోని సత్యోదయం రీట్రీట్ హౌస్‌లో జరిగిన హ్యాపీ మదర్స్ సెలబ్రేషన్, సేవ్ యుటెరస్ క్యాంపెయిన్‌లో వందల మంది తల్లిదండ్రులు పాల్గొని ఆమెకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

**నాకు ఇక పిల్లలు పుట్టరనుకున్నాను...**

ఒక మహిళ వేదికపైకి వచ్చింది. మాట్లాడటం ప్రారంభించింది. నా పేరు శాంతి.. పెళ్లయి పదేళ్లయినా పిల్లలు కలగలేదు. అత్తా మామల నుంచి ఒత్తిడి. ఎక్కడికి వెళ్లినా అదేప్రశ్న. సమాధానం చెప్పలేక సతమతమయ్యాను. ప్రశ్నలు ఎదుర్కోలేక పెళ్లిళ్లకు.. వేడుకలకే కాదు ఊరికి కూడా వెళ్లడం మానివేశాను. ముప్పయి ఏళ్లు దాటిపోయాయి. ఎక్కడికి వెళ్లినా ఎలాంటి ఫలితం లేకపోయింది. సంతానం కలుగుతుందన్న ఆశ నాలోనూ సన్నగిల్లింది. మా వారు ఎంత ధైర్యం చెప్పినా సముదాయించుకోలేక పోయాను. అటువంటి సమయంలో ఈ డాక్టర్ గారు పరిచయమయ్యారు. ఆమె నాకు అమ్మలా ధైర్యం చెప్పింది. నీకు ప్రెగ్నెన్సీ వస్తుంది. నేను చెప్పినట్లు చేస్తావా అని అడిగింది. అలాగే చేస్తానన్నాను. అతి తక్కువ మందులతో... ఆహార నియమాలతో కొద్ది రోజుల్లోనే నేను గర్భం దాల్చాను. నా జీవితంలో కొత్త ఆశలు చిగురించాయి. అయితే సంతోషం కూడా ఎక్కువ రోజులు నిలవలేదు. గర్భసంచిలో కాకుండా ఫెల్లోపియన్ ట్యూబ్‌లో గర్భం ఏర్పడటంతో దానిని ప్రాణానికే ప్రమాదం అయినందున దానిని తొలగించాల్సి వచ్చిందని అంటున్నప్పుడు ఆమె గొంతు గద్గదమైంది. కళ్లనుంచి నీళ్లు ఉబికి వచ్చాయి. ఒక ఉన్నది ఒకటే నాళం. తల్లిని కావడం ఇక అసాధ్యం అనుకున్నా. ఆ దశలోనూ డాక్టర్ గారు అండగా నిలిచారు. ధైర్యం చెప్పి చికిత్స అందించారు. 34 ఏళ్ల వయసులో మొదటిసారి తల్లినయ్యాను. ఇదుగో ఈ అమ్మాయే నా కూతురు. ఇప్పుడు దీనికి పదేళ్లు..అని పాపను చూపిస్తూ గర్వంగా ఉప్పొంగిపోయిందా తల్లి. 38 ఏళ్ల వయసులోనూ మరోసారి గర్భం దాల్చి మరో పాపకు జన్మనిచ్చాను. ఇద్దరు పిల్లలతో ఇప్పుడు నా జీవితం సంతోషంగా సాగుతోంది. ఇంతటి ఆనందానికి కారణం ఈ అమ్మ...డాక్టర్ కామేశ్వరి గారు. ఏమిచ్చి ఆమె రుణం తీర్చుకోగలను? వారి కుటుంబానికి ధన్యవాదాలు చెప్పుకోవడం తప్ప ఏం చేయగలను? అని ఆమె ముగించినప్పుడు కరతాళధ్వనులు మార్మోగాయి. ఆమె జీవితంలో అంతటి సంతోషానికి కారణమైన డాక్టర్ కామేశ్వరి మోములో సంతృప్తితో కూడిన ఓ చిరునవ్వు ప్రత్యక్షమైంది. ఆమె భర్త డాక్టర్ సూర్యప్రకాశ్ ఆమెను చూస్తూ ఒకింత గర్వంగా ఆమె వెన్ను తట్టారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు సంతానలేమితో తాము పడ్డ ఇబ్బందులు... డాక్టర్ కామేశ్వరి తమ జీవితాల్లో వెలుగులు నింపిన వైనంపై మాట్లాడారు. పలువురు ప్రముఖులు డాక్టర్ కామేశ్వరి, డాక్టర్ సూర్యప్రకాశ్‌లు చేస్తున్న సేవలను కొనియాడారు.

**పౌర సమాజం అప్రమత్తంగా ఉండాలి**

మహిళల ప్రాణరక్షణ కోసం అత్యవసరమైతే తప్ప తొలగించకూడని అతి ముఖ్యమైన అవయవం గర్భసంచి. సాధారణ అనారోగ్య సమస్యలు తలెత్తినా.. చికిత్సతో నయమయ్యే పరిస్థితులు ఉన్నా మహిళలను భయపెట్టి గర్భసంచిని తొలగించే హిస్టరెక్టమీ ఆపరేషన్లు చేయడం ప్రస్తుత సమాజంలో సర్వ సాధారణమైపోయింది. వైద్యరంగం పూర్తిగా వ్యాపారమయం కావడం, కార్పొరేట్ ఆసుపత్రులు కాసుల కోసం కక్కుర్తి పడుతుంటంతో ఈ వికృత ధోరణి పెరిగిపోయింది. తెలంగాణలోని పలుజిల్లాల్లో ఇటీవల ఈ ఆపరేషన్ల సంఖ్య మళ్లీ పెరుగుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. పర్యవసానంగా ఎంతో భవిష్యత్తు ఉన్న మహిళల జీవితాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. హార్మోన్లలో అసమతుల్యతలు తలెత్తి జీవితాంతం మందులు వాడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. అందుకు వేల రూపాయలు వచ్చించాల్సి వస్తోంది. అవివాహితులు, నవ యువతులకు అమానవీయంగా హిస్టరెక్టమీ ఆపరేషన్లు చేస్తూ వారి జీవితాలను అంధకారంలోకి నెడుతున్నారు. ఈ ధోరణిపై డాక్టర్ కామేశ్వరి, డాక్టర్ సూర్య ప్రకాశ్ దంపతులు పెద్ద యుద్ధమే చేశారు. మహిళల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేశారు. అదే సమయంలో ఆరోగ్య శ్రీ జాబితా నుంచి ఈ ఆపరేషన్లను తొలగించేలా ప్రభుత్వంతో పోరాటం చేశారు. ఇటీవలి కాలంలో మళ్లీ అనవసరంగా హిస్టరెక్టమీ ఆపరేషన్లు పెరుగుతుండటంతో ఈ దంపతులు తిరిగి దీనిపై పోరాటం ప్రారంభించారు. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ తార్నాకలోని సత్యోదయం రీట్రీట్ హౌస్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు.ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, మేధావులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొననున్నారు. అనవసరంగా గర్భసంచి తొలగింపు ఆపరేషన్ల విషయంలో పౌర సమాజం అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం ఈ ధోరణిని నివారించాలని డాక్టర్ కామేశ్వరి, డాక్టర్ సూర్య ప్రకాశ్ దంపతులు కోరుతున్నారు.

## డాక్టర్ వేంకట కామేశ్వరి పాతికేళ్ల సేవకు కృతజ్ఞతాభివందనం

### అనవసరంగా గర్భసంచుల తొలగింపుపై నేడు అవగాహన సదస్సు



## చీకట్లో చిరుదీపం

వైద్యరంగం వ్యాపారమయమైన ప్రస్తుత సమాజంలో డాక్టర్ కామేశ్వరి అందుకు మినహాయింపు. ఆమె 1999లో హైదరాబాద్ నయాపూల్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న జజ్‌ఖానా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ప్రసూతి, జననేంద్రియ శాస్త్రాలలో పట్టా పొందారు. అదే సంవత్సరం తన జీవిత భాగస్వామి డాక్టర్ వింజమూరి సూర్యప్రకాశ్‌తో కలిసి లైఫ్ హెల్త్ రీ ఇన్ఫోర్స్‌మెంట్ గ్రూప్ (LifeHRG) అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. ఆహారం, జీవితం మొదలైన అంశాలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో సేవలు అందిస్తున్నారు. మంచితనం, మానవత్వం, సేవాభావం, ప్రేమ మూర్తీభవించిన ఉత్తమ వైద్యురాలు. పాతికేళ్ల నుంచి వైద్యురాలిగా సేవలందిస్తున్నారు. ఇరవై అయిదు వేలకు పైగా మహిళల జీవితాల్లో వెలుగులు నింపారు. సహజమైన పద్ధతుల ద్వారా సంతానం కలిగేందుకు చికిత్స చేశారు. సంతాన భాగ్యం కలిగించారు. అనవసరంగా స్త్రీలకు గర్భసంచి తొలగించే (హిస్టరెక్టమీ) ఆపరేషన్లను వైద్యరంగంలో నైతిక ప్రమాణాల ఉల్లంఘనగా భావించి 2001 నుంచి పెద్ద పోరాటమే చేశారు. సంతాన సాఫల్యానికి సంబంధించి పలు పుస్తకాలు రచించారు. పలు సంస్థల నుంచి ఉత్తమ వైద్యురాలిగా పురస్కారాలు పొందారు.

## ఆనందోత్సవంలో డాక్టర్ సూర్యప్రకాశ్ అద్భుత సూక్తులు

- వివాహ బంధంలో నిజాయితీ ముఖ్యం. భార్యను అమితంగా ప్రేమించాలి. ఆమె అభిప్రాయానికి విలువ ఇవ్వాలి. వ్యక్తిగా ఆమెను గౌరవించాలి.
- పిల్లల కోసం తగినంత సమయం కేటాయించాలి. చదువు విషయంలో వారిని ఒత్తిడి చేయకూడదు. ఆటలను ప్రోత్సహించాలి. వారికి కథలు, కవితలు చెప్పాలి.
- పిల్లల ముందు తప్పు మాటలు మాట్లాడకూడదు. తప్పులు చేయకూడదు.
- పిల్లలకు ఏం తింటున్నామనే విషయం అర్థం చేయించాలి. ఆ రోజు తింటున్న పదర్థాలు, పండ్లు, కూరగాయల గురించి వివరించాలి. వాటిని పండించడానికి రైతులు ఎంత కష్టపడతారో చెప్పాలి.
- ఆకుకూరలు, కొత్తిమీర, పచ్చిమిర్చి లాంటి మొక్కలు నాటించి వాటి సంరక్షణ బాధ్యత అప్పగించాలి.
- అప్పుడు వాటి విలువ అర్థమవుతుంది. ఆహార పదార్థాలను వృథా చేయకుండా ఉంటారు.
- తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవాలి. అంతకు మించిన పనేం లేదు. పెద్దలను నిర్లక్ష్యం చేయడం అమానవీయం.
- అప్పులు చేయకూడదు. ఉన్నంతలో సంతృప్తిగా జీవించడం అలవాటు చేసుకోవాలి
- ఎన్ని కోట్లు ఉన్నా తీసుకుపోయేదేం లేదు. సంపదపై వ్యామోహం తగ్గించుకోవాలి.
- మనం కడుపు నిండా తినడంతో పాటు ఇతరుల ఆకలిని కూడా తీర్చాలి.
- స్వార్థాన్ని వీడాలి. సమాజం కోసం సమయాన్ని కేటాయించాలి.



- రావికంటి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్
9908892067

# మహారాష్ట్ర ఎన్నికలు రెండు జాతీయ పార్టీలకు సవాళ్లు

కొద్దిరోజుల్లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల తాకిడి మొదలవబోతుంది. ఇందుకోసం ముందు నుంచే రెండు జాతీయ పార్టీలు వారి వ్యూహాలను రచించుకుంటున్నారు. గడిచిన 5 సంవత్సరాల్లో మహారాష్ట్ర రాష్ట్రంలో రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. ఎప్పుడు లేని విధంగా పార్టీలు చీలిపోవడం, అవిశ్వాసం, ప్రజా ప్రతినిధుల అనర్హతవేటు ఇలా అనేక అంశాలు అక్కడి ప్రజలకు విసుగుచెందడమే కాక రాజకీయ వర్గాల్లో సైతం చర్చకు దారితీసాయి. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో నేడు కేంద్రంలో రెండు జాతీయ పార్టీల కూటములు దాదాపు సరిసమానంగా ఉండడం వలన ఈ మహారాష్ట్ర ఎన్నికలు వారికి మొదటి పరీక్ష. ఈ ఎన్నికలు రైతుల సమస్యలు, మరాఠా రిజర్వేషన్, కులగణన, శివసేన పూర్వవైభవం, శరద్ పవర్ రాజకీయ వ్యూహం లాంటి అంశాలతో ఈసారి మహారాష్ట్ర ఎన్నికలు మహా సంగ్రామంగా ఉండబోతున్నాయ్. గత 5 సంవత్సరాల్లో మహారాష్ట్రలో బీజేపీ ఓటెందు పోకడలకిపోవడమే కాకుండా మహారాష్ట్ర ప్రాంతీయపార్టీయినా శివసేనను నిర్మూలించాలని చూడడం అక్కడి ప్రజలకు అసహనానికి లోనుచేశాయి. శరద్ పవర్ లాంటి సీనియర్ రాజకీయ నాయకుడి పార్టీని చీల్చి కోర్టు కేసులో ముద్దాయిగా ఉన్న అజిత్ పవార్ చేత కొత్త పార్టీని పెట్టించి ఉపముఖ్యమంత్రిని చేయడం, అలాగే బీజేపీ మద్దతుతో శివసేన పార్టీని సైతం చీల్చి ఎకనాథ్ షిండేని ముఖ్యమంత్రిని చేయడం ఇలా అనేక రాజకీయా క్రీడలను బీజేపీ మహారాష్ట్ర వైపు చేసింది. ఇవ్వని చుసిన ప్రజలు అసహనానికి గురవడమే కాకూండా ఎలక్షన్ కమిషన్ సుప్రీం కోర్టు సైతం విస్మయానికి గురైంది. దీని ఫలితమే ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలో మహారాష్ట్రలో మొత్తం 48 స్థానాల్లో బీజేపీకి కేవలం 9 స్థానాలకే పరిమితమైంది. మొత్తం NDA కూటమి కలుపుకుంటే కేవలం 17 స్థానాలు మాత్రమే రాబట్టగలిగింది. ఇది కచ్చితంగా రాష్ట్ర శాసనసభ ఎన్నికలో సైతం దీని ప్రభావం భారీగా ఉండబోతుంది అనేది రాజకీయ విశ్లేషకుల వాదన. గత అసెంబ్లీ ఎన్నికలో 2020లో( శివసేన బీజేపీ ) కూటమి దాదాపు 150 పైన స్థానాలను కైవసం చేసుకొని ముందుస్థానాలో ఉండేవి. అటు (కాంగ్రెస్ ఎన్సీపీ )కూటమి మిగిలిన స్థానాలను కైవసం చేసుకున్నాయి . గతంలో శివసేన మద్దతు బీజేపీకి ఉండడం వలన మరాఠా హిందూ రాజకీయ పునరేకీకరణ (Political Integration) సాధ్యమైంది. కానీ ఈరోజు ఆ పరిస్దితి పూర్తిభిన్నంగా ఉంది. బీజేపీ నేడు కేవలం ఎకనాథ్ షిండే మీద ఆధారపడాల్సి వస్తుంది. మోడీ షా ల చరిష్మా ఎంతమేరకు పనిచేస్తాయో వేచిచూడాలి. గతంలో బీజేపీతో విభేదించి శివసేన, కాంగ్రెస్ మరియు ఎన్సీపీ మద్దతుతో MVA (మహా వికాస్ ఆగది) అనే పేరుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దీని ద్వారా మరాఠా ఓబిసి రైతుల వర్గాలు భారీగా (మహా వికాస్ ఆగది) వైపు మొగ్గుచూపారు. కాంగ్రెస్ కూడా తోడు అవడంతో వారి సంప్రదాయ ఓటు బ్యాంకు సైతం MVA (మహా వికాస్ ఆగది) వైపుకు మళ్లింది. దీనిని గమనించిన బీజేపీ మొదట శివసేనను నీరుగార్చే ప్రయత్నం చేసింది. ఆ పార్టీలో కీలకంగా ఉన్న సంజయ్ రౌత్‌ను ఈడీ అక్రమ కేసులో ఇరికించడం, ఎకనాథ్ షిండే ద్వారా పార్టీ గుర్తుని లాగేసుకోవడం, మరోవైపు ఎన్సీపీలో సైతం అజిత్ పవర్ చేత ఎన్సీపీ పార్టీ గుర్తు లాగేసుకోని బీజేపీ మద్దతుతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఈ విధంగా మహారాష్ట్రలో రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. ఈరోజు మొత్తం 6 పార్టీలుగా పోటీ చేస్తున్నారు. 3 పార్టీలు [శివసేన (ఉద్ధవ్) , కాంగ్రెస్ , ఎన్సీపీ (శరద్) ఒక వైపు. మిగిలిన 3 పార్టీలు (శివసేన) (ఎకనాథ్) , బీజేపీ, ఎన్సీపీ (అజిత్) మరో వైపు. ఈ సమీకరణలో ప్రధానంగా తెలిసేది ఏంటంటే రెండు జాతీయ పార్టీలు నేడు రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీల బలాల మీదనే ఆధారపడటం

**ఈ ఎన్నికలలో కీలకాం కానున్న అంశాలు**


మహారాష్ట్రలో గత కొన్నేళ్లుగా రైతుల సమస్యలు అలానే ఉండిపోయాయి . చెరుకు పంటల దిగుబడి తగ్గుతూ వస్తుంది . కేంద్రం ఇచ్చే కనీస మద్దతు ధర(MSP) సైతం తక్కువగా ఉండడం వలన రైతులు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనినే దృష్టిలో పెట్టుకొని కేంద్రం రెండు రోజుల క్రిందనే 14 పంటలకు కనీస మద్దతు ధరణి పెంచింది. 3వ సారి ప్రధానిగ బాధ్యతలు చేపట్టిన మోడీ సైతం మొదటి సంతకం PM KISAN పెట్టుబడి 20,000 కోట్ల సాయం పై సంతకం చేయడం విశేషం. గత కొన్నేళ్లుగా మరాఠా రిజర్వేషన్ పెండింలోనే ఉంది. ఇటీవల మనోజ్ జరంగ పాటిల్ కొత్త పంథాలో మరాఠా రిజర్వేషన్ పై పోరాటం మొదలుపెట్టారు. దీనికి వ్యతిరేకంగా ఓబీసీ నేతలు సైతం పోరాటం మొదలుపెట్టారు. ఈ రెండు రిజర్వేషన్ అంశాలను ఏ విధంగా సమం చేస్తారో వేచి చూడాలి. బీజేపీ దీనికి మద్దతు పలుకుంతుందా లేదా కాంగ్రెస్ ఈ మరాఠా అంశానికి మద్దతు పలుకుతుందా వేచి చూడాలి. ఇప్పుడు ప్రస్తుతం మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న ఎకనాథ్ షిండే మరాఠా సామాజిక వర్గానికే చెందడంతో బీజేపీ పై మరింత ఒత్తిడి పడే అవకాశం ఉంది. (మహా వికాస్ ఆగది) సైతం దీని పోరాటం చేస్తున్నారు. అటు అభివృద్ధి వైపు చుస్తే ముంబై అహ్మదాబాద్ బులెట్ రైలు నిర్మాణం ఇంకా పెండింగ్లోనే ఉంది. మరాట్వాడా జిల్లాలో శివసేన మద్దతు లేకపోవడంతో బీజేపీకి ఇప్పుడు పెద్ద సవాలుగా మారొచ్చు. నీటి అంశాలు, మహారాష్ట్ర కర్ణాటక మధ్య ఉన్న బెలగాం సమస్య సైతం ప్రధాన అంశగా భావించవచ్చు. ఈ ఎన్నికలో రెండు జాతీయ పార్టీలు ఈ అంశాలపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి. చివరిగా 288 శాసనసభ సభ్యులు గల మహారాష్ట్ర ఎన్నికలు ఈసారి ఎవరు గెలిచినా మళ్ళీ కూటమి ప్రభుత్వాలే ఏర్పడబోతున్నాయి. గత 5 సంవత్సరాల రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని మళ్ళి రాజకీయ అనిష్చితి (Political unstability) లేకుండా ఈసారి ప్రజలు ఏ కూటమికైనా సరే పూర్తి మద్దతు ఇచ్చే విధంగా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికలో సత్తా చాటిన INDIA కూటమికి ఈ మహారాష్ట్ర ఎన్నికలు కీలకం కాబోతున్నాయి. శరద్ పవర్ చాతుర్యం, ఉద్ధవ్ సేనకు సానుభూతి తోడవడం కూటమికి కలిసివచ్చే అవకాశం. మహారాష్ట్ర నుండి కేంద్రంలో క్యాబినెట్ మంత్రిగా ఉన్న నితిన్ గడ్కరీ సేవలను బీజేపీ ఏ విధంగా వాడుకుంటుందో వేచి చూడాలి. నాగపూర్ ప్రధాన కేంద్రంగా ఉన్న ఆర్ఎస్ఎస్ సైతం కీలకం కాబోతుంది. మరి కొన్ని రోజులో మహా సంగ్రామాని సిద్ధం కాబోతున్న రెండు జాతీయ పార్టీలకు ఇది ఒక పరీక్ష.




- కన్నోజు శ్రీహర్ష
ఫోన్: 89 85 13 00 32

# గిరిజనుల సీత్ల పండుగకు జాతీయ హోదా కల్పించాలి

ప్రకృతిని పూజించే సీత్ల పండుగ దేశమంతటా ఒకే రోజు వేడుకలు బంజారా సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా సంబురాలుచేయాలని ప్రకృతిని ఆరాదిస్తూ తమ పాడి పంటలు బాగుండాలి అంటూ ప్రకృతిలో ఉన్న ఏడుగురు దేవతలు హిగ్లాజ, సీతా, మేరమ, తుళజ, కంకెళ్ళి, ద్వళంగర్, మంత్రల్, దేవతలతో పాటు ఈ దేవతల తమ్ముడు అయిన లూక్లియా దేవుని ప్రతిష్ఠించి. ఆషాడ మాసంలో మంగళవారం రోజున సీత పండుగను ఘనంగా జరుపుకుంటారు. వర్షాకాలంలో పశువులు వ్యాధులబారిన పడి మృత్యువాత పడుతుంటాయి . అలా విలువైన పశుసంపద అంతరించిపోకుండా ఉండేందుకు గిరిజనులు ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. గిరిజనుల ఆరాధ్య గురువు సేవాలాల్ మహరాజ్ హయాంలో సాథీ భవాని ఏడుగురు మాతలు పేరిట తండా చివరలో అడవికి సమీపంలో అమ్మవార్లను నెలకొల్పి కొలవడం ప్రారంభించారు. గ్రామ దేవతలైన పోచమ్మ, మైసమ్మ తదితరులకు పూజలు చేస్తున్నట్లే, గిరిజనులు ఏడుగురు అమ్మవార్లను పూజిస్తుంటారు. ఏడుగురు అక్కాచెల్లెల్లు, ఏడుగురు అమ్మవార్లలో చిన్నదైన సీత దేవి పేరిట సీత పండుగను జరుపుకొంటారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి ప్రీతిపాత్రమైన మంగళవారం రోజు



అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటే తమ పశు సంపదకు ఎలాంటి హాని జరగదని గిరిజనుల నమ్మకం. అందుకే, ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. ప్రత్యేక నైవేద్యాలు, పూజలు సీత పండుగ కొరకు తండా చివరలో ఏర్పాటు చేసిన అమ్మ వార్ల గద్దెలను జాజుతో పాటు ప్రకృతిలో లభించే రకరకాల పుష్పాలు, ఆకులతో అందంగా అలంకరిస్తారు. పెళ్లి కాని యువతులు తండాలోని తమ ఇళ్ల నుంచి ప్రత్యేకంగా తయారు చేసి తీసుకొచ్చిన గుడాలు, (గుగ్గిలాలు) బెల్లంతో చేసిన అన్నంతో పాటు ధూపదీప నైవేద్యాలతో పాటు ఉల్లిగడ్డలు, ఇతర పూజా సామాగ్రిని అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పిస్తారు. మేతకు వెళ్లిన ఆవులు సాయంత్రం ఇంటికి వచ్చే వరకు పూజారులు ఉపవాసంతో ఉంటారు. ఆవులు తిరిగి వచ్చిన అనంతరం పూజలు ప్రారంభిస్తారు. పూజల అనంతరం గిరిజనులు అమ్మవార్లకు మేకలను, కోళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకుంటారు. బలి ఇచ్చేటప్పుడు వచ్చే రక్తం, పేగులు, ఉడకబెట్టిన గుడాలు కలిపి ప్రత్యేక పదార్థం చేస్తారు. పూజల అనంతరం ఈ పదార్థాన్ని దేవతల గద్దెల సమీపంలో నిలిపి ఉంచి దేవతల తమ్ముడు అయిన లూకియా దేవుని ఏడుగురు దేవతలకు ఎదురుగా ప్రతిష్ఠించి ఈ దేవతల దగ్గర నుండి లూక్లియా దేవునికి బలిచ్చిన జంతువు పేగును కట్టి ఆ పేగుపై నుండి పశువులను దాటవేస్తారు అలా పండుగను దాటుడు పండుగగా గుర్తించారు అక్కడ చేసిన నైవేద్యాలను పశువులపై చల్లుతారు. ఇలా చేయడం వల్ల అమ్మవార్ల చూపు వాటిపై పడి, అవి బాగుంటాయని చెబుతారు. ఆషాఢ మాసంలో ఒక్కో మంగళవారం, ఒక్కో తండాలో సీత్ల పండుగ చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సీతా పండుగ తర్వాత మరుసటి రోజు నుండి తేజ్ పండుగను నిర్వహిస్తారు. సీత్ల పండుగ చరిత్ర శ్రీరాముడు సీతాదేవి లక్ష్మణులతో కలిసి వనవాసం చేస్తున్న తరుణంలో అడవిలో సంచరిస్తున్న క్రమంలో అడవిలో జీవిస్తున్న బంజారాలకు సీతాదేవి ఎదురవుతుంది . సీతాదేవి గురించి తెలుసుకున్న బంజారా గిరిజనులు ఆమెను ఆప్యాయతగ ఆదరించి స్వాగతించి ఆరాధిస్తారు. తమ ముందు ప్రత్యక్షమైన సీతాదేవితో తమ తండాలలో ఉన్న పాడి పశువులకు తీవ్రమైన రోగాలు ప్రబలి అనారోగ్యంతో చనిపోతున్నాయని తమ తండాలో చిన్న పిల్లలకు రోగాలు వస్తున్నాయని మొరపెట్టుకొని ప్రార్థిస్తారు. తమ పాడి పంటలు సరిగా పండడం లేదంటూ సీతాదేవి ముందు తమ బాధను తెలియచేస్తారు. తమ బాధలను అర్థం చేసుకున్న సీతాదేవి (సీతమాత) ప్రతి జీవికి నీడనిస్తూ కాపాడుకుంటున్న ఈ పకృతిని ఆరాధించండి అని, ఈ పకృతిలో కొలువై ఉన్న ఏడుగురు దేవతలను ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే తమ కష్టానష్టాలు తీరి పాడి పంటలు పశువులు అన్ని బాగుంటాయని సీతాదేవి అంటుంది. అప్పటి నుండి ప్రకృతిలో కొలువైన ఆరుగురు దేవతలతో పాటు ఏడవ దేవత సీతాభవానీ (సీతాదేవి) ని భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. సీతాదేవిచ్చిన వరంతో పాటు నేటికీ బంజారా గిరిజనులు ఈ సీతా పండుగను ఘనంగా నిర్వహిస్తారు. బంజారాలు సంస్కృతి సంప్రదాయా లను మరిచిపోయారు ప్రపంచం మొత్తంలో నివసిస్తున్న బంజారాల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా ప్రకృతి సంపద యొక్క పరిరక్షకులుగా జరుపుకునే పండుగ సీత్ల భవాని. ఈ పండుగ బంజారాల ఔన్నత్యాన్ని చాటుతుంది. ఇది ప్రతీ సంవత్సర మంగళవారం నాడే జరపడం ఆనవాయితీ. ఇది లంబాడీల పండుగలలో మొదటిది అని తెలిపారు. కాలక్రమేణ బంజారా సంస్కృతిలో మార్పు వచ్చిందని సంస్కృతి సంప్రదాయాలను పాటించకుండా ఇతర దేవతలను పూజిస్తూ ఇతర మతాల ఆచారాలను ఆరాధిస్తూ ఈ సీత్ల పండుగను ఇప్పుడు.ఘనంగా జరుపుకోలేకపోతున్నారు. బంజారాల యొక్క వేషధారణ భాషలలో మార్పు వచ్చిందని తమ ఇలవేల్పులైన దేవతలను వదిలిపెట్టి ఇతర దేవుళ్ళను పూజిస్తున్నారు. బంజారా గిరిజనుల దైవమైన సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో ప్రతి బంజారా పౌరుడు నడవాలని వారు చూపిన మార్గంలో ప్రయాణించాలి ఈ సీత పండుగను ప్రతి గ్రామంలో ప్రతి తండాలో అంగరంగ వేడుకలను వైభవంగా జరుపుకొని తీజ్ ఘనంగా నిర్వహించాలి. బంజారా గిరిజనుల పండుగలను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పండుగలుగా గుర్తించి ఈ పండుగ రోజున సెలవు దినంగా ప్రకటించాలి గిరిజనుల కోరిక.



- ప్రసాద్ గోవిందు
విశ్వంభర & V3 న్యూస్ రిపోర్టర్
9959584586

## వీఐపీ జోన్‌లో పవర్ కట్ ఉంటే
# పట్టించుకోరా..?

**ట్విట్టర్ లో విమర్శించిన హరీశ్ రావు**



**విశ్వంభర, హైదరాబాద్ :** విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే వారే కరువయ్యారని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని విమర్శించారు. వీఐపీ జోన్ గా పిలవబడే హైదరాబాద్ సెంట్రలో సర్కిల్ లో గంటల కొద్దీ విద్యుత్ అంతరాయం ఏర్పడినా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడంలేదని ఓ దిన పత్రికలో వచ్చిన కథనాన్ని బుధవారం హరీశ్ రావు ట్విట్టర్ లో షేర్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో విద్యుత్ కోతలు ఉండటం విద్యుత్ నిర్వహణ లోపానికి నిదర్శనం అని ధ్వజమెత్తారు. విద్యుత్ సౌధ పక్కనే ఉన్న ఆనంద్ నగర్, మాసాబ్ ట్యాంక్ లో రాత్రి నుంచి ఉదయం వరకు కరెంటు పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడినా పట్టించుకునే వారు లేని విమర్శించారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి కరెంట్ కోతలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## శిక్షణ పేరుతో కోచింగ్ సెంటర్ల మాఫియా

- తల్లుల పుస్తల తాళ్లను తాకట్టు పెట్టి మరీ ప్రిపేర్
- ఇప్పుడు నోటిఫికేషన్లు వాయిదా వేయాలనడం ఎంత వరకు కరెక్ట్..?
- నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ చెలగాటమాడుతుంద
- బీఆర్ఎస్, కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలపై మధుయాష్కీ గౌడ్ ఫైర్



**విశ్వంభర, హైదరాబాద్ :** ఎంతో మంది నిరుద్యోగులు తమ తల్లుల పుస్తల తాళ్లను తాకట్టు పెట్టి మరీ, సంవత్సరాల తరబడి నుంచి ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యారని, ఇప్పుడు నోటిఫికేషన్లు వాయిదా వేయాలంటే ఎంత వరకు కరెక్ట్..?అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ బీఆర్ఎస్ ను ప్రశ్నించారు. దుర్మార్గమైన డిమాండ్ ముందుకు తెచ్చి నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ చెలగాటమాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో ఉద్యోగ నోటిఫికేషన్లు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉద్యోగ కల్పన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షల షెడ్యూలు విడుదల చేసాము. నిరుద్యోగులు స్వేచ్ఛగా పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో, కావాలనే కుట్ర చేసి పరీక్షలను ఆపేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు అనుమానం ఉన్నదని అన్నారు. ప్రధానంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ట్రైనింగ్ సెంటర్ల స్వార్థం ఉన్నట్లు అర్థమవుతుందని అన్నారు. శిక్షణ పేరుతో కోచింగ్ సెంటర్ల కోట్లాది రూపాయల మాఫియా నడుస్తుందని మండిపడ్డారు. పరీక్షలు వాయిదాలు వేస్తే, ఫీజుల పేరుతో నిరుద్యోగుల రక్తం తాగుదామని చూస్తున్నారని అన్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారులను నియమించి కుట్ర కోణాన్ని వెలికి తీయాల్సిన అవసరం ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్ కు విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పై
# ఎంపీ రఘునందన్ రావు ఫైర్..!



**విశ్వంభర, హైదరాబాద్ :** మార్పు కావాలి అని చెప్పి ఏం మార్పు తెచ్చారని, ప్రభుత్వ హాస్టళ్లు ఇంకా అధ్వాన్న పరిస్థితికి చేరుకున్నాయని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఫైర్ అయ్యారు. గవర్నమెంట్ హాస్టళ్లలో జరుగుతున్న ఘటనలపై ట్విట్టర్ వేదికగా స్పందించిన ఆయన సాంబారులో ఎలుక!, మోడల్ స్కూల్ లో ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులకు అస్వస్థత అని పలు దిన పత్రికల్లో వచ్చిన కథనాలను పోస్ట్ చేశారు. దీనిపై ఎంపీ.. మార్పు కావాలి, కాంగ్రెస్ రావాలి అన్నారు మొత్తానికి కాంగ్రెస్ వాళ్ళు వచ్చారు కానీ ఏం మార్పు తెచ్చారని ప్రశ్నించారు. ఆనాటి బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ హాస్టళ్లలో దుస్థితి పురుగుల అన్నం, నీళ్ల చారు లా ఉండేదని, నేడు కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా అధ్వాన్న పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. వారం రోజులో నాలుగు సంఘటనలు చోటు చేసుకున్నాయని, ఈ విషాహారం తిని బలి అవుతున్న విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరని ప్రభుత్వాన్ని నిలదీశారు. అలాగే అస్తవ్యస్థంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే విద్యార్థులకు ఈ అవస్థ అని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరవాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని రఘునందన్ రావు కోరారు.



## ఆపరేషన్ ముస్కాన్‌ను
# పకడ్బందీగా నిర్వహించాలి

**కలెక్టర్ పమేలా సత్పతి**

**విశ్వంభర, కరీంనగర్ :** ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఈ నెల 31 వరకు నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై స్త్రీ శిశు సంక్షేమ, పోలీసు, కార్మిక శాఖ అధికారులతో పాటు పలువురు అధికారులతో బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటి నుంచి తప్పిపోయిన, పారిపోయిన, బిక్షాటన చేసే 14 సంవత్సరాల లోపు చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తర్వాత వారికి విద్యాబుద్ధులు నేర్పించేందుకు పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొన్నారు. అలాగే షాపింగ్ మాల్లు, వివిధ దుకాణాలు, అపార్ట్మెంట్లు, వివిధ ప్రాంతాల్లో పని చేసే బాల కార్మికులను గుర్తించాలని సూచించారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకునే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైతే కేసులు బుక్ చేయాలని సూచించారు. బాల కార్మికులకు సంబంధించిన సమాచారం తెలిస్తే అధికారు లు వెంటనే వెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ శామ్యూల్, బీసీడీవో అనిల్ ప్రకాష్, డిసిపిఓ శాంత, డిఐఓ సాజిదా హత హరి, టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రవీందర్, సీడబ్ల్యూసీ మెంబర్ కళింగ శేఖర్, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## స్విగ్గీలో డ్రగ్స్ డెలివరీ..
**కేసు నమోదు చేసిన పోలీసులు**

**విశ్వంభర, సైబరాబాద్ :** నగరంలో డ్రగ్స్అమ్మడానికి వచ్చిన స్విగ్గీ డెలివరీ బాయ్ ని సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. మురళీధరన్ అనే వ్యక్తి బెంగళూర్‌లో స్విగ్గీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంతో హైదరాబాద్ లోని కస్టమర్లకు ఎండీఎంఏ డ్రగ్ను అమ్మడానికి శంషాబాద్ వచ్చాడు. ఆర్జీఐ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతుంటే ఎస్వోటీ , ఆర్జీఐ పోలీసులు అతడిని పట్టుకుని సోదా చేశారు. అతని ప్యాంటు ఇన్నర్ జేబులో దొరికిన 11 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న ఆర్జీఐ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో
# భారీ అగ్ని ప్రమాదం

**విశ్వంభర, నారాయణగూడ:** హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శ్రీదత్తసాయి కాంప్లెక్స్‌లోని మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. మంటల ధాటికి కాంప్లెక్స్ అద్దాలు పగిలి రోడ్డు మీద పడ్డాయి. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సమీపంలోని దుకాణాలను ఖాళీ చేయించిన పోలీసులు ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

## సోషల్ మీడియా కీచకుడు
# ప్రణీత్ హనుమంత్ అరెస్ట్..!



**విశ్వంభర, బెంగళూరు :** సోషల్ మీడియాలో రోస్టింగ్ కామెడీ ముసుగులో తండ్రి కూతు-రుపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రణీత్ హనుమంత్ ఎట్టకేలకు అరెస్ట్ అయ్యాడు. బెంగళూరులో ప్రణీత్ ను పోలీసులు అరెస్ట్ చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బెంగళూరు కోర్టులో ప్రణీత్ ను హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ పై హైదరాబాద్ కు తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. లైవ్ చాట్ లో తన మిత్రులతో కలిసి వల్గారిటీ, డబుల్ మీనింగ్ మాటలతో ప్రణీత్ టీమ్ పేట్రేగిపోయిన సంగతి తెలిసిందే. సభ్య సమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు చేసిన వీరి వ్యవహారంపై హీరో సాయిధరమ్ తేజ్ తెలంగాణ ముఖ్యమంత్రితో పాటు మరికొంత మంది ప్రముఖుల దృష్టికి సోషల్ మీడియా వేదికగా తీసుకువెళ్లారు. దీంతో సోషల్ మీడియాలో ఉన్న స్వేచ్ఛతో ప్రణీత్ గ్యాంగ్ చేస్తున్న జుగుప్సకరమైన డార్క్ కామెడీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు ప్రణీత్ తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అయితే పసి పిల్లలు అని కూడా చూడకుండా తండ్రి కూతురు బంధంపై అక్రమ బంధాలను అంటగట్టేలా కామెంట్స్ చేసిన వీరిని ఫోక్సో చట్టం కింద అరెస్ట్ చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అరెస్ట్ అయిన ప్రణీత్ నుంచి పోలీసులు దర్యాప్తులో ఈ డార్క్ కామెడీ పేరుతో రెచ్చిపోతున్న సోషల్ మీడియా కేటుగాళ్ల నెట్ వర్క్ ఎంత మేరకు చేదిస్తారనేది చూడాలి



# ఆపద్బాంధవునిగా ఆదుకుంటున్న సీఎంఆర్

**ఎమ్మెల్యే బాలునాయక్**

**విశ్వంభర, దేవరకొండ :** సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం అని దేవరకొండ శాసన సభ్యులునేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద మంజూరైన చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి నిరుపేద ప్రజల జీవితాలతో వెలుగులు నింపుతుందని, ఆపదలో సీఎం సహాయనిధి ఆపద్భందువునిగా అదుకుంటుందని వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు అండగా నిలుస్తుందని, బాధితులు అవసరమైన సమయంలలో సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగ పర్చుకోవాలని ఆయన అన్నారు. అంతకు ముందు మండలంలోని మర్రిచెట్టుతండా గ్రామంలో నాబార్డ్, ట్రైకర్, ఆర్ఓ సంస్థవారు ఏర్పాటు చేసిన మైత్రి ఉత్పత్తిదారుల సంఘం గోదాం భూమి పూజకార్యక్రమానికి హాజరై, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా మండలంలోని మైనంపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మరమ్మతులను, వన నర్సరీని, ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలో విద్యుత్, టాయిలెట్ల నిర్మాణం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని కోరారు.

కార్యక్రమాలలో సిపిఐ మాజీ ఎంపీపీ పల్లా నర్సింహా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఎల్లయ్య యాదవ్, డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నప్పటి నుంచే నాయకత్వ
# లక్షణాలను అలవర్చుకోవాలి

**చైర్మన్ గోవర్ధన్ రెడ్డి**

**విశ్వంభర, ఎల్బీనగర్ :** విద్యార్థులు పాఠశాల దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని త్రివేణి విద్యా సంస్థ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారము పాఠశాలలో ఇన్విస్టచర్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రమాణ స్వీకారం, నూతన విద్యార్థి మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం కన్నుల పండగ జరిగింది. పాఠశాల హెడ్ బాయ్ గా కార్తీక్, హెడ్ గర్ల్ గా మనస్వి, స్పోర్ట్స్ కెప్టెన్‌గా విగ్నేష్, వైస్ కెప్టెన్ లకు బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించారు. అనంతరం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నాయకత్వ పటిమ, జ్ఞానము, శక్తియుక్తులతో కూడిన విద్యా బోధన త్రివేణి విద్యాసంస్థల లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీల్, హెడ్ మిస్ట్రెస్ యోగేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన
# వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురానికి చెందిన దాసు పైలా సామాజిక మాధ్యమం అయినా ఫేస్ బుక్ లో బ్రాహ్మణ సమాజాన్ని బ్రాహ్మణులను అనుచిత వ్యాఖ్యలతో పరుష పదజాలంతో మాట్లాడిన అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం డిప్యూటీ కమీషనర్ ప్రవీణ్ కుమార్‌కి తెలంగాణ బ్రహణ సేవా సంఘ సమైక్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో వినతి పత్రము అందజేశారు. ఈ సందర్భంగా వక్కలంక శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజాన్ని, బ్రాహ్మణులను అనుచిత వ్యాఖ్యలతో పరుష పదజాలముతో దాసు పైలా మాట్లాడడం వ్రాయడం చేస్తూ, బ్రాహ్మణులు వేశ్య లకు పుట్టిన వారు అని దూషించడం జరిగిందన్నారు. దాసు పైలా మాట్లాడే మాటలకి బ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, బ్రాహ్మణులను రెచ్చగొడుతున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యనిర్వాహ కార్యదర్శి జయ తులసి, హైదరాబాద్ ఉపాధ్యక్షులు బనిగిరి నాగరాజ్, కోశాధికారి రఘు నందన్, కార్యవర్గ సభ్యులు రమణారావు, శశిలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఫీవర్ సర్వే చేపట్టాలి

**కలెక్టర్ రాహుల్ శర్మ**

**విశ్వంభర, భూపాలపల్లి :** సీజన్ వ్యాధుల నియంత్రణకు ఫీవర్ సర్వే నిర్వహించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం నుంచి వన మహోత్సవం, మహిళా శక్తి, ప్రజాపాలన మీ సేవ సహాయక కేంద్రాలు, పాఠశాల విద్యార్థులు స్కూల్ యూనిఫామ్స్, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులు, సీజనల్ వ్యాధులు నియంత్రణ, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణ తదితర అంశాలపై పంచాయతీరాజ్, వైద్య, విద్య తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన సూచించారు. అన్ని సంక్షేమ హాస్టళ్లను ప్రత్యేక అధికారులు తనిఖీ చేసి పారిశుధ్యం ఆహార తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయాలని ఆయన పేర్కొన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ర్యాపిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, అలాగే టీ హబ్‌లో ప్రాథమిక కేంద్రాల నుంచి వచ్చిన శాంపిసల్స్ పరీక్షిస్తున్నామని ప్రజలు నిర్లక్ష్యం చేయక వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని ఆయన తెలిపారు. సమావేశంలో డిపిఓ నారాయణరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డిఆర్డిఓ నరేష్, జడ్పి సీఈవో విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఈఈ దిలీప్, విద్యాశాఖ అధికారి రాజేందర్, అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుంటే
# రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు

**తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం**




**విశ్వంభర, ముషీరాబాద్ :** సుదీర్ఘకాలం పెండింగ్ లోఉన్న ఆటో డ్రైవర్ల సమస్యల పరిస్కారం, ఆటో కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చితామని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టంగా ప్రకటన చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరంతర ఆందోళనలు చేపట్టి, ఆటోలతో రహదారులను దిగ్బంధనం చేస్తామని ఏఐటీయూసీ తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశం హెచ్చరించారు. న్యాయమైన ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ వందలాదిమంది ఆటో డ్రైవర్లతో సోమవారం హైదరాబాద్, హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించింది. ఎర్ర జండాలు చేతబూని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను ఆటో కార్మికులు దగ్ధం చేసారు. ఈ సందర్భంగా బి. వెంకటేశం మాట్లాడుతూ 2013 సంవత్సరం నుండి నేటివరకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వందశాతం పెరిగాయని కానీ అప్పటి నుండి నేటివరకు ప్రభుత్వాలు ఒక్కసారి కూడా ఆటో మీటర్ చార్జీలు పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరునెలలు గడుస్తున్నా ఆటో డ్రైవర్ల సమస్యల పరిస్కారం కోసం కృషి చేయడం లేదని విమర్శించారు. పాలకులు మారుతున్న ఆటో డ్రైవర్ల తలరాతలు మారడంలేదని, ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారుల వేధింపులు, జరిమానాలు, పెట్రో మంటలు, మరమ్మతులు, ఫైనాన్స్ వ్యాపారుల ఒత్తిళ్లు, కుటుంబబరం తో సతమతమౌతూ జీవితాలు వెళ్లదీస్తున్నారని అయన ఆవేదన వ్యక్తం చేసారు. ఈ ప్రదర్శనలో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కొంరెల్లి బాబు, నేతలు ఏ భిక్షపతి యాదవ్, ఎండి ఒమేర్ ఖాన్, ఎస్కె లతీఫ్, జి మల్లేష్, అశోక్, భాస్కర్, రవి, ఘనీ బాబు, నర్సి రెడ్డి, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ
# తహశీల్దార్‌కి వినతిపత్రం

**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం బుధవారం సిఐటియు అఖిల భారత కమిటీ పిలుపు మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆత్మకూరు (ఎం)మండల సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి వినతిపత్రాన్ని తహసిల్దార్‌కి అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వేముల భిక్షం మాటడుతూ కేంద్ర బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలంటే పోరాటాలను తీవ్రతరం చేయడం తప్ప మరో మార్గం లేదని, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల అమలు, వారు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నేడు కార్మికుల కోర్కెల దినంగా పాటించడం జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలి అని, బొగ్గు గనులను వేలం వెయ్యడాన్ని నిలుపుదల చేసి సింగరేణికి నేరుగా గనులను కేటాయించాలని, కార్మికులందరికీ కనీస వేతనం 26000 రూపాయలు నిర్ణయించాలని, పదవీ విరమణ పొందుతున్న అంగన్వాడీ ఆశా కార్యకర్తలకు పదవీ విరమణ నగదు మొత్తం గౌరవ ప్రదంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ పంచాయతీల ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షులు కూరెల్ల కిష్టయ్య, ఉపాధ్యక్షులు రాగటి శ్రీను, కోశాధికారి సుదగాని రమేష్, కార్మిక సంఘం నాయకులు బెజ్జంకి నరసింహ చారి, సైదులు,కోల మచ్చగిరి, దేవరాజు రాజశేఖర్, వేముల రాములమ్మ, బట్టు బిక్షపతి, రామచంద్రు, కవిత, పద్మ, లక్ష్మి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో ఇంటింటికి మొక్కలు పంపిణీ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని గ్రామాల్లో బుధవారం వనమహోత్సవంలో భాగంగా గ్రామాల్లోని ఇండ్లలో పూల, పండ్ల మొక్కలు నాటటానికి గాను ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున అందించిన ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఏఫ్ఏలు మొక్కలు తీసుకున్న ఇంటి యజమానులు వానలు లేవు మొక్కలు ఏక్కడ పెట్టాలి ఇంటికి వచ్చే కుళాయి నీళ్లు ఇంటివరకే సరిపోతున్నాయి. ఈ మొక్కలకు ఏక్కడి నుండి తెచ్చి పాయాలని పంచాయతీ కార్యదర్శులను, ఉపాధి హామీ ఏఫ్ఏలను నీలదిస్తున్నట్లు సమాచారం. ఈ పంపిణీ కార్యక్రమంలో ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి హామీ ఏఫ్ఏలు, గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

### ఆలయ ప్రెసిడెంట్‌గా
## దళితుడు పనికిరాడ..?

**విశ్వంభర, మేడ్చల్ :** బోడుప్పల్ లో వెలుగు చుసిన కుల వివక్ష వివరలోకి వెళ్తే బోడుప్పల్‌లోని న్యూ సాయి మారుతీ నగర్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం ఎన్నో సంవత్సరాలుగా గుడి నిర్మాణ ధర్మకర్త ఆ గుడి స్థాపించడానికి ముఖ్య కారకుడు నవీన్ ఒక దళిత యువకుడుగా ఉన్న సమయంలో గుడిని ఎన్నో విరాళలతో నిర్మించి ఇప్పటికి సేవలు అందిస్తునారు నవీన్ మాత్రమే కాకుండా తన తల్లి మరియు భార్య కూడా సేవలు అందిస్తున్నారు. ఏమైందో ఏమో కానీ కొందరు కాలనీ వాసులు ఒక గుంపుగా ఏర్పడి ఇటీవలే కావాలని నవీన్ ని తప్పించాలని కుట్ర పన్ని పాత కమిటీ సభ్యుల సమక్షంలో సమావేశం నిర్వహించకుండా కొత్త కమిటీని ఎన్నుకొని ఇప్పటి నుండి నవీన్ ని రావద్దు అని చెప్తున్నారని అన్నారు. నవీన్ చెప్పిన వివరాల ప్రకారం నేను ఒక దళితుని కాబట్టి నన్ను గుడికి ప్రెసిడెంట్ గా ఉండద్దని చెప్తున్నారు అని వాపోయారు. అందుకే నాకు కనీస సమాచారం ఇవ్వకుండా కొత్త కమిటీ ని ఎన్నుకున్నారని నాపై దళిత వివక్ష చూపెడుతున్నారని ఇప్పటికైనా నాకు నాయ్యం చేయకపోతే దళిత సంఘాలతో ధర్నాకు దిగుతానని తెలిపారు.

# ఎస్పీ నారాయణరెడ్డికి సన్మానం



**విశ్వంభర, పరిగి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో పరిగి బీజేపీ అసెంబ్లీ ఇన్చార్జ్, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మారుతి కిరణ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఎస్పీ నారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రిత్వ శాఖ, కేంద్ర టెలికాం అడ్వైజరి కమిటీ సభ్యులు హరికృష్ణ, జిల్లా భాజపా ఉపాధ్యక్షులు కేశవులు,జిల్లా కార్యవర్గ సభ్యులు అనిల్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు రమేష్ , పరిగి పట్టణ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ రాష్ట్ర విస్తృత సమావేశం



**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను సత్వరం అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తెలంగాణ రాష్ట్ర విస్తృత సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం సీపీఐ రాష్ట్ర విస్తృత సమావేశం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టీ సాగర్ మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి (200 యూనిట్లు) మాత్రమే అమలు జరుపుతున్నారు. మహిళలకు నెలవారీ పెన్షన్ రు.2500, వ్యవసాయ కార్మికులకు రు.12వేలు, కౌలు రైతులకు రైతుభరోసా, రైతుబీమా నేటికీ వర్తింపజేయడం లేదని, ప్రభుత్వం హామీ ఇచ్చిన పంటల బోనస్ అమలు జరపాలని. ధరణి లోపాలకు సంబంధించి మార్చి 1 నుంచి 20 వరకు ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించినప్పటికీ వాటి ఫలితాలను రైతులకు ఇవ్వలేదన్నారు. లక్షలమంది రైతులు భూముల హక్కుల కొరకు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్షలమంది పేదలు దళిత, గిరిజనులు, బిసిలు, ఆర్థికంగా వెనుకబడిన వారు ప్రభుత్వ భూములలో దశాబ్దాల తరబడి వేసుకున్న గుడిసెలను పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి కూల్చివేస్తున్నారని ఆవేదన చెందారు. 47 కేంద్రాలలో రాష్ట్ర ఇండ్ల స్థలాల పోరాట వేదిక ఆధ్వర్యంలో వేసిన గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి, రెవెన్యూ మంత్రికి వినతిపత్రం ఇచ్చినా.. ఎలాంటి ఫలితం లేదని, పంపిణీ చేయని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు సదుపాయాలు కలిగించి అర్హులకు అందించాలని కోరారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. జాబ్ కేలండర్‌ను ప్రకటించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. చేనేత, పవర్‌లూమ్ యంత్రాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 7 మాసాలు పూర్తయినా షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాలు సవరించలేదని పేర్కొన్నారు. పెండిరగ్‌లో ఉన్న ఆరు డిఏలలో మూడు విడుదల చేస్తామని మేనిఫెస్టోలో చెప్పినప్పటికీ ఒక్కటి కూడా విడుదల చేయలేదన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని పేర్కొన్నారు. ట్రాన్స్‌పోర్టు వర్కర్లు, హమాలీలకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేసి, బీడీ కార్మికులకు నెలకు రు.4వేల భృతితో పాటు పిఎఫ్ సౌకర్యం ఉన్నవారికి ఇఎస్ఐ హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2003 విద్యుత్తు చట్టానికి సవరణ తెచ్చి చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

షీ టీమ్స్ ఉన్నప్పటికీ హైద్రాబాద్‌తో పాటు దేవాలయాల వద్ద మహిళలపై, బాలికలపై నిరంతర అఘాయిత్యాలు జరుగుతున్నాయని, మహిళల రక్షణకు ప్రస్తుతం ఉన్న షీ టీములకు తోడు అదనపు రక్షణ టీములను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను ప్రత్యేక అంశంగా పరిగణించి బలహీనులు, పేదలకు, సాంఘికంగా వెనుకబడినవారిపై జరుగుతున్న అత్యాచారాలు, నిర్బంధాలను నివారించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.



## బిజెపి ఎస్సీ మోర్చా మండల ఉపాధ్యక్షులుగా నియామకం

**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల బిజెపి ఎస్సి మోర్చా అధ్యక్షులు మేడి సాగర్ తన నూతన కమిటీలో ఇద్దరు ఉపాధ్యక్షులను నియమించడం జరిగింది. వస్తుప్పల పాపయ్య పల్లెర్ల, ఎర్రవల్లి నరేష్ తుక్కాపూర్ గ్రామాల నుంచి నియమింపబడ్డారు వారికి మంగళవారం నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి బండారు సత్యనారాయణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, మండల కిషన్ మోర్చా అధ్యక్షులు ఆంబోజు ఆంజనేయులు, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి లోడి మహేష్, సోషల్ మీడియా మండల కన్వీనర్ సాయి, బీజేవైఎం మండల అధికార ప్రతినిధి సూర్య, భూత్ అధ్యక్షుడు వెంకటయ్య, అశోక్ రెడ్డి, సీనియర్ నాయకులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## 15న బోడుప్పల్ నగర పాలక మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక

**విశ్వంభర, మేడిపల్లి :** మేడ్చల్ జిల్లా బోడుప్పల్ నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి నోటిఫికేషన్ జారీ చేశారు. జులై 15న ప్రత్యేక సమావేశం నిర్వహించి మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ ద్వారా ప్రత్యేకంగా అధికారం పొందిన ప్రత్యేక గెజిటెడ్ స్థాయి అధికారి ఈ ఎన్నికను నిర్వహించాలని నోటిఫికేషన్లో పేర్కొన్నారు.

### బంద్రు శోభారాణికి శుభాకాంక్షలు
### తెలిపిన గాదె శోభరాణి కృష్ణ



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల మహిళా కాంగ్రెసు పార్టీ అధ్యక్షురాలు గాదె శోభరాణి క్రిష్ణ బుధవారం తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బంద్రు శోభారాణిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరైయ్యారు. బంద్రు శోభరాణి సీతక్కను ఘనంగా సన్మానించారు.



రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా గుర్నాథ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. లక్డికాపూల్‌లోని తెలంగాణ రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గుర్నాథ్ రెడ్డికి పలువురు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. **– విశ్వంభర, హైదరాబాద్**

## ఘనంగా వడ్డేపల్లి నర్సింగ్ రావు జయంతి



**విశ్వంభర, కూకట్‌పల్లి :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూఖనిజాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ వడ్డేపల్లి నర్సింగ్ రావు 72'వ జయంతి వేడుకలు ఆయన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. వివేకానంద నగర్ డివిజన్లోని వీఎన్ఆర్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఎన్ఆర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నక్షత్ర హాస్పిటల్లో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం



**విశ్వంభర, ఎల్బీనగర్ :** కామాక్షి పురం, రామంతపూర్‌కి చెందిన బాల నారాయణ (45 సంవత్సరాలు) కాలేయ సమస్యతో అనేక నెలలుగా బాధపడుతూ.. చాలా ఆసుపత్రుల్లో తిరిగి అక్కడ దయాగ్నోస్ కాకపోవడంతో చివరిగా ఎల్బీనగర్‌లోని అలకాపురి నక్షత్ర హాస్పిటల్‌కి వచ్చారు. నక్షత్ర హాస్పిటల్స్‌లోని అనుభవజ్ఞులైన వైద్య బృందం అధునాతన రోగ నిర్ధారణ పద్ధతులను ఉపయోగించి, బిలియో–ప్లూరల్ క్యూటేనియస్ ఫిస్టులా మరియు ఎంఫైమాగా డయాగ్నోస్ చేసి దీనికి ఒక క్లిష్టమైన శాస్త్ర చికిత్స చేయాలని సూచించారు. ఈ క్లిష్టమైన సర్జరీకి పేషంట్ కుటుంబీకులు అంగీకరించడంతో డా.అరుణ్ కానాల (థోరాసిక్/లంగ్– సర్జన్), డా.ప్రవీణ్ ధీరవత్ (జనరల్ సర్జన్), డా. సుధాకర్ (అనస్తీషియా) పాల్గొని థోరాకోటమీ, ఊపిరితిత్తుల డెకార్టికేషన్, ఫిస్టులెక్టమీ, డయాఫ్రగ్మాటిక్ రిపేర్, థోరాసిక్ లావేజ్, ఐసీడీ ఇన్సర్షన్‌తో శాస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. తదనంతరం డా. అరుణ్ కానాల మాట్లాడుతూ.. సర్జరీ చేయడం ఒక ఎత్తు అయితే నక్షత్ర హాస్పిటల్స్‌లో కార్పొరేట్–స్థాయి సౌకర్యాలతో క్రిటికల్ కేర్ బృందం డా. సోమ శేఖర్ రెడ్డి (ఎమర్జెన్సీ ఫిజీషియన్), డా. కృష్ణ తులసి (ఇంటర్నల్ మెడిసిన్), డా.నితిన్ ప్రసాద్ (ఇంటెన్సివిస్ట్) చక్కటి ఐసీయూ కేర్ అందించడం వల్ల విజయవంతంగా డిశ్చార్జ్ చేయగలుగుతున్నామని తెలిపారు. ఈ శస్త్రచికిత్స కార్పొరేట్ ఆసుపత్రులలో 15 లక్షల వరకు ఖర్చు అవుతుందని అయితే నక్షత్ర హాస్పిటల్‌లో కేవలం రూ. 2. 5లక్షలతో పూర్తి చేయగలిగినట్లు తెలిపారు. నక్షత్ర హాస్పిటల్స్ నూతన మేనేజింగ్ డైరెక్టర్ డా. సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, నక్షత్ర హాస్పిటల్‌లో అధునాతన పరికరాలు, అన్ని వైద్య విభాగాలు అందుబాటులో ఉన్నాయని, తద్వారా కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్య సేవలు అందరికీ అందుబాటు ధరలో అందించగలుగుతున్నామన్నారు. ఈ శస్త్ర చికిత్సలు విజయవంతం చేసిన వైద్య బృందాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందంతో పాటు సీఏఓ డా.చంద్ర ప్రకాష్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మహబూబ్ బాషా, నర్సింగ్ సూపరింటెండెంట్ నవ్య, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో జేడీ ఆకస్మిక తనిఖీ



**విశ్వంభర, హుజూర్నగర్ :** హుజూర్నగర్ పట్టణం లోని ప్రభుత్వ పాఠశాలలో జేడీ వెంకట నరసమ్మ బుధవారం ఆకస్మిక తానికి చేశారు. ఈ సందర్భంగా జేడీ వెంకట నరసమ్మ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థలతో వసతుల గురించి చర్చించారు. విద్యార్థులకు పుస్తకాలు మరియు యూనిఫామ్, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇట్టి తనిఖీలు మండల ఎంఈఓ సైదా నాయక్, హెచ్ఎం క్యాంపు స్కూల్ శ్రీనివాస్ రెడ్డి, పిఎస్ స్కూల్ సుహాసిని మేడం తదితరులు పాల్గొన్నారు.

# చైతన్యపురిలో కార్మికుల నిరసన



**విశ్వంభర, చైతన్యపురి :** చైతన్యపురి డివిజన్లోని పెయింటర్స్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమానికి సరూర్ నగర్ సర్కిల్ సిఐటియు కన్వీనర్ మల్లె పాక వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జూలై 10న కార్మికుల కోరికల దినోత్సవం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ప్రభుత్వ రంగం సంస్థలను ప్రైవేటీకరుణను ఆపాలని, నేషనల్ మానిటరేషన్ పైపులను రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు గడువు ముగిసిన వెల్ఫేర్ బోర్డులో కార్డులను రెన్యువల్ చెయ్యాలని, కనీసం వేతనం రూ.26000 నిర్ణయించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని 73 షెడ్యూల పరిశ్రమల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల అందరికీ వేతనాలు పెంచాలన్నారు. హమాలి ట్రాన్స్పోర్ట్ కార్మికులకు వెల్ఫర్ బోర్డు ఏర్పాటు చేయాలని హిట్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆశవర్కర్లు అంగనవాడీ మధ్యాహ్నం భోజనం ఐకెపి వీవోఏ వైద్య ఆరోగ్య రంగంతో పాటు వివిధ స్కీంలల్లో పని చేస్తున్న స్కీం వం- ర్లను కార్మికులుగా గుర్తించి చట్టాలు అమలు చేయాలి ఆశావర్కర్లకు పరీక్షలు రద్దు చేయాలి అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆశా వర్కర్లు, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ఆటో ట్రాన్స్పోర్ట్ కార్మికులు, వివిధ కార్మికులు పాల్గొన్నారు.



## 43వ బ్యాచ్ స్నాతకోత్సవం

**విశ్వంభర, హైదరాబాద్ :** బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లోని తమన్నా మేకప్ స్టూడియో మరియు అకాడమీ తమ ప్రో మేకప్ కోర్సు యొక్క 43వ బ్యాచ్ స్నాతకోత్సవం నిర్వహించారు. ప్రఖ్యాత మేకప్ ఆర్టిస్ట్ తమన్నా రూజ్ నిపుణుల ఆధ్వర్యంలో, గ్రాడ్యుయేట్లు ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్రీలో తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నారు. కోర్సు అంతటా అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు విద్యార్థులు ధృవపత్రాలు, ప్రశంసలను అందుకున్నారు. తమన్నా మేకప్ స్టూడియో మరియు అకాడమీ వ్యవస్థాపకురాలు తమన్నా రూజ్ గ్రాడ్యుయేట్ల విజయాల పట్ల ఎనలేని గర్వాన్ని వ్యక్తం చేశారు. తమన్నా మేకప్ స్టూడియో మరియు అకాడమీలో ప్రో మేకప్ కోర్సు దాని సమగ్ర పాఠ్యాంశాలకు ప్రసిద్ధి చెందింది, ఇది సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మక శిక్షణతో మిళితం చేస్తుంది.



## 46 ఏళ్ల తర్వాత తెరుచుకోనున్న పూరీ జగన్నాథుడి భాండాగారం!

**విశ్వంభర, పూరీ:** పూరీ జగన్నాథుడి భాండాగారం దాదాపు 46 ఏళ్ల తర్వాత తిరిగి తెరుచుకోనుంది. స్వామికి చెందిన విలువైన ఆభరణాలను లెక్కించేందుకు భాండాగారం తలుపులు తెరవనున్నారు. లోపల ఐదు పెట్టెలలో భద్రపరిచిన ఆభరణాల లెక్కింపు, వాటి విలువ మదింపు సహా భాండాగారం మరమ్మతులు చేయాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఆలయ ఖజానా లెక్కింపుపై ఏర్పాటు చేసిన జస్టిస్ బిశ్వనాథ్ రథ్ కమిటీ మంగళవారం భేటీ అయింది. ఈ నెల 14న ఆలయ భాండాగారం తెరిచి, ఆభరణాలను లెక్కించాలని కమిటీలోని 16 మంది సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. దీంతో ప్రభుత్వానికి ఆ తీర్మానం పంపగా.. ఖజానా లెక్కింపునకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కలెక్టరేట్ ట్రెజరీలో ఉన్న తాళంచెవితో తెరుచుకోకపోతే తాళంకప్ప పగలగొట్టి తలుపులు తెరవనున్నట్లు సమాచారం. ఒడిశాలోని పూరీ జగన్నాథుడికి చెందిన విలువైన ఆభరణాలను ఆలయంలోని ఓ రహస్య గదిలో భద్రపరిచారు. గతంలో మూడేళ్లు, ఐదేళ్లకు ఒకసారి గది తలుపులు తెరిచి సంపద లెక్కించేవారు. చివరిసారిగా 1978లో ట్రెజరీలోని వజ్రాభరణాలను లెక్కించి భాండాగారం సీజ్ చేశారు. అప్పటి నుంచి మళ్లీ ఆ గది తెరవలేదు. అయితే, అప్పుడు కూడా కొన్ని ఆభరణాలను వెలకట్టలేక పక్కన పెట్టారని, గది తాళం దొరకడంలేదని.. ఇలా ఆలయ భాండాగారం చుట్టూ పలు వివాదాలు రేగాయి. అప్పటి నుంచి మళ్లీ ఈ గదిని తెరవలేదు. ఒడిశాలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇది కూడా కీలక అంశంగా మారింది. తాము అధికారంలోకి వస్తే ఆలయ భాండాగారం తెరిచి, జగన్నాథుడి సంపదను లెక్కిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఈ హామీని నిలబెట్టుకునే క్రమంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ భాండాగారం తెరిచేందుకు ఈ నెల 14 ను ముహూర్తంగా నిర్ణయించింది.

### అప్పట్లో లెక్కింపుకు 70 రోజులు..

1978లో భాండాగారంలోని సంపద లెక్కించేందుకు 70 రోజులు పట్టింది. లెక్కింపు తర్వాత ప్రకటించిన జాబితాలో స్వామి వారికి చెందిన పలు ఆభరణాల పేర్లు కనిపించలేదు. దీనిపై హైకోర్టులో ఓ వ్యాజ్యం దాఖలైంది. విచారణ జరిపిన న్యాయస్థానం భాండాగారం తెరిచి సంపద లెక్కించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు కూడా దీన్ని సమర్థించింది. ఈ క్రమంలో ఆభరణాల లెక్కింపు, గది మరమ్మతుల కోసం 2019లో నవీన్ పట్నాయక్ సర్కారు 13 మందితో కమిటీ ఏర్పాటు చేసింది. అదే ఏడాది ఏప్రిల్ 16న భాండాగారం తలుపు తెరిచేందుకు వెళ్లిన ఈ కమిటీ సభ్యులు.. తాళంచెవి కనిపించకపోవడంతో వెనుదిరిగారు. భాండాగారానికి సంబంధించిన డూప్లికేట్ తాళంచెవి పూరీ కలెక్టరేట్ ట్రెజరీలో ఉందని గుర్తించారు. ప్రస్తుతం ఈ తాళం చెవి సాయంతో గది తలుపులు తెరవనున్నారు.



## మాదిగలను మోడీ మోసం చేశాడు

**డాక్టర్ పిడమర్తి రవి**

**విశ్వంభర, కంటోన్మెంట్ :** ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని బిజెపిలోని అగ్ర నేతలు ప్రధాని మోడీ, అమిత్ షా మోసం చేశారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. 2024లో ఎన్నికల ముందు హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎంఆర్పిఎస్ బహిరంగ సభలో ఎన్నికల ముందు మాదిగలపై తాత్కాలిక ప్రేమ చూపించిన ప్రధాని మోదీ గెలిచిన తర్వాత పార్లమెంట్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకుండా మాదిగల గురించి మాట్లాడకపోవడ%శీ% మాదిగలను మోసం చేయడమేనన్నారు. బిజెపి ఇచ్చిన మాట ప్రకారం బిల్లు ప్రవేశపెట్టి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ తెలంగాణలో కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చెర్రీపోతుల సాయన్న మాదిగ ఆధ్వర్యంలో బుధవారం బస్తీ బాటలో భాగంగా కంటోన్మెంట్ నియోజకవర్గం అన్ననగర్‌లో ప్రారంభమై తెలంగాణలోని నాలుగు పార్లమెంటు స్థానాలైనా హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్గిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో మాదిగల బస్తీబాట కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్‌తో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్ర మంలో అన్ననగర్ బస్తీ మాదిగ నాయకులు ప్రశాంత్ బాబు, విజయలక్ష్మి, నాగరాజు, శ్రీను, మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు నక్క మహేష్, బొరెల్లి సురేష్, దేవరకొండ నరేష్, జోగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నికోలా టెస్లా జయంతి



**విశ్వంభర, బాలాపూర్ :** తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మేధావి ఎలక్ట్రికల్‌లో నైపుణ్యం సాధించిన నికోలా టెస్లా జయంతి వేడుకలను బుధవారం అల్మాస్‌గుడాలోని అపర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రవేట్ సెక్టర్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రిషన్‌లు, కార్మిక ప్రయోజనాల కోసం వెన్నంటూ ఉంటానని, వారికి ఏ ఆపద వచ్చినా ప్రభుత్వంచే వచ్చే నిధులను ముందుండి ఇప్పిస్తానని అభయమిచ్చారు. ప్రమాదవశాత్తు చనిపోయిన లేక అంగవైకల్యం చెందిన కార్మికులకు వచ్చే నిధులను సకాలంలో అందే విధంగా ఉంటానన్నారు. అదేవిధంగా అసోసియేషన్‌కు సంబంధించి 150 గజాల భూమిని బాలాపూర్ ఏరియాలో సమకూరుస్తానని హామీ ఇచ్చారు. బాలాపూర్ మండల పరిధిలో ఉన్న ప్రవేట్ ఎలక్ట్రిషన్‌ల కోసం ప్రత్యేక యాప్‌ను తయారు చేసి ఎలక్ట్రిషన్ల కోసం అందుబాటులోకి తెస్తానన్నారు. తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ నక్క యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా ప్రవేట్ సెక్టార్‌లో కమర్షియల్ కాంప్లెక్స్ లో సాఫ్ట్వేర్ రంగంలో, గృహ సముదాయంలో పనిచేస్తున్న ప్రతీ ఎలక్ట్రిషన్ ప్రభుత్వం ఇచ్చే గవర్నమెంట్ గుర్తింపు కార్డును తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎలా ఎలక్ట్రికల్ లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం కోసం తెలంగాణ లైసెన్స్ బోర్డు ద్వారా వైర్ మెన్, సూపర్వైజర్‌ను తీసుకోవాలన్నారు. నివాకుడు కాశీ నాయుడు మాట్లాడుతూ.. మండలంలో మొదటిసారి నికోలా టెస్లా 168 జయంతి నిర్వహించడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ సీనియర్ నాయకుడు రఘు, తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మెంబర్ నేమాల బెనర్జీ, మండల కమిటీ అధ్యక్షుడు కాశి నాయుడు. ఏనుగుల రాంరెడ్డి, ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, బోయిన్పల్లి శేఖర్ రెడ్డి, ముత్యాల లలిత కృష్ణ, బుచ్చిరెడ్డి, రంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామల శ్రీకాంత్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షడు పొదిల గోవర్ధన్, విట్టల ప్రసాద్, వెంకటేష్ ముదిరాజ్, గోలి గిరి, ఆర్ శ్రీనివాస్ నేత, శ్రీనివాస్, ఏనుగుల రామ్ రెడ్డి, ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, దాసరి గిరి, వెంకటేష్, శివన్న, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



## పాల ట్యాంకర్‌ను ఢీకొట్టిన స్లీపర్ బస్సు

### 18 మంది మృతి

**విశ్వంభర, ఆగ్రా:** ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా–లక్నో ఎక్స్‌ప్రెస్ హైవేపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. బీహార్‌లోని సీతామర్హి నుంచి ఢిల్లీ వెళ్తున్న స్లీపర్ బస్సు బుధవారం తెల్లవారుజామున ఉన్నావో వద్ద పాల ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఎం ఆదేశాలతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు సహాయక కార్యక్రమాలు చేపట్టారు.

### మా నాన్న చివరి కన్నీటి చుక్క


## గుర్తుకొస్తూనే ఉంది : సుశీల



**విశ్వంభర, విజయవాడ :** కాంతారావు .. ఎన్టీఆర్ – ఏఎన్నార్ తరువాత కనిపించే పేరు .. వినిపించే పేరు. తెలుగు సినిమా కళామతల్లికి ఎన్టీఆర్ – ఏఎన్నార్ రెండుకళ్లు అయితే, నుదుటున తిలకం కాంతారావు అని దాసరి నారాయణరావు ఒక సందర్భంలో అన్నారు. అలాంటి కాంతారావు చివరి రోజుల్లో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. ఆ విషయాలను గురించి 'సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కూతురు సుశీల ప్రస్తావించారు. "మా నాన్నగారు 'గుడిబండ దొర' .. అప్పట్లోనే ఆయనకి 400 ఎకరాలు ఉండేది. విజయవాడకి ఏదైనా కొత్త సినిమా వస్తే, స్నేహితులతో కలిసి చూడటానికి వెళ్లేవారు. ఆ డబ్బు కోసం ఒక ఎకరం అమ్మేసేవారు .. అప్పట్లో ఎకరం 1200. అలా నాన్న సినిమాల్లోకి వచ్చి .. నిర్మాతగా మారే సమయానికి ఒక 50 ఎకరాలు ఉండేవనుకుంటా. సినిమాలు తీయడం కోసం ఆయన వాటిని కూడా అమ్మేశారు. ఆయన అమ్మేసిన తరువాత అటు వైపు సాగర్ కాలువ రావడం .. రేట్లు ఒక్కసారిగా పెరిగిపోవడం జరిగింది" అన్నారు. "నాన్న హాస్పిటల్లో ఉన్నప్పుడు సినిమా వాళ్లు కొంతమంది సాయం చేశారు. అంతకంటే ఎక్కువగా అభిమానులు ఆదుకున్నారు. ఆయన ప్రాణం పోతున్నప్పుడు అందరం దగ్గరే ఉన్నాం. అమ్మని తాను జాగ్రత్తగా చూసుకుంటానని అన్నయ్య చెప్పినప్పుడు, ఆయన కళ్లవెంట నీళ్లు చెంపల మీదుగా జారిపోయాయి. అది నేను ఇప్పటికీ మరచిపోలేక పోతున్నాను. మా అమ్మ అమాయకురాలు .. తనకి ఏమీ తెలియదు. చివరి రోజుల్లో బాధపడ్డారు" అంటూ ఉద్వేగానికి లోనయ్యారు.

## ఫైళ్ల దహనం వ్యవహారం..

**విజయవాడలోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో పోలీసుల విచారణ**



**విశ్వంభర, విజయవాడ :** ఇటీవల కృష్ణా నది కరకట్టపై ప్రభుత్వ ఫైళ్ల దహనం వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. ఆ ఫైళ్లపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) మాజీ చైర్మన్ సమీర్ శర్మ ఫొటోలు ఉన్నట్టు గుర్తించారు. దీనిపై నిగ్గు తేల్చేందుకు పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఇవాళ విజయవాడలోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో పోలీసులు విచారణ జరిపారు. పీసీబీలోని ఏడు విభాగాల అధికారులను పోలీసులు ప్రశ్నించారు. కార్యాలయం నుంచి ఫైళ్లు బయటికి వెళ్లడంపై ప్రశ్నించారు. ఫైళ్లు, హార్డ్ డిస్కులు బయటికి వెళ్లడంలో అధికారుల పాత్రపై విచారణ చేపట్టారు.
దహనం చేసిన ఫైళ్లలోని అంశాలు, వాటి ప్రాధాన్యతపై ఆరా తీశారు. ఫైళ్లలోని సమాచారంపై పీసీబీ సిబ్బంది వాంగ్మూలాలు రికార్డు చేశారు.



కొత్తగూడెం పట్టణంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన దారారమేశ్‌ను తన కార్యాలయంలో అభినందిస్తున్న ఆర్యవైశ్య యువజన సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు కొదుమూరి దయాకర్ రావు, కుప్పడపు రామారావు, తాటికొండ ఉపేందర్, కుక్క డప్పు వెంకటేశ్వరరావు, తాటికొండ రామకృష్ణ తదితరులు

**– విశ్వంభర, కొత్తగూడెం**

### విడాకుల తర్వాత ముస్లిం మహిళలు

# భర్త నుంచి భరణం కోరవచ్చు

### సుప్రీంకోర్టు

**విశ్వంభర, న్యూఢిల్లీ :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఓ కేసులో కీలకమైన తీర్పు వెలువరించింది. సీఆర్పీసీ సెక్షన్ 125 ప్రకారం... మతంతో సంబంధం లేకుండా ఏ వివాహిత అయినా విడాకులు తీసుకున్నప్పుడు భర్త నుంచి భరణం కోరే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ముస్లిం మతానికి చెందిన మహిళ అయినా, భర్త నుంచి విడాకుల తర్వాత భరణం కోరవచ్చని వివరించింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. తన మాజీ భార్యకు రూ.10 వేల మధ్యంతర భరణం చెల్లించాలన్న తెలంగాణ హైకోర్టు ఆదేశాలను ఓ ముస్లిం వ్యక్తి సుప్రీంకోర్టులో సవాల్ చేశాడు. ఈ పిటిషన్ పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళకు సీఆర్పీసీ సెక్షన్ 125 కింద దక్కే



ప్రయోజనాలు ముస్లిం మహిళల చట్టం 1986 ప్రకారం చెల్లుబాటు కావని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. అయితే ఈ వాదనలను ద్విసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది. ఓ మహిళకు భరణం ఇవ్వడం అనేది దానధర్మం వంటిది కాదని, భరణం అనేది వివాహిత మహిళ ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. ఇది మతపరమైన హద్దులకు అతీతమైనదని, ప్రతి వివాహిత మహిళకు ఆర్థిక భద్రత కలిగించాలన్న సూత్రం ఇందులో ఇమిడి ఉందని తెలిపింది. అంతేకాదు, సీఆర్పీసీ సెక్షన్ 125 కేవలం వివాహిత మహిళలకే కాకుండా అందరు మహిళలకు వర్తిస్తుందని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. గృహిణులు వారి కుటుంబాల కోసం చేసే త్యాగాలను పురుషులు ఇప్పటికైనా గుర్తించాల్సిన సమయం వచ్చిందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భార్యతో కలిసి జాయింట్ బ్యాంక్ అకౌంట్ ఏర్పాటు చేసుకోవడం, భార్యతో ఏటీఎం కార్డు వివరాలు పంచుకోవడం ద్వారా తన కుటుంబంలో ఆర్థిక స్థిరత్వం కోసం పురుషుడు ముందుకు రావాలని అత్యున్నత న్యాయస్థానం పిలుపునిచ్చింది.

### కూలిపనులకు వెళ్తూనే చదువుకొని

## ఎన్ఐటీలో సీటు సాధించిన గిరిజన బాలిక

**విశ్వంభర, చెన్నై :** ఆమె ఓ నిరుపేద గిరిజన యువతి.. ఏ రోజుకారోజు కూలిపనులకు వెళ్తేగానీ కడుపు నిండని కుటుంబంలో పుట్టింది. అయినా అందరిలా పెద్ద చదువులు చదవాలని గొప్ప కలలు కన్నది. వాటిని సాకారం చేసుకొనేందుకు ఎంతో శ్రమించింది. ఓవైపు తల్లిదండ్రులతోపాటు కూలి పనులకు వెళ్తూనే తీరిక సమయాల్లో కష్టపడి చదివింది. ఫలితం.. దేశంలోకెల్లా అత్యంత కఠినమైన ప్రవేశ పరీక్షల్లో ఒకటైన జేఈఈలో ఆమె సత్తా చాటింది. ఏకంగా 73.8 శాతం స్కోర్ సాధించి ప్రతిష్టాత్మక విద్యాసంస్థ నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ ఐటీ) తిరుచ్చిలో సీటు సాధించింది. తమిళనాడులోని తిరుచిరాపల్లికి చెందిన గిరిజన బాలిక రోహిణి విజయగాథ ఇది. ఈ విజయం వెనక సాగిన కృషిని రోహిణి ప్రముఖ ఆంగ్ల వార్తాసంస్థ ఏఎన్ ఐతో పంచుకున్న వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. ఆ వీడియోను చూసిన నెటిజన్లు రోహిణిని అభినందిస్తున్నారు. ఆమె యువతకు స్ఫూర్తిగా నిలిచిందని ప్రశంసిస్తున్నారు. ఏఎన్ ఐతో రోహిణి మాట్లాడుతూ 'నేను ప్రభుత్వ గిరిజన పాఠశాలలో చదువుకున్నా. నా తల్లిదండ్రులు దినసరి కూలీలు. నేను కూడా కూలిపనులు చేశా. ఓవైపు పనులకు వెళ్తూనే మరోవైపు చదువుకున్నా.




బాగా చదవడంతో సీటు వచ్చింది. మా స్కూల్ హెడ్ మాస్టర్, టీచర్ల కృషి వల్లే నేను పరీక్ష బాగా రాశా' అని చెప్పింది. తనకు తిరుచ్చిలోని ఎన్ ఐటీలో సీటు వచ్చిందని.. కాలేజీ ఫీజునంతా తమిళనాడు ప్రభుత్వం భరించేందుకు ముందుకొచ్చిందని రోహిణి వివరించింది. ఇందుకుగాను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కు కృతజ్ఞతలు తెలియజేసింది.



### ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకుఅవగాహన సదస్సు

**విశ్వంభర, దేవనకొండ :** దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జరిగిన గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులు ఖచ్చితంగా వారికి కావలసిన ఆహారాన్ని తల్లి బిడ్డకు కావాల్సినంత తీసుకోవాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే ఆశ వర్క లను సంప్రదించాలని ఆయన కోరారు. అలాగే ఇంటి పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇప్పుడు వర్షాకాలం అయినందువల్ల నీరు నిలువ ఉండకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని లేదంటే పిల్లలకు మలేరియా డెంగు అదే విధంగా అతిసార వంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, హనుమంతమ్మ, సబ్ యూనిట్ ఆఫీసర్ పాల్గొన్నారు.

## ముంబై రైలు పట్టాల మధ్య చేపలు

**విశ్వంభర, ముంబై :** కుండపోత వర్షాలకు ముంబై అతలాకు తలమైన విషయం తెలిసిందే. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు సిటీలోని చాలా ప్రాంతాలను వరద ముంచె త్తింది. అండర్ పాస్ లు, రైల్వే స్టేషన్లు, పట్టాలు నీట ముని గాయి. రైళ్లు, బస్సులు బంద్ కావడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ వర్షాలకు పలుచోట్ల రైలు పట్టాలు నీట మునగడం, ఆ నీటిలో చేపలు తిరగడం కనిపించింది. సిటీలోని ఓ రైల్వే స్టేషన్ లో పట్టాల మధ్య చేపలు తిరుగుతుండడం చూసి ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో అప్ లోడ్ చేశాడు. దీంతో ఈ వీడియో ప్రస్తుతం వైరల్ గా మారింది. నాలుగైదు చేపలు చెరువులోనో నదిలోనో ఉన్నట్లు ఎంచక్కా అటూఇటూ పరుగులు తీయడం ఈ వీడియోలో చూడొచ్చు. పట్టాలపైకి రైళ్లు వచ్చిపోవడం కామన్ కానీ ఇలా చేపలు తిరగడం మాత్రం ఇప్పుడే చూస్తున్నామంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.





### నంద్యాల జిల్లాలో బాలికపై మైనర్ల గ్యాంగ్ రేప్.. హత్య

**విశ్వంభర, నంద్యాల :** నంద్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఎనిమిదేళ్ల బాలికపై హైస్కూలు విద్యార్థులు ముగ్గురు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపై బాలికను కాల్వలోకి తోసేసి వెళ్లిపోయారు. బిడ్డ కనిపించలేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు ఫైల్ చేసి దర్యాప్తు ప్రారంభించారు. జాగిలాలను రంగంలోకి దింపడంతో ఈ ఘోరం బయటపడింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జిల్లాలోని ఓ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బాలిక మూడు రోజులుగా కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల ప్రాంతాలు, తెలిసిన వాళ్ల ఇళ్లల్లో వెతికిన తల్లిదండ్రులు చివరకు పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు తొలుత ఎలాంటి ఆధారాలు దొరకలేదు. దీంతో జాగిలాలను రంగంలోకి దించారు. బాలికకు చెందిన డ్రెస్ వాసన చూపించి వదిలిపెట్టగా.. ఆ శునకాలు ముందు గ్రామ శివార్లలోని కాల్వ ఒడ్డుకు, అక్కడి నుంచి ముగ్గురు బాలుర ఇంటి వద్దకు తీసుకెళ్లాయి. ఆ ఇంట్లోని ముగ్గురు బాలురు కూడా బాలిక చదివే పాఠశాలలోనే ఆరు, ఏడో తరగతి చదువుతున్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా షాకింగ్ విషయాలు వెల్లడించారు. బాలికపై తాము అత్యాచారం చేశామని ఆ ముగ్గురు బాలురు తెలిపారు. ఆ తర్వాత భయపడి బాలికను చంపి కాల్వలో పడేశామని పోలీసులకు చెప్పారు. దీంతో బాలిక మృతదేహం కోసం పోలీసులు కాల్వలో గాలిస్తున్నారు. ముగ్గురు నిందితులూ పన్నెండు, పదమూడేళ్ల వయసున్న వారే, అయినప్పటికీ ఇంత ఘోరానికి పాల్పడడం గ్రామస్థులను నివ్వెరపరిచింది.

### డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై

## టీడీపీ మద్దతుదారుల దాడిని ఖండిస్తున్నా: జగన్



**విశ్వంభర, విశాఖపట్నం :** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై తాము నిష్పక్షపాత ధోరణిలో వార్త ప్రచురించామని, కానీ టీడీపీ గూండాలు తమ కార్యాలయంపై దాడి చేశారని డెక్కన్ క్రానికల్ పత్రిక ఆరోపించడం తెలిసిందే. దీనిపై వైసీపీ అధ్యక్షుడు జగన్ స్పందించారు. టీడీపీకి చెందిన వ్యక్తులు పిరికితనంతో డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. గుడ్డిగా టీడీపీకి వత్తాసు పలకుండా నిష్పక్షపాతంతో పనిచేసే మీడియాను అణచివేసేందుకు జరిగిన మరో ప్రయత్నమే ఈ దాడి అని జగన్ అభివర్ణించారు. కొత్త ప్రభుత్వ హయాంలో ఏపీలో ప్రజాస్వామ్యం పదేపదే ఉల్లంఘనలకు గురవుతోందని... ఏపీ ముఖ్యమంత్రి దీనికి కచ్చితంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని జగన్ పేర్కొన్నారు.



## దేశంలోని ఉపఎన్నికలకు
# మోగిన నగారా?

**ఎన్డీఏ వర్సెస్ ఇండియా కూటమి హెూరాహెూరేనా?**

**విశ్వంభర, న్యూఢిల్లీ:** దేశంలోని ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల సంఘం పచ్చ జెండా ఊపింది. దీంతో ఎన్డీఏ, ఇండియా కూటమిల మధ్య రసవత్తర పోరు కొనసాగనుంది. తమ ఆధిపత్యం నిరూపించుకోవాలని రెండు కూటములు ప్రయత్నిస్తున్నాయి. ఏ కూటమి విజయం దక్కించుకుంటుందో చూడాల్సిందే. కేంద్రంలో ఇప్పటికే ఎన్డీఏ కొలువు దీరడంతో దానికే ఎక్కువ విజయావకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో సార్వత్రిక ఎన్నికల తర్వాత మరో కీలకమైన ఎన్నికల పోరు ఇవాళ జరుగుతోంది. ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ సీట్లకు ఉపఎన్నికలు జరుగుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ప్రారంభమైంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత ఇండియా కూటమితో ఎన్డీయే తలపడుతున్న పోరు కావడంతో ఈ ఉపఎన్నికలపై ఆసక్తి నెలకొంది. హెూరాహెూరీగా సాగిన సార్వత్రిక ఎన్నికల తరహాలోనే ఉపఎన్నికలు కూడా జరుగుతున్నాయి. ఇవాళ ఉపఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో పంజాబ్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, తమిళనాడు, బీహార్ లోని 13 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. బెంగాల్లో రాయ్ గంజ్, రాణాఘాట్, దక్షిణ్, బాగ్దా సీట్లకు ఉపఎన్నికలు జరుగుతున్నాయి. అలాగే ఉత్తరాఖండ్ లోని బద్రీనాథ్ సీటు, మాంగ్లోర్ సీటుకు ఉపఎన్నికలు నిర్వహిస్తున్నారు. అలాగే హిమాచల్ ప్రదేశ్ లలోని డెహ్రా, హమీర్ పూర్, నలాగర్హ్ సీట్లకు ఉపఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో డెహ్రా సీటులో సీఎం సుఖ్విందర్ సింగ్ సతీమణి కమ్లేష్ ఠాకూర్ ను పోటీలో నిలపడంతో ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. అలాగే తమిళనాడులోని విక్రవండి సీటుకు, బీహార్ లోని రాపోలీ సీటుకు, మధ్యప్రదేశ్ లోని అమర్వారా సీటుకు, పంజాబ్ లోని జలంధర్ వెస్ట్ సీటుకు కూడా ఉపఎన్నికలు జరుగుతున్నాయి.

ఆయా సీట్లలో ఎన్డీయే పక్షాలకూ, ఇండియా కూటమి పార్టీల కు మధ్య ముఖాముఖీ పోరు జరుగుతోంది. ఈ ఉపఎన్నికల ఓట్ల లెక్కింపును జూలై 13న చేపట్టి అదే రోజు ఫలితాలను ప్రకటిస్తారు. వీటి ఫలితాలు నేరుగా ప్రభుత్వాలపై ప్రభావం చూపకపోయినా ఓటరు నాడి ఆధారంగా భవిష్యత్ రాజకీయాలు ఆధారపడనున్నాయి.

# పీఎంఎఫ్‌బీవై మార్గదర్శకాలివే..

- రైతులకు అండగా నిలుస్తున్న పథకం
- అవగాహనతో సద్వినియోగం చేసుకోండి



**విశ్వంభర, న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతులకు ఎంతో ఉపయోగకరమైనది. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీని అమలును పట్టించుకోలేదు. దీని వల్ల కలిగే లాభాలను గుర్తించి వాడుకుంటే ఎన్నో రకాలుగా లాభిస్తుంది. దీనిపై రైతులు పట్టించుకుని పేర్లు నమోదు చేసుకుని పథకాన్ని వాడుకుని లబ్ధి చేకూర్చుకోవాలని చూస్తున్నారు. భారతదేశంలోని రైతులు అనూహ్య వాతావరణ పరిస్థితులతో పాటు.. మార్కెట్ హెచ్చుతగ్గులతో సహా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కొన్ని సార్లు ఆరుకాలం శ్రమించినా అనుకోని వాతావరణ పరిస్థితులతో నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కేంద్రం తీసుకొచ్చిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పంట బీమాను అందించడం ద్వారా రైతులకు భద్రతా వలయంగా నిలుస్తోంది. వ్యవసాయానికి సంబంధించిన ఆర్థిక నష్టాలను తగ్గించడం లక్ష్యంగా ఈ స్కీమ్ రూపొందించబడింది. తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, వాణిజ్య పంటలతో సహా వివిధ పంటలను కవర్ చేస్తుంది. వరదలు, అనావృష్టి, తెగుళ్ల వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు పంట నష్టానికి పరిహారం అందించేందుకు ఈ స్కీమ్ సహాయపడుతుంది. ఆదాయం కోసం తమ పంటలపైనే ఎక్కువగా ఆధారపడే రైతులకు ఈ ఆర్థిక మద్దతు వాస్తవానికి చాలా కీలకమైనది. పీఎంఎఫ్ బీవై ముఖ్యమైన లక్షణాల్లో ఒకటి దాని స్థోమత. రైతులు నామమాత్రపు ప్రీమియం రేటు చెల్లిస్తే, ప్రభుత్వం మిగిలిన మొత్తాన్ని సబ్సిడీగా దీనిలో అందించటం స్కీమ్ గొప్ప ప్రయోజనంగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు, రైతులు ఖరీఫ్ పంటలకు బీమా మొత్తంలో 2%, రబీ పంటలకు 1.5% మాత్రమే చెల్లిస్తారు. కేంద్ర పథకం తుఫానులు, అకాల వర్షాల వల్ల ఏర్పడే పంట అనంతర నష్టాలకు కూడా కవరేజీ అందిస్తుంది. ఇటువంటి సంఘటనలకు ఎక్కువ హాని కలిగించే తీర ప్రాంతాల రైతులకు ఈ అంశం ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రస్తుతం వర్షాకాలంలో పంటలు సాగు చేయటం ప్రారంభించిన రైతులు తక్కువ ప్రీమియం చెల్లింపుతో పంట నష్టాన్ని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. పీఎంఎఫ్‌బీవైని అమలు చేయడంలో సాంకేతికతను ఉపయోగించడం మరొక ముఖ్యమైన అంశం. పంట నష్టాన్ని ఖచ్చితంగా అంచనా వేయడానికి రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీ, డ్రోన్‌లను ఉపయోగిస్తారు. ఇది క్లెయిమ్‌లు సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రాసెస్ చేయటానికి దోహదపడుతున్నాయి. పీఎంఎఫ్ బీవై అమలు అనేక సవాళ్లను ఎదుర్కొంది. క్లెయిమ్ సెటిల్మెంట్లలో జాప్యం ఒక ముఖ్యమైన సమస్యగా ఉంది. ఇది రైతులను మనోవ్యదకు గురిచేస్తోంది. అదనంగా నష్టం అంచనా నివేదికలలో వ్యత్యాసాలు ఉన్న సందర్భాలు ఉన్నాయి. క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ల కోసం తప్పనిసరి సమయపాలన, ఖచ్చితమైన అంచనాల కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వంటి సంస్కరణలను ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టింది. ఈ చర్యలు పథకం సామర్థ్యాన్ని, విశ్వసనీయతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. రైతులపై పీఎంఎఫ్ బీవై ప్రభావం గణనీయంగా ఉంది. చాలా మంది రైతులు ఈ పథకం కష్ట సమయాల్లో తమకు అవసరమైన ఆర్థిక భద్రతను అందించిందని నివేదించారు. పంట నష్టాల నుంచి అప్పుల ఊబిలో కూరుకుపోకుండా కోలుకునేలా రైతులను కాపాడుతుంది స్కీమ్ పై మహారాష్ట్రకు చెందిన ఒక రైతు మాట్లాడుతూ.. "గత సంవత్సరం తీవ్రమైన కరువు తర్వాత నా పొలాన్ని తిరిగి పంటకు సిద్ధం చేసేందుకు ఇన్సూరెన్స్ డబ్బు నాకు సహాయపడింది." అని వెల్లడించాడు. ఇది వాస్తవ స్థాయిలో పంట బీమా ప్రాముఖ్యత, అది రైతులకు అందిస్తున్న సహాయాన్ని నిర్ధారిస్తోంది. చివరిగా అందరూ గుర్తుంచుకోవాల్సింది వ్యవసాయానికి సంబంధించిన వివిధ ప్రమాదాల నుంచి భారతీయ రైతులను రక్షించడంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కీలక పాత్ర పోషిస్తుందనే విషయాన్నే. దీని అమలులో సవాళ్లు ఉన్నప్పటికీ, కొనసాగుతున్న సంస్కరణలు దాని ప్రభావాన్ని మెరుగుపరుస్తున్నాయి. ఈ కీలకమైన భద్రతా వలయం నుంచి ఎక్కువ మంది రైతులు ప్రయోజనం పొందేలా చూడటం లక్ష్యంగా కేంద్రం స్కీమ్ ను కొనసాగిస్తోంది.

## ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్
# ప్లాన్ పై ఆపసోపాలు

**కీలక ప్రతిపాదన చేసే అవకాశం**

**విశ్వంభర, న్యూఢిల్లీ :** గత కొంత కాలంగా కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన పలు నిబంధనల్లో సవరణలు చేసింది. ఈపీఎఫ్ నుంచి ఎన్పీఎస్ వరకు రూల్స్ మారుస్తూ నిర్ణయం తీసుకుంది. కొన్నింటిపై ఉద్యోగ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయితే మరికొన్ని మాత్రం సిబ్బందికి మేలు జరిగేలా దశాబ్దం నాటి నియమాలను ఛేంజ్ చేసింది. కాగా ఇప్పుడు ఎన్పీఎస్ గురించి మరో కీలక ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్పీఎస్) కింద కవర్ చేయబడిన ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వారు చివరగా పొందిన వేతనంలో 50 శాతాన్ని పెన్షన్‌గా స్వీకరించే విధంగా రూల్ తీసుకొస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఉద్యోగుల పేఅవుట్ అసమానతలపై ఆందోళనలను పరిష్కరించడానికి ఈ విధంగా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రముఖ మీడియా సంస్థ నివేదించింది. పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ని తిరిగి అందుబాటులోకి తీసుకురావడాన్ని ప్రభుత్వం తోసిపుచ్చింది. ఆర్థిక సంఘం సిఫార్సులతో దీనికి కొన్ని సర్దుబాట్లు చేసినట్లు నివేదిక పేర్కొంది. ఎన్పీఎస్ లో ఉద్యోగులు వారి ప్రాథమిక జీతంలో 10 శాతం విరాళంగా అందిస్తారు. దీనికి ప్రభుత్వం నుంచి 14 శాతం షేర్ యాడ్ అవుతుంది. కాగా ఫైనాన్స్ సెక్రటరీ టీవీ సోమనాథన్ అధ్యక్షతన ఒక కమిటీని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన తర్వాత ఈ మేరకు ప్రతిపాదన వచ్చినట్లు సమాచారం. సోమనాథన్ కమిటీ వివిధ దేశాల్లోని పద్ధతులను సమీక్షించి, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన మార్పుల ఫలితాలను అధ్యయనం చేసిందని నివేదిక పేర్కొంది. 25-30 ఏళ్లలోపు సేవలందించే ఉద్యోగులకు వారు డ్రా చేసిన చివరి వేతనంలో 50 శాతానికి ప్రభుత్వం త్వరలో హామీ ఇవ్వగలదని భావిస్తున్నట్లు చెప్పింది. ఆర్థిక స్థిరత్వాన్ని నెలకొల్పేందుకు కార్పొరేట్ రిటైర్మెంట్ ప్రయోజనాల వంటి ప్రత్యేక నిధిని రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపింది.

## వంకర బుద్ధి జో బైడెన్‌ను
# ఓ అంశంలో మెచ్చుకోవాలి : ట్రంప్

**అమెరికా :** ఈ ఏడాది నవంబరులో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాటల దాడిలో తీవ్రత పెంచుతున్నారు. తాజాగా, దేశాధ్యక్షుడు జో బైడెన్ ను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వంకర బుద్ధి జో బైడెన్‌ను ఓ అంశంలో మెచ్చుకోవాలి... బైడెన్ తన జీవితంలో తీసుకున్న అద్భుతమైన నిర్ణయం ఏదైనా ఉందంటే అది కమలా హ్యారిస్ ను ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంచుకోవడమేనని ఎద్దేవా చేశారు. "బైడెన్ కు కమలా హ్యారిస్ ఓ ఇన్యూరెన్స్ పాలసీ వంటిది. ఉపాధ్యక్ష అభ్యర్థిగా సగం సమర్థుడ్ని ఎన్నుకున్నా ఈపాటికి బైడెన్ ను సాగనంపేవారు... కానీ కమల్ హ్యారిస్ ఉపాధ్యక్షురాలిగా ఉండడంతో బైడెన్ బతికిపోయాడు" అంటూ ఇద్దరినీ కలిపి విమర్శించారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా జూన్ 27న జరిగిన డిబేట్ లో బైడెన్ పేలవ ప్రదర్శన సొంత పార్టీ (డెమొక్రటిక్ పార్టీ)లోనే విమర్శలకు దారితీసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



అమెరికా అధ్యక్ష రేసులో డెమొక్రటిక్ పార్టీ నుంచి జో బైడెన్, రిపబ్లికన్ పార్టీ నుంచి డొనాల్డ్ ట్రంప్ రేసులో ఉండడం తెలిసిందే.




## ఏంజెల్ వన్ యూజర్ల
# డేటా బహిర్గతం

**వెబ్‌సైట్‌లో కనిపించడంతో షాక్**

**విశ్వంభర, న్యూఢిల్లీ:** ఓ పక్కన పెరుగుతున్న సాంకేతికతను చూసి గర్వపడాలో, దానితో పాటే ఉత్పన్నమవుతున్న సమస్యలను చూసి బాధ పడాలో తెలియని పరిస్థితి నెలకొంది. టెక్నాలజీ వల్ల మానవ జీవన ప్రమాణాలను మెరుగుపడుతుండగా.. అదే సాంకేతికతతో అందిన కాడికి దోచుకునేందుకు దుండగులు సైతం రెడీ అయ్యారు. సైబర్ అటాక్‌లు, హ్యాకింగ్స్‌తో సున్నితమైన ఆర్థిక, వ్యక్తిగత డేటాను చోరిచేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ ఏంజెల్ వన్ డేటా లీక్ అయినట్లు నివేదికలు చెబుతున్నాయి. దాదాపు 8 మిలియన్ల కస్టమర్లు దీని ద్వారా ప్రభావితమైనట్లు వార్తలు వచ్చాయి. ఒక వెబ్‌సైట్‌లో బాధిత వినియోగదారుల పేర్లు మరియు చిరునామాలతో సహా వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకర్ లీక్ చేసినట్లు ప్రముఖ వార్తా సంస్థ నివేదించింది. సదరు కస్టమర్ల లాభనష్టాల ప్రకటనలతో కూడిన సున్నితమైన డేటాను అజ్ఞాత వ్యక్తి యాక్సెస్ చేసినట్లు పేర్కొంది. ఈ డేటా 2023 నాటిదని ఓ సైబర్ సెక్యూరిటీ కన్సల్టెంట్ చెప్పినట్లు వెల్లడించింది. ఈ నివేదికపై ఏంజెల్ వన్ స్పందించింది. కస్టమర్ డేటా సురక్షితంగా ఉందని, కొత్తగా ఎటువంటి డేటా లీక్ జరగలేదని తెలిపింది. ప్రస్తుత సమస్య ఏప్రిల్ 2023లో జరిగిన సంఘటనకు సంబంధించినది కాగా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించింది. దీని వల్ల క్లయింట్ సెక్యూరిటీలు, ఫండ్స్, లాగిన్ సమాచారంపై ఎటువంటి ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. తమవద్ద అన్ని క్లయింట్ ఖాతాలు సురక్షితంగా ఉంటాయని హామీ ఇచ్చింది. గత ఏడాది ఏప్రిల్‌లో ఏంజెల్ వన్ డేటా ఉల్లంఘనకు గురైంది. అయితే ప్రభావితమైన కస్టమర్ల సంఖ్యను కంపెనీ వెల్లడించలేదు. ప్రభావితమైన వినియోగదారుల పేర్లు, మొబైల్ నంబర్‌లు మరియు ఇమెయిల్ చిరునామాలు మాత్రమే లీక్ అయినట్లు పేర్కొంది. నిధులు మరియు సెక్యూరిటీలకు సంబంధించిన సమాచారం సురక్షితంగా ఉందని భరోసా ఇస్తున్నట్లు అప్పట్లో వివరించింది. భారత్‌లో ఒక్క 2023 లోనే ఒక్కో సంస్థ వారానికి దాదాపు 2 వేల 138 దాడులను ఎదుర్కొన్నట్లు సైబర్ సెక్యూరిటీ సంస్థ చెక్ పాయింట్ తెలిపింది. సిస్కో 2024 సైబర్ సెక్యూరిటీ రెడీనెస్ ఇండెక్స్ కూడా కేవలం 4 శాతం భారతీయ సంస్థలు మాత్రమే సైబర్ సెక్యూరిటీ ప్రమాదాలను ఎదుర్కోవడానికి రెడీ ఉన్నట్లు వెల్లడించింది. మరో 37 శాతం తమ ఇందుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొంది. అయితే ప్రపంచవ్యాప్తంగా కూడా 3 శాతం మాత్రమే సంసిద్ధంగా ఉన్నట్లు చెప్పి షాక్ ఇచ్చింది.

# భారత్-రష్యా సంబంధాలపై స్పందించిన అమెరికా

**అమెరికా :** భారత్-రష్యా సంబంధాలపై అగ్రరాజ్యం అమెరికా స్పందించింది. రష్యాతో భారత్ సన్నిహిత సంబంధాలు కొనసాగించడంపై ఆందోళనలు ఉన్నప్పటికీ... భారత్‌తో తమ వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ, రక్షణ శాఖలు భారత్-రష్యా అధినేతల సమావేశం, సన్నిహిత సంబంధాలపై స్పందించాయి. భారత్, రష్యా మధ్య ఎంతోకాలంగా ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ మేజర్ జనరల్ ప్యాట్ రైడర్ అన్నారు. తమ వరకు భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అన్నారు. రష్యాతో భారత్‌కు ఉన్న సంబంధాలపై తమకు పూర్తి స్పష్టత ఉందని పేర్కొన్నారు. ఈ వారం నాటో శిఖరాగ్ర సదస్సు సమయంలో... మోదీ మాస్కో పర్యటనపై ప్రపంచం దృష్టి సారించిందన్నారు. ప్రపంచ దేశాలకు తాము దూరం కాలేదని వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించుకున్నా ఆశ్చర్యం లేదన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధ నిర్ణయమే ప్రపంచానికి రష్యాను దూరం చేసిందన్నారు. దీనికి



రష్యా ఎంతో మూల్యం చెల్లిస్తోందన్నారు. భారత ప్రధాని మోదీ కేవలం రష్యాతోనే కాకుండా జెలెన్‌స్కీతో కూడా మాట్లాడారని గుర్తు చేశారు. శాంతియుత పరిష్కారానికి భారత్ మద్దతు ఇస్తుందనే భరోసా కల్పించిందన్నారు. భారత్-రష్యా సంబంధాలపై ఆందోళనలు ఉన్నప్పటికీ... తమకు స్పష్టత ఉందని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ అన్నారు. రష్యాతో మైత్రి కొనసాగింపుపై తమ ఆందోళనను భారత్‌కు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామన్నారు.

## పారిస్ ఒలింపిక్స్ లో భారత బృందానికి
# స్పాన్సర్‌గా అదానీ గ్రూప్




**విశ్వంభర, ముంబై :** మరి కొన్ని రోజుల్లో విశ్వ క్రీడా సంరంభం ఒలింపిక్స్ కు తెరలేవనుంది. ఈసారి ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరం ఒలింపిక్స్ కు ఆతిథ్యమిస్తోంది. ఎప్పట్లాగానే భారత్ ఈసారి కూడా ఒలింపిక్స్ కు భారీ బృందాన్నే పంపుతోంది. 113 మంది అథ్లెట్లతో కూడిన భారత బృందానికి పారిస్ ఒలింపిక్స్ లో అదానీ గ్రూప్ ప్రధాన స్పాన్సర్ గా వ్యవహరించనుంది. ఈ మేరకు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడించారు. ఓ స్పాన్సర్ గా భారత అథ్లెట్లకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కాగా, 'దేశ్ కా గీత్ ఎట్ ఒలింపిక్స్' పేరిట భారత అథ్లెట్లకు మద్దతుగా ఓ వీడియోను కూడా అదానీ గ్రూప్ సిద్ధం చేసింది. పారిస్ ఒలింపిక్స్ జులై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరగనున్నాయి.

# భారత్-చైనా సరిహద్దుల్లో 108 కిలోల బంగారం స్వాధీనం

**విశ్వంభర, న్యూఢిల్లీ :** భారత్-చైనా సరిహద్దుల్లో గస్తీ కాస్తున్న ఐటీబీపీ (ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్) బలగాలు భారీ ఎత్తున బంగారం స్వాధీనం చేసుకున్నాయి. ఔషధ మొక్కల డీలర్ల ముసుగులో 108 కిలోల బంగారం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను భారత భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ఐటీబీపీ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో బంగారం స్వాధీనం చేసుకోవడం ఇదే ప్రథమం. తూర్పు లడఖ్‌లోని చాంగ్ తాంగ్ సబ్ సెక్టార్ లో ఈ ఘటన చోటు చేసుకుంది. డిప్యూటీ కమాండెంట్ దీపక్ భట్ నాయకత్వంలోని పెట్రోలింగ్ స్క్వాడ్ పక్కా సమాచారంతో స్మగ్లర్లను పట్టుకుంది. వారి నుంచి బిస్కెట్ల రూపంలో ఉన్న బంగారంతో పాటు రెండు ఫోన్లు, ఒక బైనాక్యులర్, రెండు కత్తులు,




కొన్ని రకాల చైనీస్ ఆహార పదార్థాలు, కేక్ లు, పాలు స్వాధీనం చేసుకున్నారు. ఐటీబీపీ బలగాలను చూసి స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేయగా, వెంటాడి పట్టుకున్నారు.



# పవన్ కల్యాణ్ సంచలనం..

## అధికారుల పనితీరుపై సర్వే..

**విశ్వంభర, పిఠాపురం :** సినిమాల్లో ట్రెండ్ సెట్ చేసే పవన్ కల్యాణ్.. పాలనా వ్యవహారాల్లోనూ ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తున్నారు. డిప్యూటీ సీఎంగా పిఠాపురం అభివృద్ధిపై దృష్టి పెట్టిన ఆయన.. నియోజకవర్గంలోని సమస్యలపై అధ్యయనం చేయిస్తున్నారు. అయితే.. పిఠాపురం మున్సిపాలిటీ సిబ్బంది పనితీరుపై సర్వే చేయిస్తూ సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. పిఠాపురం మున్సిపాలిటీలోని సమస్యలు, మౌలిక వసతులపై సర్వే అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఈక్రమంలో.. పిఠాపురంలో అనేక సమస్యలు గుర్తించి మున్సిపాలిటీ సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇక.. పిఠాపురం నియోజవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేలా వేగంగా అడుగులు వేస్తున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. పిఠాపురం అభివృద్ధికి సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అటు.. పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై.. పిఠాపురం సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. పిఠాపురంపై వరుసగా సమీక్షలు చేస్తూ అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు. ప్రజా సంక్షేమం విషయంలో రాజీ పడకుండా ముందుకు వెళు_న్నారు. ప్రతి విషయాన్ని ప్రజలకు అర్థమ య్యేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎప్పటి కప్పుడు అధికారులను అప్రమత్తంగా చేస్తున్నా రు. ఈ క్రమంలోనే.. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో కలెక్టర్ చేపట్టే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లాంటి కార్యక్రమాన్ని కూడా నెలలో రెండు వారాలు పిఠాపురంలోనే ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు.. ప్లాస్టిక్ భూతంపై యుద్ధాన్ని ప్రకటించారు పవన్ కల్యాణ్. తాజాగా.. కాలుష్య నియంత్రణపై రివ్యూ చేసిన పవన్.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే విధంగా కార్యాచరణను రూపొందిస్తున్నట్లు ప్రకటించా రు. సొంత నియోజకవర్గమైన పిఠాపురం నుంచే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఇలాంటి సమ యంలోనే పిఠాపురం మున్సిపాలిటీ సిబ్బంది పనితీరుపై ప్రత్యేక అధికారుల బృందంతో పవన్‌కళ్యాణ్ సర్వే చేయిస్తుండడం హాట్‌టాపిక్‌గా మారింది.

# అన్న క్యాంటీన్ల ప్రారంభానికి రెడీ

## ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి..




**విశ్వంభర, విజయవాడ:** గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పేద వారి ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు తరువాత వైసీపీ ప్రభుత్వంలో మూతపడ్డాయి. ఇప్పుడు మళ్లీ టీడీపీ ప్రభుత్వం రావడంతో అన్న క్యాంటీన్లు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పేదవారికి కడపు నింపే పథకం పకడ్బందీగా నిర్వహించాలని ప్రణాళికలు రచిస్తోంది. ఏపీలో పేదలకు నామమాత్రపు ధరకు మూడు పూటలా కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్లు సిద్ధమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో మూతపడ్డ అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించేందుకు కూటమి సర్కార్ శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే గతంలో అన్న క్యాంటీన్లు నడిచిన భవనాల రిపేర్లు పూర్తి చేయడంతో పాటు కొత్తగా నిర్మాణాలు చేపడుతోంది. ఇప్పుడు తాజాగా ఈ క్యాంటీన్లలో సరఫరా చేసే ఆహార టెండర్లను కూడా పిలుస్తోంది. ఆగస్టు 15 కల్లా రాష్ట్రవ్యాప్తంగా క్యాంటీన్లు తెరుచుకోనున్నాయి. ఆగస్టు 15న తొలి విడతగా 183 క్యాంటీన్లను తెరిచే అవకాశముంది. అనంతరం మిగిలిన క్యాంటీన్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. గతంలో నడిచిన అన్న క్యాంటీన్లను తిరిగి తెరిచే బాధ్యతను పట్టణ స్దానిక సంస్థలకు అప్పగించారు. వీటి కోసం రూ.20 కోట్ల నిధుల్ని కూడా కేటాయించారు. దీంతో ఆయా సంస్థలు వీటి రిపేర్లు, ఇతర పనులకు టెండర్లు పిలుస్తున్నాయి. అలాగే క్యాంటీన్లలో సాంకేతిక పరికరాల ఏర్పాటు కోసం మరో 7 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. మరోవైపు క్యాంటీన్లలో ఆహార సరఫరాకు కూడా ప్రభుత్వం టెండర్లు పిలుస్తోంది. తొలిదశలో ప్రారంభించే 183 క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేసే సంస్థల నంచి టెండర్లు ఆహ్వానించారు. ఈ నెల 22 లోగా వీరు టెండర్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. నెలాఖరులోకా వీటిని ఖరారు చేసి సరఫరా కాంట్రాక్టులు అప్పగిస్తారు. అలాగే క్యాంటీన్లను నిర్వహించేందుకు దాతల నుంచి ఆదాయపు పన్ను మినహాయింపుతో విరాళాలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్దమవుతోంది. త్వరలో దీనిపై అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వబోతోంది.

## పెట్టుబడులే లక్ష్యంగా

# వడివడిగా సీఎం అడుగులు



**విశ్వంభర, మంగళగిరి :** బీపీసీఎల్ ఛైర్మన్, ఎండీ కృష్ణకుమార్‌తో పాటు సంస్థ ప్రతినిధులతో సచివాలయంలో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై చర్చించారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే దాదాపు 60 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురితో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. మచిలీపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుచేయాలని సూత్ర ప్రాయంగా నిర్ణయించారు. వాటికి కొనసాగింపుగా బీపీసీఎల్ ప్రతినిధులతో చంద్రబాబు భేటీ అయ్యారు. విందు కూడా ఇచ్చారు. ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 4 నుంచి 5 వేల ఎకరాలు అవసరం ఉంటుందని కంపెనీ ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అందుకు అససరమైన భూముల కేటాయింపుతో పాటు అన్ని రకాలుగా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన పూర్తి ప్రణాళికతో 90 రోజుల్లో రావాలని కంపెనీ ప్రతినిధులను చంద్రబాబు కోరారు. అక్టోబర్ నాటికి ఫీజిబిలిటీ రిపోర్ట్‌తో వస్తామని బీపీసీఎల్ ప్రతినిధులు సీఎంకి వివరించారు. ఈ విషయాలను తన ఎక్స్ ఖాతాలో కూడా చంద్రబాబు షేర్ చేశారు. ఇక విన్‌ఫాస్ట్ కంపెనీ ప్రతినిధులతోనూ చంద్రబాబు భేటీ అయ్యారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో వియత్నాంలో మంచి పేరున్న సంస్థే ఈ విన్‌ఫాస్ట్. ఈ సంస్థ సీఈవో పామ్ సాన్ చౌ తో పాటు సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఈ సందర్భంగా సీఎం వారికి వివరించారు. ఎలక్ట్రానిక్ వాహనాలు, బ్యాటరీ తయారీ ప్లాంట్‌ను ఏపీలో నెలకొల్పాలని చంద్రబాబు కోరారు. ప్లాంట్‌కు అవసరమైన భూమి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు తాము సిద్ధంగా ఉన్నామనీ.. ప్రభుత్వం తరుపున అన్ని విధాలా సహకరిస్తామనీ స్పష్టంచేశారు. ఈ వివరాలను సైతం ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు సీఎం చంద్రబాబు. మరోవైపు ఆర్థికశాఖపైనా సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. త్వరలో శ్వేతపత్రం విడుదల చేయనున్న నేపథ్యంలో రాష్ట్రానికి ఉన్న అప్పులు, ఆదాయాలపై అధికారులను ఆరా తీశారు. ఇప్పటికే అన్ని రకాల అప్పులు కలిపి మొత్తం 14లక్షల కోట్ల వరకు ఉన్నాయని ఆర్థికశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పెండింగ్ బిల్లులు ఎంత ఉన్నాయనే అంశంపైనా సీఎం చర్చించారు. శాఖల వారీగా వివరాలు ఇవ్వాలని ఇప్పటికే అధికారులను సీఎం ఆదేశించారు. అన్ని శాఖల సమగ్ర రిపోర్ట్‌తో శ్వేతపత్రం విడుదల చేసేందుకు ప్రభుత్వ సిద్ధమవుతోంది. అదే సమయంలో బడ్జెట్ రూపకల్పనపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పూర్తి స్థాయి బడ్జెట్ కాకుండా ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్ పెట్టాలని ఆర్థికశాఖ ప్రతిపాదించింది.



## గత ప్రభుత్వంలో ఈ శాఖ ఉందని కూడా

# ఎవరికీ తెలియదు

### మంత్రి అచ్చెన్నాయుడు

**విశ్వంభర, మంగళగిరి :** ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు నేడు మత్స్యశాఖపై సమీక్ష సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మత్స్యశాఖ పరిస్థితి చూస్తుంటే చాలా బాధ కలుగుతోందని అన్నారు. గత ప్రభుత్వంలో మత్స్యశాఖ ఉందన్న విషయం కూడా ఎవరికీ తెలియదని వ్యాఖ్యానించారు. వైసీపీ సర్కారు హయాంలో ఐదు హార్బర్లకు టెండర్లు పిలిచి సొంతవారికే కట్టబెట్టారని, రెండోసారి నాలుగు హార్బర్లను వైసీపీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఇచ్చారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. మత్స్యకారులకు డీజిల్ రాయితీ రూ.10 కోట్ల బకాయి ఉందని వెల్లడించారు. డీజిల్ సబ్సిడీ బకాయిలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్యకార భృతిపై సర్వే చేసి 20 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులకు నిర్దేశించినట్టు వివరించారు. మత్స్య పరిశ్రమ ఎగుమతుల వృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని, ఎగుమతులకు ఉన్న అన్ని అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు సూచించినట్టు అచ్చెన్నాయుడు వెల్లడించారు.

# కడప ఎంపీగా జగన్ పోటీ చేస్తారా?

- జోరుగా ఊపందుకుంటున్న ప్రచారం
- క్లారిటీ ఇచ్చిన వైవీ సుబ్బారెడ్డి



**విశ్వంభర, కడప:** ఏపీలో రాజకీయాలు మారుతున్నాయి. సమూల మార్పులు వస్తున్నాయి. వైసీపీ ఘోర పరాభవం తరువాత దిద్దుబాటు చర్యలకు దిగుతున్నారు. దీంతో కడప ఎంపీగా ఉన్న అవినాష్‌రెడ్డిని రాజీనామా చేయించి అక్కడ నుంచి ఎంపీగా జగన్ పోటీ చేస్తారని కొద్ది రోజులుగా ప్రచారం ఊపందుకుంది. దీనిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ప్రస్తావించడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఏపీ రాజకీయాలు రసవత్తరంగా కొనసాగనున్నట్లు తెలుస్తోంది. ఏపీలో గత కొన్ని రోజులుగా కడప ఉప ఎన్నికపై ప్రచారం జరుగుతోంది. పులివెందుల ఎమ్మెల్యేగా ఉన్న వైసీపీ అధినేత వైఎస్ జగన్.. త్వరలో ఆ స్ధానానికి రాజీనామా చేసి కడప ఎంపీగా పోటీ చేయబోతున్నారనేది ఈ ప్రచారం సారాంశం. ఎంపీగా ఉన్న వైఎస్ అవినాష్ రెడ్డితో రాజీనామా చేయించి ఆ సీటులో తాను పోటీ చేసేందుకు జగన్ సిద్దమవుతున్నారని టీడీపీ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. ఇదే అంశాన్ని తాజాగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రస్తావించడంతో దీనిపై వైసీపీ స్పందించింది. పులివెందుల ఎమ్మెల్యే సీటుకు వైఎస్ జగన్ రాజీనామా చేసి కడప లోక్ సభకు పోటీ చేస్తారంటూ జరుగుతున్న ప్రచారంపై పార్టీ ఎంపీ, జగన్ బాబాయ్ కూడా అయిన వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. ఇదంతా దుష్ప్రచారమే అన్నారు. జగన్ రాజీనామా చేయరని, చేయాల్సిన అవసరం కూడా లేదని ఆయన తేల్చిచెప్పేశారు. అదంతా టీడీపీ చేస్తున్న ప్రచారమే అన్న వైవీ.. దీన్ని ఖండిస్తున్నట్లు స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి కేవలం 11 సీట్లు మాత్రమే రావడంతో అసెంబ్లీకి రాలేని పరిస్థితి జగన్ కు ఎదురవుతోంది. విపక్ష నేత హోదా కోసం స్పీకర్ కు జగన్ చేసిన విజ్ఞప్తిని కూడా పట్టించుకునే అవకాశం కనిపించకపోవడంతో ఇక ఎమ్మెల్యేగా రాజీనామా చేసి ఎంపీగా పోటీ చేసి పార్లమెంట్‌కు వెళ్తారన్న ప్రచారం జరిగింది. అయితే నిన్న కడప వైసీపీ అధ్యక్షుడు సురేశ్ బాబు, ఇవాల ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కూడా దీన్ని ఖండించడంతో అదంతా ఒట్టిదేనని తేలిపోయింది.

## టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిపై

# విజిలెన్స్ విచారణకు ఆదేశాలు



**విశ్వంభర, తిరుమల :** టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిపై పూర్తి స్థాయిలో విజిలెన్స్ విచారణకు ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సమాచార, ప్రజా సంబంధాల శాఖ మాజీ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డిపై కూడా విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ధర్మారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డికి సహకరించిన ఇతర ఉద్యోగులను కూడా విచారించాలని ప్రభుత్వం తన ఆదేశాల్లో పేర్కొంది. ధర్మారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి భారీగా అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులు వచ్చాయి. ధర్మారెడ్డిపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేయగా... విజయ్ కుమార్ రెడ్డిపై పాత్రికేయ సంఘాలు ఫిర్యాదు చేశాయి. ధర్మారెడ్డి ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. విజయ్ కుమార్ రెడ్డి ఇటీవలే కేంద్ర సర్వీసుల్లో చేరేందుకు ఢిల్లీ వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చారు.
టీటీడీని అడ్డంపెట్టుకుని వైసీపీకి విరాళాలు సేకరించా రని, బడ్జెట్ తో సంబంధం లేకుండా కాంట్రాక్టు లు ఇచ్చారని ధర్మారెడ్డిపై ఆరోపణలు వచ్చా యి. శ్రీవాణి టికెట్లలోనూ అక్రమాలకు పాల్ప డ్డారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఇక, సమా చార శాఖలో అవినీతికి పాల్పడ్డారని విజ య్ కుమార్ పై ఆరోపణలు ఉన్నాయి.

## పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై

# తీర్పు ఈనెల 18కి వాయిదా

- టీడీపీ ఏజెంట్ పై దాడి, సీఐపై దాడి కేసుల్లో పిన్నెల్లి అరెస్ట్
- నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పిన్నెల్లి
- పిన్నెల్లికి బెయిల్ నిరాకరించిన మాచర్ల కోర్టు
- గుంటూరు 4వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టును ఆశ్రయించిన పిన్నెల్లి



**విశ్వంభర, మాచర్ల:** మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఇటీవల పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. ఎన్నికల సమయంలో పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడి, సీఐ నారాయణ-స్వామిపై దాడి కేసుల్లో పోలీసులు పిన్నెల్లిని అదుపులోకి తీసుకున్నారు. పిన్నెల్లి ప్రస్తుతం నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ రెండు కేసుల్లో బెయిల్ కోసం పిన్నెల్లి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మాచర్ల కోర్టు తన బెయిల్ పిటిషన్ తిరస్కరించడంతో ఆయన గుంటూరు నాలుగో అదనపు జిల్లా సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. పిన్నెల్లి పిటిషన్లపై నేడు గుంటూరు కోర్టు విచారణ చేపట్టింది. ఈ రెండు కేసుల్లో పోలీసు విచారణ జరుగుతున్నందున... తీర్పును ఈ నెల 18కి వాయిదా వేస్తున్నట్టు న్యాయస్థానం తెలిపింది. పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై విచారణ సందర్భంగా నేడు గుంటూరు కోర్టులో వాదనలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున పీపీ అశ్విని కుమార్ వాదనలు వినిపించారు. పిన్నెల్లికి నేర చరిత్ర ఉందని, ఈ కేసులో ఇంకా కొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని అశ్విని కుమార్ తెలిపారు. పిన్నెల్లి పోలీస్ కస్టడీ వివరాలను కూడా న్యాయస్థానానికి అందించారు. పిన్నెల్లి పోలీసు విచారణకు సహకరించడంలేదని వివరించారు. ఈ నేపథ్యంలో, పిన్నెల్లికి బెయిల్ ఇవ్వొద్దని కోరారు.

## ఆర్థిక సర్వేపై స్పందించే దమ్ము

# జగన్ కు ఉందా? : యనమల



**విశ్వంభర, గుంటూరు :** టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు మాజీ సీఎం జగన్ పై ధ్వజమెత్తారు. ఆర్థిక సర్వేపై స్పందించే దమ్ము జగన్ కు ఉందా? అని నిలదీశారు. ఏపీ ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా కుప్పకూలిందో ఆర్థిక సర్వే 2022-23 ద్వారా స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. అమరావతి, పోలవరం, నదుల అనుసంధానం, పారిశ్రామిక రంగం, విద్యుత్... ఇలా అన్ని వ్యవస్థలను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లు విధ్వంసకర పాలన కొనసాగిందని అన్నారు. ఏమీ చేయకుండానే అన్నీ చేసినట్టు గొప్పలు చెప్పుకున్నారని విమర్శించారు. అందుకే, ప్రజలు వైసీపీకి తగిన బుద్ధి చెప్పి, తలరాతను తిరగరాశారని యనమల వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో అన్ని రంగాలను నిర్లక్ష్యం చేసి గాలికి వదిలేశారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రులను నరక కూపాలుగా తయారుచేశారని, ఆరోగ్య శ్రీని అనారోగ్య శ్రీగా మార్చివేశారని విమర్శించారు. ఏపీలో నెలకొన్న భయానక పరిస్థితులతో ఒక్క పారిశ్రామికవేత్త కూడా ఇటువైపు చూడని పరిస్థితి నెలకొందని, ఉన్న పరిశ్రమలు వెళ్లిపోయాయని అన్నారు. వ్యవసాయ రంగం పరిస్థితి మరీ దారుణమని, వందేళ్ల వ్యవసాయ రంగ చరిత్రలో పాతాళానికి పడిపోయిన దుస్థితిని వైసీపీ ప్రభుత్వంలోనే చూశామని యనమల విమర్శించారు. జగన్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు కూడా పూర్తి చేయలేకపోయిందని, అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. జగన్ తప్పుడు విధానాలతో ఆక్వారంగం బలైందని యనమల పేర్కొన్నారు. ఆక్వా విద్యుత్ రేట్ల పెంపునకు తోడు అవినీతి కూడా ప్రభావం చూపిందని తెలిపారు.


# టీమిండియాదే విజయం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో ఆతిథ్య జింబాబ్వేతో జరిగిన మూడో టీ20 మ్యాచ్ లో టీమిండియా 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. 183 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన జింబాబ్వేను టీమిండియా బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. ఛేజింగ్ లో జింబాబ్వే 20 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులే చేసి ఓటమిపాలైంది. జింబాబ్వే ఇన్నింగ్స్ లో డియాన్ మైర్స్ 65 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. 49 బంతులు ఎదుర్కొన్న మైర్స్ 7 ఫోర్లు, 1 సిక్స్ బాదాడు. మైర్స్ కు వికెట్ కీపర్ క్లైవ్ మడాండే నుంచి చక్కని సహకారం లభించింది. మడాండే 26 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులతో 37 పరుగులు చేశాడు. జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా (13) ఈ మ్యాచ్ లోనూ విఫలమయ్యాడు. టీమిండియా బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ 3, అవేశ్ ఖాన్ 2, ఖలీల్ అహ్మద్ 1 వికెట్ తీశారు. టీమిండియా ఈ విజయంతో ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ లో 2-1తో ముందంజ వేసింది. ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ జులై 13న జరగనుంది.

## శ్రీలంకతో టీ20 సిరీస్‌కు టీమిండియా కెప్టెన్ ఇతడేనా...?

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమిండియా ఈ నెలాఖరులో శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనలో టీమిండియా 3 టీ20 మ్యాచ్ లు, 3 వన్డే మ్యాచ్ లు ఆడనుంది. టీమిండియా కొత్త కోచ్ గా గౌతమ్ గంభీర్ ప్రస్థానం శ్రీలంక పర్యటనతోనే మొదలు కానుంది. కాగా, సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో... భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని టీ20 సిరీస్ కు హార్దిక్ పాండ్యా కెప్టెన్ గా వ్యవహరించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు బీసీసీఐ పెద్దలు నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. శ్రీలంకతో టీమిండియా జులై 27 నుంచి 30 వరకు 3 టీ20లు... ఆగస్టు 2 నుంచి 7 వరకు 3 వన్డేలు ఆడనుంది. ఇక శ్రీలంకతో వన్డే సిరీస్ లో కేఎల్ రాహుల్ పునరాగమనం చేయడం ఖాయమని తెలుస్తోంది. కేఎల్ రాహుల్ ఇటీవల జరిగిన



టీ20 వరల్డ్ కప్ కు టీమిండియాలో స్థానం దక్కించుకోలేకపోయాడు. టీ20 ఫార్మాట్లో టీమిండియా బెర్తుల కోసం యువ ఆటగాళ్లు పోటీ పడుతుండడంతో, కేఎల్ రాహుల్ కు ఆ ఫార్మాట్లో స్థానం కష్టమే.

## అగ్రస్థానం కోల్పోయిన హార్దిక్

### రెండో స్థానంలోనే సూర్య..



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఐసీసీ టీ20 ర్యాంకింగ్సలో భారత కుర్రాళ్లు తమ ర్యాంకింగ్స్‌ను మెరుగుపరచుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో కేవలం రెండే మ్యాచులు ఆడిన అభిషేక్ శర్మ ర్యాంకింగ్సలో అడుగుపెట్టాడు. తొలి మ్యాచ్‌లో డకౌట్ అయినప్పటికి రెండో టీ20 మ్యాచ్‌లో శతకంతో దుమ్మురేపాడు. ఈ క్రమంలో ఐసీసీ ర్యాంక్సింగ్స్‌లో 75వ స్థానంలో నిలిచాడు. అతడి ఖాతాలో 419 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. అదే విధంగా జింబాబ్వే పై రెండో టీ20లో 47 బంతుల్లో 77 పరుగులతో అజేయంగా నిలిచిన రుతురాజ్ గైక్వాడ్ ఏకంగా 13 స్థానాలు మెరుగుపరచుకున్నాడు. ఏడో ర్యాంకుకు చేరుకున్నాడు. ఇక అదే మ్యాచ్‌లో 22 బంతుల్లో 48 పరుగులు చేసిన నయా ఫినిషర్ రింకూ సింగ్ నాలుగు స్థానాలు మెరుగుపరచుకుని 39వ స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతడి ఖాతాలో 844 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. భారత స్టార్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. సూర్య ఖాతాలో 821 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ మూడు స్థానాలను కోల్పోయి 646 రేటింగ్ పాయింట్లతో పదో ర్యాంకుకు పడిపోయాడు.

**బౌలర్ల విషయానికి వస్తే..**

టీ20 బౌలింగ్ ర్యాంకింగ్సలో ఒక్క భారత బౌలర్ మాత్రమే టాప్-10లో ఉన్నాడు. 644 రేటింగ్ పాయింట్లతో అక్షర్ పటేల్ తొమ్మిదో స్థానంలో ఉన్నాడు. 641 రేటింగ్ పాయింట్లతో కుల్దీప్ యాదవ్ 11వ స్థానంలో ఉండగా.. పేస్ గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా 14వ ర్యాంకులో నిలిచాడు. బుమ్రా ఖాతాలో 627 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. బౌలింగ్ విభాగంలో ఇంగ్లాండ్ స్టార్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ 718 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు.

**ఆల్‌రౌండర్ల విషయానికి వస్తే..**

ఆల్‌రౌండర్ ర్యాంకింగ్సలో టీమ్ ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య అగ్రస్థానాన్ని కోల్పోయాడు. రెండో స్థానానికి పడిపోయాడు. అతడి ఖాతాలో 213 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఇక శ్రీలంక స్టార్ ఆటగాడు వనిందు హసరంగ అగ్రస్థానానికి చేరుకున్నాడు. హసరంగ ఖాతాలో 222 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి.



## ప్రపంచకప్‌లో దారుణ పరాభవం..

### ఇద్దరిపై వేటు

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ జట్టు పేలవ ప్రదర్శన చేసింది. గ్రూప్ దశ నుంచే ఆ జట్టు నిష్క్రమించింది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పొట్టి ప్రపంచకప్‌లో పాక్ జట్టు నిరాశపరచడంతో కెప్టెన్ లేదా కోచ్ లేదా ఇద్దరిపై వేటు వేస్తుందని అంతా భావించారు. అయితే.. అందరి అంచనాలకు భిన్నంగా సెలక్టర్లపై వేటు వేసింది. చీఫ్ సెలక్టర్ వహాబ్ రియాజ్ పై వేటు వేసింది. అంతేకాదండోయ్.. పురుషుల, మహిళల సెలక్షన్ కమిటీలో ఉన్న అబ్దుల్ రజాక్‌ను రెండింటి నుంచి తప్పించింది. జాతీయ సెలక్షన్ కమిటీలో ఇకపై మీ సేవలు ఇక అవసరం లేదంటూ వాళ్లకు విషయాన్ని చెప్పింది. ఈ మేరకు పీసీబీ ఓ ప్రకటనను విడుదల చేసింది. వెస్టిండీస్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇచ్చిన టీ20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ దారుణంగా విఫలమైంది. కనీసం గ్రూప్ దశను దాటలేకపోయింది. అమెరికా, టీమ్ఇండియా చేతిలో ఓటమి పాలు కావడంతో సూపర్ 8కి చేరకుండానే బాబార్ సేన ఇంటి దారి పట్టింది. దీంతో పాక్ జట్టుపై స్వదేశంలో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే కెప్టెన్‌గా బాబర్ ఆజాంను తప్పిస్తారని ప్రచారం జరిగింది. కెప్టెన్ పై వేటు వేయాలా వద్దా అనే విషయాన్ని హెడ్ కోచ్ గ్యారీ కిర్‌స్టన్ కే వదిలివేసినట్లుగా తెలుస్తోంది. పాక్ జట్టులో భారీ మార్పులు తప్పవని టీ20 ప్రపంచ కప్ పరాజయం అనంతరం పీసీబీ చైర్మన్ మోహ్సిన్ నఖ్వీ వెల్లడించారు. అమెరికా, వెస్టిండీస్ పిచ్‌లను అంచనా వేసి, ఆటగాళ్లను ఎంపిక చేయడంలో విఫలమైన సెలక్టర్లలో ఇద్దరిపై వేటు వేసింది. వీరిద్దరిపై వేటు పడడంతో ప్రస్తుతం సెలక్షన్ కమిటీలో మరో ఐదుగురు సభ్యులు మాత్రమే ఉంటారు. హెడ్ కోచ్, కెప్టెన్(సంబంధిత ఫార్మాట్), మహ్మద్ యూసఫ్, అసద్ షఫీక్, బిలాల్ అఫ్జల్, డేటా అనలిస్టు ఉంటారు. కాగా.. పాకిస్తాన్ స్వదేశంలో ఆగస్టు 21 నుంచి బంగ్లాదేశ్‌తో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. అనంతరం ఇంగ్లాండ్‌తో మూడు టెస్టులు ఆడనుంది. ఈ సిరీస్‌కు కూడా పాక్ ఆతిథ్యం ఇవ్వనుంది.

## రూ.2.5 కోట్లు చాలు..

- మిగతా రూ.2.5 కోట్లు వెనక్కి తీసుకోండి
- బీసీసీఐకి ద్రావిడ్ విజ్ఞప్తి



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమిండియా మాజీ ప్రధాని కోచ్, టీ20 వరల్డ్ కప్ 2024ను భారత్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన మాజీ దిగ్గజం రాహుల్ ద్రావిడ్ ఎంత హుందాగా నడుచుకుంటారో తెలియజేసే పరిణామం ఒకటి వెలుగుచూసింది. ఇటీవల టీ20 వరల్డ్ కప్‌ను గెలిచిన భారత జట్టుకు బీసీసీఐ ఏకంగా రూ.125 కోట్ల భారీ రికార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ భారీ మొత్తం నుంచి ఆటగాళ్లతో సమానంగా ప్రధాన కోచ్ ద్రావిడ్‌కు కూడా బీసీసీఐ రూ.5 కోట్లు అందించింది. అయితే ప్రత్యేకంగా తనకు రూ.5 కోట్లు వద్దని, ఇతర కోచింగ్ సిబ్బంది మాదిరిగానే రూ.2.5 కోట్లు ఇస్తే చాలు అని, మిగతా రూ.2.5 కోట్లు వెనక్కి తీసుకోవాలంటూ బీసీసీఐకి రాహుల్ ద్రావిడ్ విజ్ఞప్తి చేశాడు. మిగిలిన సహాయక సిబ్బంది బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ దిలీప్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ మాదిరిగానే తనకు కూడా రూ. 2.5 కోట్లు ఇవ్వాలని, బోనస్ అవసరం లేదని కోరినట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. కాగా ద్రావిడ్ సెంటిమెంట్‌ను గౌరవిస్తామంటూ బీసీసీఐ పేర్కొన్నట్టు ఓ జాతీయ మీడియా సంస్థలో కథనం వెలువడింది. కాగా టీ20 వరల్డ్ కప్ గెలుపులో కీలక పాత్ర పోషించిన కోచింగ్ సిబ్బంది, ఇతర సహాయక సిబ్బందికి కూడా బీసీసీఐ భారీ నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు రూ.5 కోట్లు, ఇతర కోచ్‌లకు రూ.2.5కోట్లు చొప్పున కేటాయించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లతో పోల్చితే ద్రావిడ్ రూ.2.5 కోట్లు ఎక్కువ పొందినట్టు అయింది.

**అండర్-19 వరల్డ్ కప్ గెలిచినప్పుడు కూడా ఇంతే..**

2018లో అండర్-19 ప్రపంచ కప్‌ను భారత్ గెలుచుకున్నప్పుడు జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్న రాహుల్ ద్రావిడ్ ఆ సమయంలో కూడా ఇదే విధంగా వ్యవహరించాడు. రివార్డుగా రూ.50 లక్షలు పొందాల్సి ఉండగా ఇతర సహాయక సిబ్బంది మాదిరిగా తనకు కూడా రూ.20 లక్షలు చాలు అని చెప్పాడు. రూ.30 లక్షలు తిరస్కరించాడు. రివార్డు అందరికీ సమానంగా ఉండాలని ఆ సందర్భంగా పేర్కొన్నాడు. దీంతో కోచింగ్, ఇతర సహాయక సిబ్బంది అందరికీ రూ.25 లక్షలు చొప్పున బీసీసీఐ రికార్డు అందించింది.

## లాభాల బాటలో హ్యుందాయ్

**3.5 బిలియన్ డాలర్లు సమీకరించే యత్నం**




**విశ్వంభర, న్యూఢిల్లీ :** దేశీయ స్టాక్ మార్కెట్లలోకి వరుసగా ఐపీవోలు క్యూ కడుతున్న వేళ ఇదే దారిలో ప్రముఖ ఆటో మేకింగ్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా సైతం నిలిచింది. దేశంలోని అతిపెద్ద ఐపీవోను మార్కెట్లలోకి తీసుకొచ్చేందుకు ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీవో రాబోతోందన్న చర్చ ఊపందుకోగానే ఇన్వెస్టర్ల మదిలో తాము కూడా అందులో పాల్గొనాలనే ఆలోచన మొదలైంది. అయితే ఇక్కడ కంపెనీ విలువ ఎంత అనేది పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది. ఈ క్రమంలో కంపెనీ ఐరీవో ప్రైస్ బ్యాండ్ ధర ఒక్కో షేరుకు రూ.1265 నుంచి రూ.1988 మధ్య ఉండొచ్చని కొన్ని నివేదికల ప్రకారం తెలుస్తోంది. తాజా ఐపీవో ద్వారా భారత స్టాక్ మార్కెట్ల నుంచి కంపెనీ 3.5 బిలియన్ డాలర్లను సమీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం 2024 జనవరి నుంచి జూన్ వరకు దేశంలో 2,72,207 యూనిట్లను విక్రయించడంలో హ్యుందాయ్ విజయం సాధించిందని వెల్లడైంది. గతేడాది ఇదే కాలంలో కంపెనీ అమ్మకాలు 2,66,760 యూనిట్లుగా ఉన్నాయి. అంటే వార్షిక ప్రాతిపదికన కంపెనీ విక్రయాల్లో 2 శాతం పెరుగుదల నమోదైంది. అలాగే ఎఫ్ఏడీఏ నివేదిక ప్రకారం భారతీయ ప్యాసింజర్ వాహనాల మార్కెట్‌లో కంపెనీ వాటా 13.80 శాతంగా ఉంది. దేశంలో మారుతీ సుజుకీ తర్వాత కంపెనీ రెండో స్థానంలో విక్రయాల్లో కొనసాగుతోంది. ఎఫ్‌వై 2009 నుంచి హ్యుందాయ్ మోటార్ ఇండియా భారతదేశంలోని ప్యాసింజర్ వాహన పరిశ్రమలో ఒరిజినల్ పరికరాలను ఉత్పత్తి చేస్తున్న రెండవ కంపెనీ. ఆర్థిక సంవత్సరం 2005-2022 వరకు ప్యాసింజర్ వాహన విభాగంలో దేశం నుంచి అతిపెద్ద ఎగుమతిదారుగా కంపెనీ నిరూపించబడింది. ప్రస్తుత ఐపీవో ద్వారా ప్రమోటర్లు కంపెనీలో తమ వాటాను 17.50 శాతం తగ్గించుకోవచ్చని ఇన్‌క్రెడ్ రీసెర్చ్ సంస్థ వెల్లడించింది. అలాగే నిఫ్టీ ఆటో ఇండెక్స్ పనితీరు చాలా అద్భుతంగా ఉందని పేర్కొంది. గత ఏడాది కాలంలో నిఫ్టీ ఆటో ఇండెక్స్ 68 శాతం పెరిగింది. ఇలాంటి సానుకూల పరిస్థితుల్లో దేశీయ ఇన్వెస్టర్లు ఐపీవో లాంచ్ కాగానే షేర్లను దక్కించుకునేందుకు ఆసక్తి చూపుతారని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# నష్టాల్లో ముగిసిన షేర్ మార్కెట్

**దెబ్బతీసిన మూడు రంగాలు**

**విశ్వంభర, న్యూఢిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఉదయం రికార్డు గరిష్ఠాల వద్ద ప్రారంభమైనప్పటికీ కొద్ది క్షణాల్లోనే అది ఆవిరైంది. ఇన్వెస్టర్లు ప్రధానంగా లాభాల స్వీకరణకు మొగ్గుచూపటంతో ప్రధాన వెయిటెడ్ స్టాక్స్ ఒత్తిడికి గురయ్యాయి. ప్రధానంగా అన్ని రంగాల షేర్లు నష్టాల్లో ప్రయాణాన్ని ముగించాయి. మార్కెట్లు ముగింపు సమయంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 427 పాయింట్లు కోల్పోగా.. మరో కీలక సూచీ నిఫ్టీ 109 పాయింట్లు నష్టంతో ముగిసింది. ఇదే క్రమంలో నిఫ్టీ బ్యాంక్ సూచీ 380 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 156 పాయింట్లను కోల్పోయాయి. ఈ క్రమంలో ఆటో, బ్యాంకింగ్, మెటల్ రంగాలకు చెందిన స్టాక్స్ సూచీలకు కిందకు లాగాయి. బ్యాంక్, క్యాపిటల్ గూడ్స్, ఐటీ, టెలికాం, మీడియా రంగాలు 0.4-2 శాతం మేర క్షీణతను నమోదు




చేసింది. ఇంట్రాడేలో భారీ నష్టాల నుంచి రికవర్ అయిన తర్వాత సూచీలు చివరికి క్షీణతను కొనసాగించాయి. ఎన్ఎస్ఈలో ఏషియన్ పెయింట్స్, ఎస్బీఐ లైఫ్, దివీస్ ల్యాబ్, బ్రిటానియా, గ్రాసిమ్, ఎన్టీపీసీ, హెచ్డీఎఫ్సీ లైఫ్, పవర్ గ్రిడ్, అపోలో హాస్పిటల్స్, సన్ ఫార్మా, అదానీ పోర్ట్స్, ఎయిర్ టెల్, హిందుస్థాన్ యూనీలివర్, టైటాన్, బీపీసీఎల్, టాటా కన్జూమర్, ఓఎన్జీసీ, ఐషర్ మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్ సర్వ్ కంపెనీల షేర్లు లాభాలతో టాప్ గెయినర్లుగా తమ ప్రయాణాన్ని ముగించాయి. ఇదే క్రమంలో మహీంద్రా అండ్ మహీంద్రా, హిందాల్కో, టాటా స్టీల్, టీసీఎస్, హెచ్సీఎల్ టెక్నాలజీస్, హీరో మోటార్స్, ఎస్బీఐ, జేఎస్డబ్ల్యూ స్టీల్, విప్రో, శ్రీరామ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, కోటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, నెస్లే, ఇండస్ఇండ్ బ్యాంక్, కోల్ ఇండియా, అల్ట్రాటెక్ సిమెంట్స్, అదానీ ఎంటర్ ప్రైజెస్, రిలయన్స్, ఐటీసీ కంపెనీల షేర్లు నష్టాల్లో తమ ప్రయాణాన్ని ముగించాయి.

## లాభాల్లో పెన్నీ స్టాక్

### రూ.13కు పెరిగిన రాబడి

**విశ్వంభర, న్యూఢిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్ల ర్యాలీలో పాల్గొన్న అనేక పెన్నీ స్టాక్స్ ప్రస్తుతం మల్టీబ్యాగర్లుగా మారాయి. అప్పట్లో పైసల్లో ఉన్న కంపెనీ షేర్ల ధరలు నేడు రూపాయల్లోకి మారి వేలల్లో ఇన్వెస్ట్ చేసిన పెట్టుబడిదారులకు లక్షల్లో లాభాలను అందుకుంటున్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకోబోతున్నది ఇన్వెస్టర్ల తలరాతను మార్చేసిన పెన్నీ స్టాక్ పల్సర్ ఇంటర్నేషనల్ గురించే. గడచిన ఐదేళ్ల కాలంలో స్టాక్ తన పెట్టుబడిదారులకు మల్టీబ్యాగర్ రిటర్న్ అందించింది. 5 ఏళ్ల కిందట ఒక్కో షేరు ధర కేవలం 10 పైసలుగా ఉన్న పల్సర్ ఇంటర్నేషనల్ ప్రస్తుతం రూ.13కి పెరిగాయి. ఈ క్రమంలో పెట్టుబడిదారులకు ఏకంగా 13220% అద్భుతమైన రాబడిని స్టాక్ అందించింది. ప్రస్తుతం కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.89.45 కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ.14.40గా ఉండగా.. 52 వారాల కనిష్ఠ ధర రూ.6.08వద్ద ఉంది. జూలై 2019లో పల్సర్ ఇంటర్నేషనల్ షేర్లు రూ.1 కంటే తక్కువగా ఉంది. జూలై 10, 2024న కంపెనీ షేర్లు రూ.13.32కి చేరుకున్నాయి. ఎవరైనా ఇన్వెస్టర్ ఐదేళ్ల కిందట కంపెనీ షేర్లలో రూ.లక్ష పెట్టుబడిగా పెట్టి దానిని ఇప్పటి వరకు కొనసాగించి ఉంటే మార్కెట్ విలువ ప్రకారం పెట్టుబడి విలువ రూ.1.33 కోట్లకు చేరుకునేది.




అలాగే మూడేళ్లలో పల్సర్ ఇంటర్నేషనల్ షేర్లు 8212% పెరిగాయి. జూలై 2021లో కంపెనీ షేర్లు 16 పైసల వద్ద ఉన్నాయి. పల్సర్ ఇంటర్నేషనల్ షేర్లు 10 జూలై 2024న రూ.13.32కి చేరుకున్నాయి. గత 6 నెలల్లో కంపెనీ షేర్లు 67% పైగా పెరిగాయి. కంపెనీ పారిశ్రామిక వినియోగ వస్తువులు కొనుగోలు విక్రయంలో ఉంది. కంపెనీ రసాయనాలు, పురుగుమందులు, పెట్రోకెమికల్స్, ఫార్మాస్యూటికల్ ఉత్పత్తుల్లో వ్యవహరిస్తుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో కేంద్రంగా పనిచేస్తున్న కంపెనీ 1990లో స్థాపించబడింది. పల్సర్ ఇంటర్నేషనల్ మార్చి 2024 త్రైమాసికంలో రూ.76 లక్షల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అయితే గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.15.5 లక్షల నష్టాన్ని చవిచూసింది.



# వరుస హిట్స్ కొట్టినా.. ఛాన్సులు మాత్రం కరువాయే..



ఒక్క హిట్ వచ్చిన హీరోయిన్‌నే నిర్మాతలు అస్సలు వదలరు..కానీ అదేంటో మరి వరసగా నాలుగు విజయాలు వచ్చిన తర్వాత కూడా సంయుక్త మీనన్‌కు మాత్రం ఇప్పటికీ అవకాశాలు రావట్లేదు. అవునా.. అలా జరక్కూడదే అనుకుంటున్నారు కదా..! కానీ జరుగుతుందిగా.. సంయుక్త విషయంలో ఇదే జరుగుతుంది. డెవిల్ అనే ఒక్క ఫ్లాప్‌తో ఈమె జాతకం తిరగబడిపోయింది. సంయుక్త మీనన్.. గతేడాది వరకు ఇండస్ట్రీలో బాగా వినిపించిన పేరు ఇది. ఒక్కటి రెండు కాదు.. అమ్మడు నటించిన మొదటి 4 సినిమాలు హిట్ అయ్యాయి. దాంతో సంయుక్త మీనన్ రేంజ్ ఎక్కడికో వెళ్తుంది.. అసలు ఖాళీ లేకుండా ఉంటుందని అనుకున్నారంతా. కానీ అదేం జరుగుతున్నట్లు కనిపించడం లేదు. కళ్యాణ్ రామ్ డెవిల్ తర్వాత ఈమెకు తెలుగులో ఛాన్సులే రాలేదు. భీమ్లా నాయక్‌తో 2022లో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సంయుక్త.. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. ఆ తర్వాత విడుదలైన బింబిసార బ్లాక్‌బస్టర్.. ఇక 2023లోనూ సంయుక్త మాయ కొనసాగింది. సార్‌తో సూపర్ హిట్ కొట్టిన ఈ బ్యూటీ.. విరూపాక్షతో అందర్నీ భయపెట్టేసారు. ఇలా అడుగు పెట్టిన ప్రతీ సినిమా బాగానే ఆడింది. టాలెంట్ ఉంది.. గ్లామర్ షో చేస్తుంది.. అయినా కూడా సంయుక్త మీనన్‌కు ఎందుకు ఆఫర్స్ రావడం లేదనేది అర్థం కాని ప్రశ్నే. వరస హిట్స్ ఇచ్చినా ఈమెకు కోరుకున్న ఛాన్సులైతే రావట్లేదు. డెవిల్ తర్వాత పరిస్థితి మరీ దారుణంగా మారిపోయింది. సంయుక్త మీనన్ కెరీర్ గాడిన పడాలంటే.. ఇప్పటికిప్పుడు ఏదైనా అద్భుతం జరగాలి. మరి అదెప్పుడు జరుగుతుందో చూడాలి.

# జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్!!

బాలీవుడ్‌లో ఇప్పుడు యూనివర్స్‌ల హవా ఎక్కువగా కనిపిస్తుంది. ఏ హీరోను తీసుకున్నా.. ఒక్క సినిమాతో అస్సలు ఆగట్లేదు. చిన్న సినిమా చేసినా కూడా దానికి సీక్వెల్స్ మీద సీక్వెల్స్ చేయాలనుకుంటున్నారు. ఇక స్టార్ హీరోలుంటే.. అస్సలు ఆలోచించట్లేదు దర్శక నిర్మాతలు. ఫస్ట్ పార్ట్ హిట్టైతే చాలు.. యూనివర్స్ అంటున్నారు. వార్ సినిమా విషయంలోనూ ఇదే చేస్తున్నారు మేకర్స్. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కించిన వార్ సూపర్ హిట్ అయింది. దీనికిప్పుడు అయన్ ముఖర్జీ సీక్వెల్ చేస్తున్నారు. మామూలుగా అయితే దీని గురించి పెద్దగా చర్చ మన దగ్గర జరగదు.. కానీ ఎన్టీఆర్ ఉన్నారు కాబట్టి టాలీవుడ్‌లోనూ వార్ 2పై ఇంట్రెస్టింగ్ డిబేట్ నడుస్తుంది. వార్ 2 షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఇందులో ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ పోర్షన్ కూడా సగానికి పైగా పూర్తైంది. హృతిక్, తారక్ కాంబినేషన్ సీన్స్ బ్యాలెన్స్ ఉన్నాయి. వాటిని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని చూస్తున్నారు దర్శకుడు అయన్ ముఖర్జీ. వార్ 2 క్లైమాక్స్‌లోనే సీక్వెల్‌కు సంబంధించిన అప్‌డేట్ ఇస్తారని తెలుస్తుంది. వార్ 2 సినిమాతోనే బాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు జూనియర్ ఎన్టీఆర్. ఈ సినిమాపై రెండు ఇండస్ట్రీల్లోనూ అంచనాలు మామూలుగా లేవు. ఒకవేళ వార్ 2 హిట్టైతే గనక.. కచ్చితంగా సీక్వెల్ వస్తుంది. అందులోనూ జూనియర్ ఎన్టీఆర్ ఉంటారనడంలో సందేహం లేదు.



# పవన్ కళ్యాణ్ సినిమాలో అనసూయ

**అనసూయ భరద్వాజ్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 'జబర్దస్త్' కామెడీ షోతో మంచి క్రేజ్ సంపాదించుకుంది ఈ ముద్దుగుమ్మ. రంగస్థలం, పుష్ప వంటి సినిమాలతో నటిగా తానేంటో నిరూపించుకుంది. ప్రస్తుతం వరుస ఆఫర్స్ తో దూసుకుపోతుంది. అటు సోషల్ మీడియాలోనూ నిత్యం యాక్టివ్‌గా ఉంటుంది ఈ బ్యూటీ. అప్పడప్పుడు ట్రోలర్స్‌కు కూడా గురవుతువుంటుంది. అనసూయ కూడా ఏ మాత్రం తగ్గకుండా బ్యాక్ టు బ్యాక్ పంచులు వేస్తూ ట్రోల్స్ చేసే వారికి గట్టిగా కౌంటర్లు కూడా ఇస్తూ ఉంటుంది. తాజాగా అనసూయ ఇన్‌స్టాగ్రామ్ లో నెటిజన్లతో ముచ్చటించగా వాళ్ళు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు తెలిపింది. ఈ క్రమంలో ఓ పవన్ కళ్యాణ్ అభిమాని.. మీరు పవన్ కళ్యాణ్ గారి మూవీలో ఎప్పడు యాక్ట్ చేస్తారు అని అడిగారు. దీనికి అనసూయ సమాధానమిస్తూ.. ఒక చిన్న పాత్ర చేశాను.. రిలీజ్ అవ్వాలి అని తెలిపింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్, OG, హరిహర వీరమల్లు సినిమాలు చేస్తున్నాడు. వీటిలో ఉస్తాద్ భగత్ సింగ్ షూట్ ఒక్క షెడ్యూల్ జరిగింది. అది ఎలాగో గ్లింప్స్ లో చూపించారు. దీంట్లో అయితే అనసూయ ఉండే ఛాన్స్ లేదు. అనసూయ పవన్ కళ్యాణ్ OG సినిమాలో ఉందా? లేక హరిహర వీరమల్లు సినిమాలో ఉందా? అనేది తెలియాలంటే దీనిపై పూర్తి స్పష్టత వచ్చే వరకు వేచి చూడాలి.**




## 'మిస్టర్ బచ్చన్' సితార్ సాంగ్ వచ్చేసింది..

టాలీవుడ్ మాస్ మహారాజ్ రవితేజనటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మిస్టర్ బచ్చన్'. పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. షాక్, మిరపకాయ్ వంటి సూపట్ హిట్స్ తర్వాత హరీష్ శంకర్, రవితేజ కాంబోలో రాబోతున్న ఈ మూవీ పై భారీ అంచనాలు ఉన్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కన్నడ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించింది. సీనియర్ నటుడు జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే మూవీ నుంచి విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ సొంతం చేసుకోగా.. ఇటీవలే 'సితార్' పేరుతో ఫస్ట్ సింగిల్ ప్రోమో వదిలారు. ఈ ప్రోమో సాంగ్ పై అంచనాలు పెంచగా..నేడు ఫుల్ లిరికల్ వీడియోని రిలీజ్ చేశారు మేకర్స్. ఫారిన్ లో ఉన్న అందమైన లొకేషన్స్ లో ఈ పాటను చిత్రీకరించారు. మిక్కీ జే మేయర్ కంపోజ్ చేసిన ఈ పాటకు సాహితి లిరిక్స్ అందించగా.. సాకేత్, సమీరా భరద్వాజ్ ఆలపించారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. తాజాగా రిలీజైన ఈ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

## భారతీయుడు 2 టికెట్ రేట్లు పెంపునకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్



**లోకనాయకుడు కమల్ హాసన్ హీరోగా భారతీయుడు 2 మూవీ తెరకెక్కిన విషయం తెలిసిందే. శంకర్ దర్శకత్వంలో 28 ఏళ్ల క్రితం వచ్చిన భారతీయుడు సినిమాకు ఇది సీక్వేల్. భారతీయుడు 2 మూవీ జులై 12 నుంచి థియేటర్లలో సందడి చేయనుంది. ఇన్నేళ్ల తర్వాత ప్రేక్షకులు ఎంతో మెచ్చిన సేనాపతి పాత్రతో ప్రేక్షకులను పలకరించబోతున్నారు కమల్. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ట్రైలర్ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంది. ఈ మూవీలో కరుల్ ప్రీత్ సింగ్, సిద్దార్థ్, బాబీ సింహా కీ రోల్స్ పోషించారు. తాజాగా భారతీయుడు 2 మూవీ నిర్మాతలకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. సినిమా టికెట్ రేట్లు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. జులై 12 నుంచి 19 తేదీ వరకు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.50.. మల్టీప్లెక్స్‌లో రూ.75 వరకూ పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అలానే వారం రోజులపాటు ఐదో ఆట ప్రదర్శనకి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే సినిమా స్టార్టయ్యే ముందు.. డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణపై యాడ్స్ ప్రదర్శించేలా కండీషన్ పెట్టింది. ఇటీవల విడుదలైన ప్రభాస్ చిత్రం కల్కి 2898 ఏడీ సినిమాకు కూడా రేట్లు పెంచుకునేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. సినిమా తారలు.. డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో భాగమైతే.. తాము మరింత తోడ్పాడు అందిస్తామని.. సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన విషయం తెలిసిందే.**



# నకిలీ కోడిగుడ్లను గుర్తించటం ఎలా?


**విశ్వంభర, ఫీచర్:** ఇటీవలె మార్కెట్లలో చాలాచోట్ల నకిలీ కోడిగుడ్లు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. గుడ్డులోని పచ్చసొన, గుడ్డులోని తెల్లసొనను సోడియం ఆల్జినేట్, అల్యూమ్, జెలటిన్, తినదగిన కాల్షియం క్లోరైడ్, బెంజోయిక్ యాసిడ్, నీరు, ఫుడ్ కలరింగ్‌తో తయారు చేస్తున్నారు. నకిలీ కోడిగుడ్ల పెంకులను కాల్షియం కార్బోనేట్, పారాఫిన్ వ్యాక్స్, జిప్సం పౌడర్‌తో తయారుచేస్తారు.గుడ్డులోని పచ్చసొన, తెల్లసొనను సోడియం ఆల్జినేట్, జెలటిన్ ను తినదగిన కాల్షియం క్లోరైడ్, ఫుడ్ కలరింగ్‌తో తయారు చేస్తున్నారు. నకిలీ కోడిగుడ్ల పై పెంకు నిజమైన వాటి కంటే మెరుస్తూ ఉంటుంది.నకిలీ గుడ్లు నిజమైన గుడ్లు కంటే గట్టిగా ఉంటాయి. కోడిగుడ్డును షేక్ చేస్తే షెల్ లోపల నీరులా కదలాడుతున్నట్లుంటే అది నకిలీది.గుడ్డును పగలగొట్టిన వెంటనే గుడ్డులోని పచ్చసొన, తెల్లసొన కలిసిపోతే అది నకిలీ కోడిగుడ్డని అర్థం.నిజమైన గుడ్లు నీసు వాసనను కలిగి ఉంటాయి, అయితే నకిలీ గుడ్లు వాసన లేనివిగా వుంటాయి. పాన్‌లో పగులగొట్టి వేసిన కోడిగుడ్డు పచ్చసొన మీరు తాకకుండా వ్యాపిస్తే అది నకిలీ గుడ్డు. కోడిగుడ్డు నకిలీదైతే దాని పెంకుకి మంట పెడితే అది కాలుతూ ప్లాస్టిక్ వాసన వస్తుంది, నిజమైనది త్వరగా కాలదు. నకిలీ కోడిగుడ్ల వల్ల మెదడు, నరాల నష్టం, కాలేయ వ్యాధులు, రక్త ఉత్పత్తిని ప్రభావితం చేయడం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి.

# ప్రభలుతున్న జీకా వైరస్ జ్వరాలు

## ఈ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకండి



**విశ్వంభర, ఫీచర్:** వర్షాకాలం వచ్చిందంటే దోమల బెడద మొదలౌతుంది. దోమల వల్ల మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలు ప్రభలుతాయి. ప్రస్తుతం భయపడుతున్న ఈ రెండు వ్యాధులతోపాటు జికా వైరస్ కూడా తోడైంది. నిజానికి, జికా అనేది దోమ కాటు వల్ల వచ్చే వ్యాధి. ఈ వ్యాధి లక్షణాలు సాధారణ ఫ్లూ మాదిరిగానే ఉంటాయి. ఈ వ్యాధి జ్వరం లక్షణం వల్ల వ్యక్తమవుతుంది. మలేరియా, డెంగ్యూ, జికా లాంటివి దోమల వల్ల వ్యాపిస్తాయి. కానీ ఈ వ్యాధి డెంగ్యూకి భిన్నమైనది. చాలా సందర్భాలలో ఈ వ్యాధి ప్రమాదకరమైనది కావచ్చు. జికా అంటువ్యాధి. ఈ వ్యాధి ఒక వ్యక్తి నుండి మరో వ్యక్తికి సులభంగా వ్యాపిస్తుంది. గర్భిణీ తల్లికి జికా సోకితే.. పుట్టబోయే బిడ్డకు కూడా ఆ వ్యాధి సోకుతుంది. వర్షాకాలంలో దోమల బెడద పెరిగినప్పుడు జికా వ్యాప్తి పెరుగుతుంది. ఈ వ్యాధికి ఇంకా టీకా కనుగొనలేదు. ఈ వ్యాధిని నివారించడం ఒక్కటే మార్గం. వ్యాధిని ప్రారంభంలోనే గుర్తిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదు.



### జీకా వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయంటే..

**జీకా ప్రధాన లక్షణం జ్వరం. తేలికపాటి జ్వరంతో పాటు, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పలు, అలసట, కడుపు నొప్పి ఉంటుంది. అంతేకాకుండా చర్మంపై దద్దుర్లు, కనురెప్పల దిగువ భాగంలో మంట ఉంటుంది. జికా దోమ కుట్టిన తర్వాత 3-14 రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఈ వ్యాధి సోకకుండా ఉండాలంటే దోమలకు దూరంగా ఉండాలి. జికాను నివారించడానికి దోమల నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోవాలి. కాబట్టి ఇంటి లోపల, చుట్టుపక్కల నిల్ల నీరు లేకుండా చూసుకోవాలి. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతాయి. అలాగే ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం, రాత్రి పడుకునేటప్పుడు దోమతెరలు ఉపయోగించడం చేయాలి. దోమలు ఉంటే కాయిల్స్ లేదా మస్కిటో రిపెల్లెంట్ ఆయిల్ వంటివి ఉపయోగించాలి. ఫుల్ స్లీవ్ బట్టలు ధరించాలి. జీకా సోకిన వ్యక్తులకు దూరంగా ఉండాలి.**



# వర్షం నీరు తాగొచ్చా?

**విశ్వంభర, ఫీచర్ :**

వర్షాకాలం మొదలైంది. దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల రాకతో ప్రజలు వేడి నుండి ఉపశమనం పొందుతున్నారు. చాలా చోట్ల వర్షం కారణంగా నీటి కొరత తీరిపోతుంది. దేశంలో నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ప్రజలు వర్షపు నీటిని నిల్వ చేసి తాగేందుకు ఉపయోగిస్తున్నారు. అయితే, ఇక్కడ విషయం ఏంటంటే.. వర్షం నీరు తాగొచ్చా..? వర్షం నీరు మన ఆరోగ్యానికి మేలు చేస్తుందా..? పూర్వకాలంలో వర్షపు నీటిని సేకరించి అవసరమైనప్పుడు తాగేందుకు ఉపయోగించేవారు. ఇప్పుడు కూడా ప్రజలు అలా చేయడం గమనార్హం. ఇంతకు ముందు కాలంలో కాలుష్యం తక్కువగా ఉండేది. అందుకే వాన నీరు పరిశుభ్రంగా ఉండేది. కానీ ఇప్పుడు కాలుష్యం బాగా పెరిగిపోయి వర్షపు నీరు కూడా కలుషితమవడం మొదలైంది. సెంటర్ ఫర్ డిసీజ్ (సీడీసీ) ప్రకారం, వర్షం నీటిలో హానికరమైన వైరస్లు, బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంది. వర్షాకాలంలో ప్రజలు వైరల్ ఇన్ఫెక్షన్ల బారిన పడటానికి ఇదే కారణం.

**వర్షపు నీటిలో సూక్ష్మ కణాలు**

సీడీసీ ప్రకారం, కలుషిత వాతావరణం కారణంగా, వర్షం నీరు కూడా కలుషితమైంది. ఇప్పుడు దానిలో సూక్ష్మ కణాలు కనిపిస్తాయి. ఈ కణాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. ఇది కాకుండా, కుళాయి నీటి కంటే వర్షం నీరు ఎక్కువ ఆల్కలీన్. అందువల్ల, దీన్ని తాగడం వల్ల మీరు అనారోగ్యానికి గురవుతారు. వర్షపు నీరు కలుషితమవుతుంది. కాబట్టి దీనిని తాగడం మానుకోవాలి. అయితే, మీరు ఈ నీటిని ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించవచ్చు. పాత్రలు, బట్టలు ఉతకడం, ఇంటిని శుభ్రం చేయడం, మొక్కలకు నీరు పెట్టడం వంటి పనులకు వర్షపు నీటిని ఉపయోగించవచ్చు. ఇకపోతే, గర్భిణీలు, వృద్ధులు, శిశువులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు వర్షపు నీటిని అస్సలు తాగకూడదు. వర్షపు నీరు తాగడం వారి ఆరోగ్యానికి హానికరం. నీటి కొరత ఉన్న ప్రదేశంలో నివసిస్తున్న వారు ఎక్కువగా వర్షపు నీటిపై ఆధారపడుతుంటారు. అలాంటి వారు వర్షపు నీటిని మరిగించి తాగొచ్చు. వర్షపు నీటిని మరిగించడం వల్ల అందులో ఉండే బ్యాక్టీరియా, వైరస్‌లు నశిస్తాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com